ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





ఏడుగురిపై వేటు!

- ఇప్పటికే ఎంపీడీవో సస్పెన్షన్
- మరో ఆరుగురిపై చర్యలకు సన్నద్ధం
- 'ఆంధ్రజ్యోతి' కథనాలకు స్పందన
- మరుగుదొడ్ల అక్రమాలపై కదిలిన యంత్రాంగం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మరుగుదొడ్ల నిర్మాణాల్లో జరిగిన అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

(విజయనగరం-ఆంధ్రజ్యోతి/కొమరాడ)

మరుగుదొడ్ల నిర్మాణంలో చోటుచేసుకున్న అక్రమాలపై పోస్టుమార్టం జరుగుతోంది. ఇప్పటికే కొమరాడ మండలాభివృద్ధి అధికారి విజయలక్ష్మిని కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఎంపీడీవోకు మెయిల్ ద్వారా పంపించారు. ఇదిలా ఉండగా మరో ఆరుగురిపై వేటుకు రంగం సిద్ధం చేశారు. సంబంధిత కార్యాలయ బాధ్యుల ద్వారా ఉత్తర్వులు అందించేందుకు వీలుగా కలెక్టర్ ఆదేశించారు. మరో ఆరుగురిపై వేటు పడనుంది. ఇందులో వెలుగు ఏపీఎం, ఇద్దరు ఏపీవోలు,

- మిగతా 9 లో



మాట్లాడుతున్న మంత్రి అశోక్

అన్నదాతకు అండగా..

- పార్టీ, ప్రభుత్వం కృషి
- ఎంపీపీల మార్పు స్థానిక బాధ్యతే
- మంత్రులు అశోక్, సుజయ్

వివరాలు 9లో

హత్య!

- పుట్టినరోజు వేడుకల్లో విషాదం
- మెమొరీ కార్డు పెట్టిన చిచ్చు
- మెంటాడ మండలంలో సంఘటన

8లో



పొట్టియ్య మృతదేహం

ఎల్‌హెచ్‌ఎంఎస్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ త్రినాథ (ఫైల్)



భద్రతకు భరోసా

ఇంటి సంరక్షణకు పోలీసుశాఖ వినూత్న ప్రయోగం

లాక్డ్ హౌస్ మానటరింగ్ సిస్టమ్ ద్వారా ఇంటి యజమానులకు మరింత రక్షణ



పూర్తి వివరాలతో ఉన్న ఎల్‌హెచ్‌ఎంఎస్ పోస్టర్

(పార్వతీపురం టౌన్)

ఒకప్పుడు కుటుంబ సభ్యులు రెండు, మూడు రోజులు తీర్థ యాత్రలు, విహార యాత్రలకు వారు.. తమ ఇంటి గురించి భయాందోళనలు చెందేవారు. వారి అదృష్టం బాగుండి క్షేమంగా యాత్రలు ముగించుకుని తిరిగి ఇంటికి వచ్చినా.. తమ ఇల్లు ఆస్తులపై కొంత భయం ఉండేది. తమ సొత్తును ఎవరైనా దొంగిలించుకుపోయే ప్రమాదం ఉంటుందని, తగిన రక్షణ ఏర్పాట్లు చేయాలని పరితపించేవారు. ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నా కొన్ని ఇళ్లల్లో చోరీ జరిగేవి. వీటిని చెక్ చెప్పేందుకు పోలీసు శాఖ వినూత్న ప్రయోగం చేపట్టింది. ఇక నుంచి ఎవరైనా తీర్థయాత్రలు, విహార యాత్రలకు వెళ్లేవారు పోలీసుశాఖ వారికి సమాచారం అందిస్తే ఇంటి భద్రతకు పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు ముందుకు వస్తోంది. అందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటోంది.

(ఎల్‌హెచ్‌ఎంఎస్) లాక్డ్ హౌస్ మానటరింగ్ సిస్టమ్‌తో..

ఎల్‌హెచ్‌ఎంఎస్ విధానాన్ని ఎలా ఉపయోగించుకోవాలో పోలీసు శాఖ తెలిపింది. హ్యాండ్‌రెయిడ్ సెల్‌ఫోన్ ఉన్న వారు ముందుగా ఏపీ పోలీస్ యాప్‌లోకి వెళ్లి అందులో సంబంధిత ఇంటి యజమానుల చిరునామా, సెల్ నెంబర్ తదితర వివరాలను దరఖాస్తులో నింపి పంపించాలి. దాన్ని పోలీసు శాఖ ఆమోదిస్తే రిజస్ట్రేషన్ యూనిక్ ఐడీ ఇస్తారు.

● ఎప్పుడైనా ఇంటికి తాళం వేసి తీర్థయాత్రలు, విహార యాత్రలకు వెళ్లేటప్పుడు యాప్‌లోకి రిక్వస్టు వాచ్‌లో ఫలానా రోజు నుంచి ఫలానా రోజు వరకు ఇంటికి తాళం వేసి వెళ్తున్నట్లు వివరాలు పేర్కొనాలి.

● ఆయా రోజుల్లో ఇంట్లో ఉండమని పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది.

● సమాచారం ఇచ్చిన రోజు నుంచి మీ ఇంటికి వచ్చి వైర్లెస్ మోషన్ కెమెరాను, మోడెమ్‌ను ఏర్పాటు చేస్తారు.

● అప్పటి నుంచి మీ ఇల్లు నిఘాలో ఉంటుంది. కెమెరాను పోలీసు కంట్రోల్ రూమ్‌కు, ఇంటి యజమాని మొబైల్‌కు అనుసంధానం చేస్తారు.

● కెమెరా ముందు ఏవైనా కదిలికలు జరిగితే వెంటనే ఫోటోలు, వీడియోలు రికార్డ్ చేసి కంట్రోల్ రూమ్‌కు పంపే సౌకర్యం ఉంటుంది.

● ప్రజలంతా పైన తెలిపిన పూర్తి వివరాలతో పాటు ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీస్ యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకొని పోలీసులకు సహకరించాల్సి ఉంటుంది.

● పైసేవలన్నీ ఉచితంగాను చేస్తున్నట్టు పోలీసుశాఖాధికారులు చెబుతున్నారు.

స్వప్నం సాకారం..

చెక్‌డ్యాం ద్వారా పొలాలకు దొండమానుల గెడ్డ నీరు

హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



చెక్‌డ్యాంలో చేరిన దొండమానుల గెడ్డ నీరు

సాలూరు రూరల్: దొండమానుల గెడ్డ నుంచి సాగునీరు అందుకోవాలన్న రైతుల కల సాకారమైంది. పెదపథం పంచాయతీ పరిధిలో ఉన్న ఈ గెడ్డ కింద వంద ఎకరాల ఆయకట్టు భూములున్నాయి. ఈ గెడ్డపై గేదెల వారి పొలాల సమీపంలో చెక్‌డ్యాం లేకపోవడంతో వర్షపు నీరు వృథాగా కూర గెడ్డలోకి వెళ్లేది. దీంతో పొలాల పక్కనే గెడ్డ ఉన్న సాగునీరుకు రైతులు ఇబ్బందులు పడే వారు. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పథకంలో పార్వతీపురం ఐటీడీఏ ఈ గెడ్డపై రూ.18 లక్షలతో చెక్‌డ్యాం నిర్మించింది. అలాగే ఫీల్డ్ చానల్‌ను కూడా నిర్మించింది. దీంతో రైతులకు ప్రయోజనం చేకూరింది. ఈ పనులను ఐటీడీఏ గత ఏఈ నాగభూషణం ఆధ్వర్యంలో సాగాయి. ఈ చెక్‌డ్యాంనకు ఫీల్డ్ చానల్ నిర్మించడంతో పాటు ఈ గెడ్డ నీరు దిగువ నున్న తామర చెరువులోకి వెళ్లే విధంగా లింక్ చానల్‌లా కలిపారు. కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు చెక్‌డ్యాంలో నీరు చేరడంతో దాదాపు వందెకరాలకు సాగు నీరందుతుంది. అలాగే తామర చెరువునకు ఈ గెడ్డ నీరు చేరడం ద్వారా మరో 70 ఎకరాలకు సాగునీరందనుంది. ఈ గెడ్డ ద్వారా సాగునీరు నేరుగా పొలాలకు అందుబాటులోకి రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.




ఫీల్డ్ చానల్ ద్వారా పొలాలకు వెళ్తున్న సాగునీరు

కళ


జాలువారిన.. సోయగాలు

● రంగుల చిత్రాలతో అద్భుతాలు ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు

● పలువురి ప్రశంసలు











(నెల్లిమర్ల)

ఆ యువకుడు కుంచె పడితే అద్భుతాలు ఆవిష్కృతమవుతాయి. కేవలం ప్రకృతి సౌందర్యాలే కాకుండా దేశ నాయకులు, ప్రముఖుల చిత్రాలను ఆతని కుంచెలో జాలువారుతాయి. పెయింటింగ్‌లో కనీస విద్యార్హతలు గాని, గురువు దగ్గర శిక్షణ పొందడం గాని చేయకుండానే ఆ యువకుడు పెయింటింగ్‌లో రాణిస్తూ పలువురి మన్ననలు పొందుతున్నాడు. నెల్లిమర్ల మండలం కొండగుంపాం గ్రామానికి చెందిన మహంతి శ్రీనివాసరావు కళా నైపుణ్య విజయ గాథ ఇది. మనసులో తొలిచిందే తడవుగా గోడలపై, బ్యానర్లపైన చిత్రాలను రంగులతో ఆవిష్కరించే నేర్పరి శ్రీనివాసరావు. పుట్టుకతోనే పెయింటింగ్‌పై ఆసక్తి ఉన్న శ్రీనివాసరావు ఏకలవ్య శిష్యుడి వలే తనంతట తానే సాధన చేస్తూ మంచి చిత్రకారుడిగా పేరొందాడు. ప్రధానంగా పాఠశాల గోడలపై, ప్రభుత్వ కార్యాలయ గోడలపైన చిత్రాలను వేయించుకునేందుకు ఈ ప్రాంత ప్రజలు, అధికారులు, నాయకులు అతని కోసం నిరీక్షిస్తుంటారు. చిత్రాలను వేసేందుకు సైతం పెద్దగా ఆశించకుండానే ఈ ప్రాంతంలో అందరికీ బొమ్మలను గీస్తుంటాడు.

రంగుల చిత్రాలను గీయడమే తన హాబీ అని చెబుతుంటాడు. ఇంటర్మీడియేట్ వరకు చదువుకున్న శ్రీనివాసరావు చిత్రాలను గీయడంపైనే ఆసక్తిని పెంచుకున్నాడు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఉంటే శ్రీనివాసరావు ఈ రంగంలో రాణించేందుకు మరింత అవకాశం ఉంటుంది. ఈయన గీసిన దేశ ప్రముఖుల చిత్రాలను చూస్తే ఆయన కళా నైపుణ్యం ఏమిటో ఇట్టే అర్థమవుతుంది.









చిత్రకారుడు మహంతి శ్రీనివాసరావు

భారీ వర్షంతో ప్రజల ఇక్కట్లు

పార్వతీపురం : పార్వతీపురం పట్టణంలో ఆదివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బయటకు రాలేని పరిస్థితిలో నెలకొనడంతో అవస్థలు పడ్డారు. కుండ పోతగా కురిసిన వర్షానికి పట్టణంలోని లోతట్టు ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారులు జలమయమ య్యాయి. శనివారం కూడా వర్షం ముమ్మరంగా కురవడంతో లోతట్టు ప్రాంతాలు ముంపుబారినపడ్డాయి. వరుసగా వర్షాలు కురుస్తుండటంతో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెద్ద వ్యాపారుల నుంచి చిరు వ్యాపారుల వరకు వ్యాపారం లేక ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై వర్షపు నీరు ప్రవహించడంతో తోపుడుబళ్ల వ్యాపారులు తమ వ్యాపారం సాగక ఇక్కట్లుపడ్డారు.

ఫ్లైఓవర్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

● పరిష్కారమైన సాంకేతిక సమస్యలు ● పనులకు సిద్ధమవుతున్న ఆర్‌అండ్‌బీ అధికారులు
● ఫలించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కృషి ● హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజా ప్రతినిధులు

పార్వతీపురం టౌన్ : స్థానిక నవరత్న థియేటర్, బైపాస్ రహదారి జంక్షన్ నుంచి నిర్మించాల్సిన ఫ్లైఓవర్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ పడింది. కొన్ని రోజులుగా సాంకేతిక సమస్యలు ఎదురవడంతో పనులు చేపట్టేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్, ప్రజాప్రతినిధులు ఇబ్బం దులు పడేవారు. ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, వైస్‌ఛైర్మన్ బెలగాం జయప్రకాష్ నారాయణతో పాటు మున్సిపాల్టీ పాలకవర్గ సభ్యులు ఆర్డీవో బి.సుదర్శనదొర, రెవెన్యూ అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. వీటి ఫలితంగా ప్రజా ప్రతినిధులు, అధి కారులు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లేందుకు మార్గాన్ని నిర్ధేశించుకోవడంతో పనులు చేపట్టేందుకు మార్గం సుగమం అయ్యింది.

పరిష్కారం దిశగా సాంకేతిక సమస్యలు..

కొన్ని రోజులుగా బైపాస్ రోడ్డుకు అనుకొని నవరత్న థియేటర్ కూడలి వద్ద ఉన్న పట్టణానికి చెందిన వ్యాపారి బొడ్డేపు రామకృష్ణ భవనం ఫ్లైఓవర్ నిర్మాణానికి అడ్డంకిగా ఉండేది. దీని విషయమై ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు, ఆ వ్యాపారితో సంప్రదింపులు జరిపారు. భవనం కూల్చి వేయడం వల్ల తాను తీవ్రంగా నష్టపోతానని వ్యాపారి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. దీంతో వ్యాపారి తరపున మున్సిపల్ వైస్‌ఛైర్మన్ జయప్రకాష్‌నారాయణ శనివారం ఆర్డీవో సుదర్శనదొరతో చర్చించారు. వ్యాపారి రామకృష్ణకు మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కోరారు. దీనికి ఆర్డీవో సమ్మతించడంతో బ్రిడ్జి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లయ్యింది.


ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేస్తున్న సిబ్బంది

ఫలించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే కృషి ..

ఐదేళ్ల క్రితం ప్రారంభమైన ఫ్లైఓవర్ నిర్మాణం ఎన్నో అడ్డంకుల వల్ల నత్తనడకన సాగింది. ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులకు దీని నిర్మాణం సవాల్‌గా మారింది. సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. వీరి విన్నపాన్ని స్వీకరించిన సీఎం ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించి సమస్యలను పరిష్కరించాలని ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. దీంతో 2015 నుంచి పనుల్లో కదిలిక వచ్చింది. పట్టువదలని విక్రమార్కు డిలా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, వైస్‌ఛైర్మన్ బెలగాం జయప్రకాష్ నారాయణ, పాలకవర్గ సభ్యులు అహర్నిశలు శ్రమించారు. ఆరు నెలల్లో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే శ్రీకాకుళం జిల్లాకు వెళ్లే ప్రయాణికులతో పాటు పట్టణ ప్రజలకు పెద్ద సమస్య పరిష్కారమవుతుందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

6 నెలల్లో పనుల పూర్తికి రంగం సిద్ధం

పార్వతీపురం ఫ్లైఓవర్‌తోపాటు సీతానగరం, బొబ్బిలి ఫ్లైఓవర్ పనులు కూడా ప్రారంభమయ్యాయి. వాటి నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవాలు కూడా జరిగిపోయాయి. కొన్ని సాంకేతిక ఇబ్బందులతో పార్వతీపురం ఫ్లైఓవర్ నిర్మాణం మందకొడిగా సాగింది. సమస్యలు పరిష్కారం కావడంతో నిర్మాణ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ సిద్ధమయ్యారు. అన్ని సజావుగా సాగితే వచ్చే జనవరికి నిర్మాణం పూర్తి చేసేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

మున్సిపల్ ఛైర్‌పర్సన్ శ్రీదేవి


11వ వార్డులోని పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలిస్తున్న ఛైర్‌పర్సన్ శ్రీదేవి, కౌన్సిలర్లు

పార్వతీపురం టౌన్ : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా జీవించగలమని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి అన్నారు. పట్టణంలోని 11వ వార్డులో ప్రత్యేక పారిశుధ్య పనుల్లో భాగంగా కాలువల్లో పూడికలు తీయడానికి ఆమె ఆదివారం పరిశీలించారు. వర్షాకాలంలో మురుగు, వరదనీరు ఇళ్ల ముందు నిలిచిపోకుండా ఎప్పటికప్పుడు కాలువల్లో పూడికలు తీయాలని మున్సిపల్ ప్రజారోగ్యశాఖాధికారులకు సూచించారు. అలాగే వర్షాలు విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రతగా ప్రజారోగ్యశాఖాధికారులు, సిబ్బంది, కార్మికులు పరిసరాల పరిశుభ్రతపై ఆయా వార్డుల్లో ఉన్న ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రతి ఒక్కరికి తెలియాలంటే మహిళా సంఘాలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తల సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. ఇక శుభ్రత, ఆరోగ్య రక్షణకు సంబంధించి స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు తమవంతు సహాయ సహకారాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బార్నాల సీతారాం, రెడ్డి రవికుమార్, కోమటి వెంకటరావు, ఆ వార్డు జన్మభూమి కమిటీ సభ్యులు తాడ్డి శంకరరావు పాల్గొన్నారు.

ఐకమత్యాన్ని మర్చిపోవద్దు

జిల్లా స్వర్ణకార సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

పార్వతీపురం టౌన్ : సంఘ సభ్యులు ఐకమత్యమే సగం బలమని మర్చిపోవద్దని జిల్లా స్వర్ణకార సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జానా ప్రసాదరావు, పెదగాడి ప్రసాదరావు పేర్కొన్నారు. ప్రధాన రహదారిలో గల పార్వతీదేవి ఆలయంలో పట్టణ స్వర్ణకార సంఘ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రాష్ట్ర విశ్వబ్రహ్మణ సంఘ కార్పొరేషన్ డైరెక్టర్ ముగడ సత్యనారాయణ సన్మానసభకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వబ్రహ్మణుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అమలుచేసి ఆదుకోవాలని కోరారు. సంఘ సభ్యులు కూడా తమ సమస్యల పరిష్కారానికి ఐక్యమత్యంతో పనిచేయాలన్నారు. మన ప్రాంతం నుంచి రాష్ట్ర విశ్వ బ్రహ్మణ సంఘ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సత్యనారాయణ ఎంపికవ్వడం మన అదృష్టమని తెలిపారు. అనంతరం రాష్ట్ర సంఘం ముద్రించిన గుర్తింపు కార్డులను స్వర్ణకార సంఘ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ స్వర్ణకార సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బూరగాన రంగారావు, మార్ని సూర్యారావు, కోశాధికారి కె.సూర్యభగవాన్, ఉపాధ్యక్షుడు, పట్నాల కోటేశ్వరరావు, ఉపకార్యదర్శి పట్నాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.


సత్యనారాయణను సన్మానిస్తున్న స్వర్ణకార సంఘ సభ్యులు

అమ్మ దయవుంటే అన్నీ ఉన్నట్టే..

యజ్ఞ వైభవ ప్రసంగీకులు వెంకట అప్పారావు

పార్వతీపురం టౌన్ : అమ్మ దయవుంటే అన్నీ ఉన్నట్టేనని యజ్ఞవైభవ ప్రసంగీకులు సిరిగుడి వెంకట అప్పారావు పేర్కొన్నారు. పట్టణంలోని దుర్గగుడివీధి శ్రీసర్వమంగళాదేవి పీఠంలో జరుగుతున్న హోమ సహస్ర చండీ యాగానికి ఆయన ఆదివారం విచ్చేశారు. ఈ సందర్భంగా శ్రీసర్వమంగళాదేవి పీఠాధిపతి, యజ్ఞకర్త మలిచేటి రాజీవ్‌రెడ్డి కుటుంబ సభ్యులు వెంకట అప్పారావుకు పూరకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలికాలంలో ఇలాంటి యజ్ఞాలు, హోమాలు నిర్వహించడం వల్ల ప్రతి ఒక్కరి మానసిక అశాంతులు తొలగి సుఖంగా జీవిస్తారన్నారు. అలాగే సాలూరు కామాక్షిదేవి పీఠం వ్యవస్థాపకులు ముద్దు సత్యనారాయణ, హోమ సహస్ర యాగానికి విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి విశిష్టతను తెలియజేసారు.

రేస్ ఫౌండేషన్ ఆవిష్కరణ

హోమ సహస్ర చండీయాగం యజ్ఞకర్త మలిచేటి రాజీవ్‌రెడ్డి శ్రీసర్వమంగళాదేవి ఆలయ ఆవరణలో రేస్ ఫౌండేషన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు రేస్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. అలాగే ఆలయంలో మధ్యాహ్నాం మూడు గంటల నుంచి రాయగడ జిల్లా జేకేపూర్‌కు చెందిన 50 మంది మహిళలు భగవద్గీత పారాయణం చేశారు.


అమ్మవారి పూజల్లో పాల్గొన్న వెంకట అప్పారావు

వరహాలగెడ్డకు వరద నీరు


వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్న వరహాలగెడ్డ

పార్వతీపురం టౌన్ : రెండు రోజులుగా విస్తృతంగా కురుస్తున్న భారీ వర్షాలతో పట్టణం గుండా వెళ్తున్న వరహాలగెడ్డలో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆదివారం ఉదయానికి వరద మరింత అధికమయింది. పెదమరికి వద్ద వరహాలగెడ్డ రిజర్వాయర్‌లోని నీరు నిల్వకు ఉంచిన షట్టర్‌లు మరమ్మతులకు గురికావడంతో గెడ్డలో వరదనీరు ఎక్కువగా ప్రవహిస్తోంది. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖాధికారులు చెబుతుండడంతో వరహాలగెడ్డ రెండో పాయని ఆనుకొని ఉన్న జనశక్తి కాలనీ, గెడ్డవీధి వాసులు భయాందోళనలు చెందుతున్నారు. వేణుగోపాల్ థియేటర్ మలుపు నుంచి బైపాస్ కాలనీ వరకు గల గెడ్డలో మట్టి దిబ్బలు పేరుకుపోయాయి. గెడ్డలో నీటి ఉధృతి పెరిగితే ప్రధాన రహదారి గుండా రాకపోకలు సాగించే వారికి ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. వరద నీరు మళ్లింపునకు అధికారులు చర్యలు చేపట్టాలని సమీప వాసులు కోరుతున్నారు.

ఆకట్టుకుంటున్న మహాగణపతి

పార్వతీపురం టౌన్ : పట్టణంలోని ప్రధాన రహదారిలో గల వేణు గోపాల్ థియేటర్ పక్కన వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన శంకరుడు, పార్వతీ తనయుడు వినాయకుడుతో పాటు దేవగనం భక్తులను ఆకట్టుకుంటున్నాయి. మంచు కొండల మధ్య వినాయకుడు దేవతాగనం మధ్య నృత్యం చేసేలా ఉన్న విగ్రహం చూసేవారికి ఆకర్షిస్తోంది. భక్తులను గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఈ విగ్రహాలను ఏర్పాటు చేశారు.



కేంద్ర మంత్రికి సమస్యల స్వాగతం

● ముందుకు సాగని సాగునీటి ప్రాజెక్టుల పనులు
● బైపాస్ రహదారి పనులకు మంజూరు కాని నిధులు ● ప్రజల ఆందోళన

పార్వతీపురం : కేంద్రమంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు పార్వతీపురం డివిజన్ పరిధిలో గల గరుగుబిల్లి, పార్వతీపురం పట్టణంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సోమవారం వస్తున్నారు. ఈ ప్రాంతంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఈ ప్రాంత ప్రజలు కేంద్ర మంత్రిని కోరుతున్నారు. జంఝావతి రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి మిగిలిన పనులు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు పూర్తి చేయడంలో జంఝావతి ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీని వల్ల రైతులు సాగునీటికి దూరమవుతున్నారు. దీనిపై కేంద్ర మంత్రి ప్రత్యేక దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. ఇక తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ద్వారా అందాల్సిన ఆర్థిక సహాయం సుమారు రూ.78 కోట్లు మంజూరులో జాప్యం జరుగుతోంది. దీనిపై దృష్టి కేంద్రీకరిస్తే తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు మిగిలిన పనులు చేపట్టే అవకాశం ఏర్పడుతుంది. ఇదిలా ఉండగా పార్వతీపురం పట్టణ శివారు నుంచి బైపాస్ రహదారి నిర్మాణానికి కేంద్రమంత్రి నిధులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటే పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుంది. అలాగే పార్వతీపురం పట్టణ ప్రజల తాగునీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం ద్వారా చేపట్టాల్సిన పథకానికి నిధులు మంజూరు కాకపోవడంతో ఆ పథకం నేటికీ ప్రారంభం కాలేదు. నిధులు మంజూరుకు మంత్రి కృషి చేస్తే పట్టణ ప్రజలు ఎన్నో ఏళ్లగా ఎదురు చూస్తున్న తాగునీటి పథకానికి మోక్షం లభిస్తుంది. దీంతో పాటు ఈ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు సంబంధించి చేపట్టే పనులు త్వరితగతిన పూర్తై ఇటు ప్రజలకు, రైతులకు నీటి కష్టాలు తీరుతాయని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. అందుకు కేంద్రమంత్రి దృష్టి సారించి నిధుల మంజూరుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



పెండింగ్ పనులకు నోచుకోని జంఝావతి జలాశయం

సూర్యపీఠంలో విశ్వ శాంతి హోమాలు

పార్వతీపురం టౌన్ : స్థానిక సూర్యపీఠంలో గణేష పంచాయతన పూజల్లో భాగంగా వేమకోటి నరహరిశాస్త్రి ఆధ్వర్యంలో విశ్వశాంతి హోమాలు ఆదివారం నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి పూజాదికాలు నిర్వహించారు. సూర్యశాంతి పారాయణాలు, విశ్వశాంతి మానవ హోమాలు జరిగాయి. ఈ సందర్భంగా శాస్త్రి మాట్లాడుతూ మానవాళి సుభిక్షంగా ఉండేందుకు విశ్వశాంతి హోమాలు నిర్వహించామన్నారు. మతాలకు అతీతంగా సమాక్య భావంతో దైవ కార్యాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వి.వివేకానంద, వి.తేజ, వి.ఆదిత్య, తదితరులు వైదిక సహకారాన్ని అందించారు.

మొక్కలు నాటేందుకు సర్వం సిద్ధం



మొక్కలు నాటే కార్యక్రమానికి భూమి చదును, రక్షణ తెరలను ఏర్పాటు చేస్తున్న అధికారులు

పార్వతీపురం టౌన్ : పట్టణంలోని కొత్తవలస సత్యనారాయణ స్వామి ఆలయం పక్కన కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు, రాష్ట్ర మంత్రి సుజయ్‌కృష్ణరంగారావు వనం-మనం కార్యక్రమంలో భాగంగా సోమవారం మొక్కలు నాటేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర గ్రామ సమీపంలోని ఉద్యన వన యూనివర్సిటీ క్యాంపస్‌లో జరిగే సంకల్ప సిద్ధి కార్యక్రమానికి విచ్చేస్తున్న మంత్రులు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారని మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం ఏఈ ఆనంద్‌కుమార్ తెలిపారు.

భారీ వాహనాలతో ఇక్కట్లు



ప్రధాన రహదారిలో ఆగివున్న లారీతో వాహనచోదకుల ఇక్కట్లు

పార్వతీపురం టౌన్ : పట్టణ రహదారిలో భారీ వాహనాల రాకపోకలు సాగించడంతో పాదచారులు, ద్విచక్ర వాహనచోద కులు ఇబ్బందులుపడుతున్నారు. ఆదివారం కూడా భారీ వాహనాలు ఇష్టారాజ్యంగా రాకపోకలు సాగించడంతో ఆ మార్గంలో వెళ్లేవారు అవస్థలుపడ్డారు. ఉదయం ఎనిమిది గంటల తర్వాత ప్రధాన రహదారిలో భారీ వాహనాల తిరగకూడదని పోలీసుశాఖ నిబంధనలు విధించినా భారీ వాహనాల చోదకులు పట్టించుకోవడం లేదు. దీంతో పాదచారులు, ద్విచక్ర వాహనచోదకులు ఇక్కట్లు పడుతున్నారు. సోమవారం నుంచి శనివారం వరకు విద్యార్థులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, వ్యాపార వర్గాలు తమ తమ పనుల్లో బిజీ బిజీగా ఉంటారు. ఆదివారం ప్రశాంతంగా ప్రధాన రహదారిలో రాకపోకలు సాగించాలనుకునే వారికి భారీ వాహనాలతో అవస్థలు తప్పడం లేదు. పోలీసుశాఖాధికారులు నిబంధనలను అతిక్రమించిన భారీ వాహనాల చోదకులపై కఠిన చర్యలు చేపట్టాలని పలు ప్రజా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

ఘనంగా అన్నసమారాధన

పార్వతీపురం : మండలంలోని చినబొండపల్లి, వెంకంపేట, తదితర ప్రాంతాల్లో వినాయక ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం పెద్ద ఎత్తున అన్నసమారాధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యువత పెద్ద ఎత్తున సహకారాలను అందించారు. వెంకంపేట, చినబొండపల్లి, తదితర గ్రామాల్లో నిర్వహించిన అన్నసమారాధనకు ఆయా గ్రామాల్లో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు తదితరులు పెద్దఎత్తున వచ్చి సహాయ సహకారాలు అందించారు.

విద్యుత్ కోతలతో ప్రజల ఇక్కట్లు

పార్వతీపురం : నిరంతరం 24 గంటలు విద్యుత్ సరఫరా చేపడుతున్నామని ఏపీ ట్రాన్స్‌కో అధికారులు ప్రకటనలు గుప్పిస్తున్నా, వాస్తవరూపం దాల్చడం లేదు. పార్వతీపురం పట్టణంలో అప్రకటిత విద్యుత్ కోతలతో వినియోగదారులు ఇబ్బందులుపడుతున్నారు. విద్యుత్‌ను నిరంతరం సరఫరా చేస్తున్నామని అధికార యంత్రాంగం చెబుతున్నా ఆ పరిస్థితి పట్టణంలో కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడైనా విద్యుత్ సరఫరా నిలిచిపోతే పునరుద్ధరించాలని అధికారులను ఆ విషయమై స్పందించడం లేదు. గాలి, వర్షం వచ్చే సమయంలో ఎలాగూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. అయితే సాధారణ సమయాల్లో కూడా విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో విద్యుత్ సహకారంతో పనిచేసే వెల్డింగ్, జిరాక్స్, కంప్యూటర్ తదితర వ్యాపారులు తమ జీవనోపాధిని కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా దీనిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి విద్యుత్ సరఫరా నిరంతరం కొనసాగేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నేడు ఐటీడీఏలో

కలెక్టర్ గ్రీవెన్స్

పార్వతీపురం : పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయంలో కలెక్టర్ వివేక్‌యాదవ్ సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ముందుగా డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం చేపట్టి అనంతరం గ్రీవెన్స్ నిర్వహిస్తారు. కలెక్టర్‌తో పాటు ఐటీడీఏ పీవో డాక్టర్ లక్ష్మీశ, తదితరులు హాజరుకానున్నారు.

వినతులపై పరిష్కారం అంతంత మాత్రమే..

కలెక్టర్ వివేక్‌యాదవ్ మీకోసం కార్యక్రమం ద్వారా నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌లో వివిధ సమస్యలపై ప్రజలు అందిస్తున్న వినతులను పరిష్కరించడంలో అధికార యంత్రాంగం తూతూమంత్రంగా వ్యవహరిస్తోందని ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. సమస్యలపై వినతులను అందిస్తున్నప్పటికీ అవి పూర్తిస్థాయిలో పరిష్కారానికి నోచుకోవడం లేదని పలువురు అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో తాగునీరు, సాగునీరు తదితర సమస్యలపై వినతులు అందిస్తున్నప్పటికీ పరిష్కారం కావడం లేదన్నది గిరిజన ప్రాంతాల ప్రజల ఆవేదన. ఇప్పటికైనా కలెక్టర్ తీసుకుంటున్న వినతులను పరిశీలించి పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని అర్జీదారులు కోరుతున్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

గుమ్మలక్ష్మీపురం : పంచాయతీలో సర్పంచ్ బొత్తాడ శంకరరావు ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి హైస్కూల్ రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన పెంట కుప్పలను ఆదివారం తొలగించారు. ఈ రహదారిపై నడిచే విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పారిశుధ్య పనులు చేపడుతున్నామని సర్పంచ్ తెలిపారు. కాలువల్లో పూడికలు తొలగింపుతో మురుగు ప్రవాహం సజావుగా సాగుతుందన్నారు. అలాగే హైస్కూల్ రహదారి పక్కన చెత్తను వేస్తే వారికి జరీమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎద్దు మురళీ పాల్గొన్నారు.



పారిశుధ్య పనులు చేపడుతున్న దృశ్యం

గ్రామాల్లో దేశమ్మతల్లి వారాలు

పార్వతీపురం టౌన్ : పట్టణంలోని కొత్తవలస ప్రజల ఇలవేల్పు దేశమ్మతల్లి వారాలు ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి పెద్దవీధిలోని అమ్మవారి ఘటాలకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి పెద్దవీధి నుంచి నాయుడువీధి, రామ మందిరంవీధి మీదగా నవదుర్గా ఆలయం వరకు ఘటాలను ఊరేగింపుగా తీసుకువెళ్లారు. కోరిన కోర్కెలు తీర్చే దేశమ్మతల్లి ఘటాలకు కొత్తవలసలో ఉన్న పలు వీధుల ప్రజలు పూజలు చేశారు. పెద్దవీధిలోని వనం గుడి వద్ద అనుపు సంబరాలను ఘనంగా నిర్వహించి అమ్మతల్లికి మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో 5వ, 7వ వార్డు కౌన్సిలర్లు చొక్కాపు వెంకట రమణ, కోమటి వెంకటరావులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మంగళవారం కొత్తపోలమ్మ అమ్మవారి వారాలు నిర్వహిస్తున్నట్టు గ్రామ పెద్దలు ప్రకటించారు.

ఎల్ఎన్‌పురంలో..

మండలంలోని ఎల్ఎన్‌పురం గ్రామంలో దేశమ్మతల్లి వారాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఘటాలను ఊరేగించారు. బంధువుల రాకతో గ్రామం పండగ వాతావరణం నెలకొంది. మహిళలు ఉదయాన్నే అమ్మవారి ఆలయానికి చేరుకుని పసుపు, కుంకుమలు సమర్పించుకున్నారు.

గిజబలో ప్రత్యేక పూజలు

గిజబ (గరుగుబిల్లి) : మండలంలోని గిజబ పునరావాస గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐదు రోజులు పాటు పూజాదికాలు నిర్వహించి తదుపరి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తామని కమిటీ ప్రతినిధులు తెలిపారు. పూజలతోపాటు ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అలాగే టవర్‌వీధి, రామాలయం ప్రాంతాల్లో భక్తులకు అన్న సమారాధన చేశారు. హోమం, పూజలను అర్చకులు రాంబాబు నిర్వహించారు. గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన ప్రతిమలు ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచాయి.

గ్యాస్ సమాచారం

ఈ నెల 27వ తేదీ వరకు పార్వతీపురం పెంటపాటి కామరాజు గ్యాస్ ఏజెన్సీ పరిధిలో బుక్ చేసుకున్న కొమరాడ మండలం, పార్వతీపురం మండలం, పట్టణ వినియోగదారులకు ఈ నెల 28న గ్యాస్ సరఫరా చేయబడును. ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేయదలచిన వారు 9666023456 నెంబర్‌కు ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవాలి. ఫిర్యాదులు, సలహాలు కోసం గ్యాస్ ఏజెన్సీ ల్యాండ్ లైన్ నెంబరు 08963-221425, 221345 నెంబర్లను సంప్రదించాలి.

సినిమా గైడ్

వెంకటేశ్వర కళామందిర్: ఆనందో-బ్రహ్మ
పద్మశ్రీ -------- జయ జానకీ నాయక
సౌందర్య ------ నేనే రాజు నేనే మంత్రి

నష్టాల బాట వీడేందుకు..

- ఆర్టీసీ అధికారుల యత్నాలు
- లీజుకు ఖాళీ స్థలాలు
- రీజియన్ పరిధిలో 250 షాపుల ఏర్పాటు
- పార్శిల్, కొరియర్ సర్వీసులు ప్రారంభం

నష్టాల బారి నుంచి ఆర్టీసీని రక్షించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిలో భాగంగానే ఆదాయ మార్గాలపై దృష్టి కేంద్రీకరించారు. ఖాళీ స్థలాలను అద్దెకివ్వడం, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి వారిని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేటట్టు ఆకర్షితులను చేశారు. తాజాగా పార్సిల్, కొరియర్ సేవలను ప్రారంభించారు. తక్కువ మొత్తం.. సమయంలో సేవలను అందిస్తామని సంస్థ అధికారులు చెబుతున్నారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరుతున్నారు.



పార్శిల్, కొరియర్ సర్వీసుల ప్రారంభం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

(విజయనగరం టౌన్)

నష్టాల నుంచి బయటపడేందుకు ఆర్టీసీ ఆదాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా రీజియన్ పరిధిలోని ఖాళీ స్థలాలను అద్దెకివ్వడం, పార్శిల్, కొరియర్ సేవలను మొదలుపెట్టింది. వీటన్నీ మార్గాల ద్వారా ఆదాయం పెంపుదలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇంతవరకూ ప్రయాణికుల రవాణాపైనే దృష్టి కేంద్రీకరించిన ఆర్టీసీ.. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కూడా ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. రీజియన్ పరిధి (విజయనగరం, శ్రీకాకుళం)లో ప్రస్తుతం రూ.84 కోట్ల నష్టంలో ఉంది. దీని నుంచి బయటపడేందుకు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించడం, బస్సుల సంఖ్య పెంచడం, నిర్వహణ ఖర్చులు తగ్గించుకోవడం వంటి చర్యలు చేపట్టింది. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలోని 15 బస్టాండ్‌లు, తొమ్మిది డిపోల పరిధిలో 250 షాపులను ఇప్పటికే ఏర్పాటు చేసింది. దీని ద్వారా ప్రతి ఏటా ఆదాయాన్ని పెంచుతూ వస్తోంది. 2015-16లో రూ.2 కోట్ల మేర ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.3 కోట్ల మేర ఆదాయం సమకూరనుంది.

పార్సిల్, కొరియర్ సర్వీసులోకి..

ఇంతవరకూ ఆర్టీసీలో పార్సిల్, కొరియర్ సేవలను ఏఎన్ఎల్ సంస్థ అందించేది. అయితే తాజాగా ఈ సేవలను అందించేందుకు ఆర్టీసీ సన్నద్ధమైంది. తొమ్మిది డిపోల పరిధిలో ఈ సేవలు ఆదివారం నుంచి ప్రారంభించారు. 1 నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లతో పాటు, 15 ఆర్టీసీ కాంప్లెక్స్‌ల్లో కూడా కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నారు. దీనిద్వారా ప్రతి నెలా అదనపు ఆదాయం సమకూరనుంది. గతంలో ఏఎన్ఎల్ సంస్థకు వచ్చే ఆదాయం కంటే ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోండి ..

ఆర్టీసీ పార్సిల్, కొరియర్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఎం అప్పన్న కోరారు. ఈ సేవలను ఆదివారం ఆయన విజయనగరం డిపోలో ప్రారంభించారు. అనంతరం ఆర్ఎం మాట్లాడుతూ రీజియన్ పరిధిలో 812 బస్సుల ద్వారా ఈ సేవలను అందిస్తామన్నారు. తక్కువ సమయం, డబ్బులతో ఈ సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. ఎన్ఎంయూ, ఎంప్లాయిస్ యూనియన్ నేతలు రాములు, రాజు మాట్లాడుతూ ఆదాయం పెంపే లక్ష్యంగా ఆర్టీసీ ముందడుగు వేస్తోందన్నారు. ఆర్టీసీని నష్టాల ఊబిలోంచి గట్టెక్కించేందుకు చేస్తున్న ప్రయత్నాలకు సహకరిస్తామన్నారు. అనంతరం కొరియర్, పార్శిల్ సర్వీసులను శతశాతం విజయవంతం చేస్తామని, ప్రజల ముంగిటకు తీసుకువెళ్తామని ఆర్టీసీ ఉన్నతాధికారులు, ఆర్టీసీ ఉద్యోగులు, హామాలీలు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం వరప్రసాద్, డిపో మేనేజరు ఎన్‌వీఎస్ వేణుగోపాల్ పాల్గొన్నారు.



మొక్కలు నాటే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జగదీష్

నేడు పార్వతీపురంలో సంకల్ప సిద్ధి

- హాజరుకానున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు

పార్వతీపురం : గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర సమీపంలోని ఉద్యానవన కళాశాలలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సంకల్ప సిద్ధి అనే కార్యక్రమాన్ని రైతుల కోసం నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు, రాష్ట్ర గనులశాఖ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, కలెక్టర్ వివేక్‌యాదవ్, ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, తదితరులు హాజరుకానున్నారు. ఉదయం 10.30 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అనంతరం కొత్తవలసలోని సత్యనారాయణస్వామి ఆలయ ప్రాంతంలో మంత్రులు మొక్కలు నాటుతారు. పార్వతీపురం వైటీసీలో ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తారు.

విజయవంతం చేయండి

పార్వతీపురం టౌన్ : సంకల్ప సిద్ధి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ నాయకులు, కార్యకర్తలను కోరారు. ఆదివారం ఆయన సత్యనారాయణస్వామి ఆలయ సమీపంలో మంత్రులు మొక్కలు నాటే ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ 2022 నాటికి ప్రతీ రైతు నెలకు రూ. 10వేలు ఆదాయం సంపాదించుకొనేవిధంగా సంకల్ప సిద్ధి కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రైతన్నలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఆయన వెంట ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ దొగ్గ మోహన్, కౌన్సిలర్లు బార్నాల సీతారాం, కోమటి వెంకటరావు ఉన్నారు.

స్నేహలతకు ఎలియన్స్ క్లబ్ జీవితకాల సాఫల్య పురస్కారం



దాసన్నపేట : ప్రముఖ జానపద గాయని, వర్ధమాన సంగీత దర్శకురాలు, వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి ముని మనువరాలు స్నేహలత మురళికి ఎలియన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 105 ఆధ్వర్యంలో సెప్టెంబరు1 న జీవితకాల సాఫల్య పురస్కారం ప్రదానం చేయనున్నామని క్లబ్ వైస్ గవర్నర్ సముద్రాల గురుప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఈ పురస్కారాన్ని వోలేటి పార్వతీశం, ద్వానా శాస్త్రికి అందించామని పేర్కొన్నారు. స్నేహలత బతుకమ్మ పాటలు, గొబ్బిపాటలు, రాయలసీమ దంపుడు పాటలు పాడడంతో సిద్ధహస్తురాలన్నారు. పద్మభూషణ్ నూకల చిన సత్యనారాయణ, పద్మశ్రీ శ్రీరంగం గోపాలరత్నం వంటి మహనీయుల వద్ద సంగీత సాధన చేశారని తెలిపారు.

వైసీపీ దొంగలను తరిమికొట్టండి

కేంద్ర, రాష్ట్ర మంత్రులు అశోక్, సుజయ్ పిలుపు



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న రాష్ట్రమంత్రి రంగారావు

బొబ్బిలి: రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని, అవినీతి రహిత పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, ప్రతి కార్యకర్త చంద్రబాబుకు అండగా ఉండాలని కేంద్రమంత్రి పూసపాటి అశోకగజపతిరాజు పిలుపునిచ్చారు. ఆదివారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు మహంతి చిన్నంనాయుడు అధ్యక్షతన పార్టీ సమావేశం బొబ్బిలి కోటలో నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన అశోకగజపతి రాజు మాట్లాడుతూ జగన్ నాయకత్వంలో వైసీపీ దొంగలు ఊళ్ల మీద పడుతూ టీడీపీ చేస్తున్న అభివృద్ధిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. దీనిని పార్టీ శ్రేణులు సమర్థవంతంగా తిప్పికొట్టాలని కోరారు. ప్రతిపక్ష నేత అభివృద్ధి నిరోధకుడుగా మారారన్నారు. కోట్ల రూపాయలు దోచుకున్న జగన్, సత్తిబాబుతో రాష్ట్ర పరిస్థితి ఏవిధంగా ఉంటుందో ప్రజలు ఆలోచించాలని కోరారు. తోటపల్లి బాధిత రైతులపై వైఎస్ ఆనాడు లాఠీచార్జి చేయించస్తే.. నేడు ఆ ప్రాజెక్టును చంద్రబాబు పూర్తి చేయిస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలు పేదలకు అందేలా కార్యకర్తలు చూడాలని సూచించారు. అవినీతి లేనిసమాజాన్ని నిర్మిం చేందుకు అందరూ కలిసి రావాలని కోరారు. రాష్ట్ర మంత్రి సుజయకృష్ణరంగారావు మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు సాగునీరందిస్తున్నామని, ఇది తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందన్నారు. వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు. వైసీపీకి సిద్ధాంతాలు లేవని తెలిపారు. గత పదేళ్లలో జిల్లాను అభివృద్ధి చేయని నేతలు ఇప్పుడు వైసీపీలో చేరి జిల్లా అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఇలాంటివారిని జిల్లా నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జి తెంటు లక్షుంనాయుడు మాట్లాడుతూ రానున్న అన్ని ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ శోభా స్వాతీరాణి, ఎమ్మెల్యేలు పతివాడ నారాయణస్వామి, బొబ్బిలి చిరంజీవి, మీసాల గీత, ఎమ్మెల్సీలు ద్వారపురెడ్డి జగదీష్, గుమ్మిడి సంధ్యారాణి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు, మాజీ ఎమ్మెల్యేలు జనార్దన్ థాట్రాజ్, ఆర్‌పీ భంజ్‌దేవ్, గద్దె బాబూరావు, శోభా హైమావతి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ బేబి నాయన, మున్సిపల్ ఛైర్‌పర్సన్ తూముల అచ్యుతవల్లి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖాధికారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న వాసుదేవరావునాయుడు

పార్వతీపురం : జిల్లాలో నిర్వహిస్తున్న ఉన్నత పాఠశాలల ఆటల పోటీలకు సంబంధించి గిరిజన విద్యార్థులపై జిల్లా విద్యాశాఖాధికారి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఐటీడీఏ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మంతిన వాసుదేవరావునాయుడు ఆరోపించారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. ప్రలోభాలకు లోనై పక్షపాతంగా క్రీడాకారులను డీఈవో ఎంపిక చేసినట్టు వాపోయారు. దీనిపై ఐటీడీఏ పీవో డాక్టర్ లక్ష్మీశకు ఫిర్యాదు చేశామన్నారు. కలెక్టర్ వివేక్‌యాదవ్‌కు లేఖ రాసినట్టు చెప్పారు. గతేడాది స్కూల్ గేమ్స్ ఆర్చరీ ఎంపిక పోటీలు రావాడ రామభద్రపురంలో నిర్వహించగా సుమారు 100 మంది గిరిజన బాల బాలికలు పాల్గొన్నారని తెలిపారు. కానీ ఎంపికకు రాని సీతానగరంలోని సువర్ణ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థినులను దొడ్డిదారిలో రాష్ట్రస్థాయి పోటీలకు, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి, డీఈవో పంపించి, గిరిజన విద్యార్థులకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది క్రీడాకారుల ఎంపిక గుమ్మలక్ష్మీపురం లో నిర్వహించాలని కోరగా, చివరి నిమిషంలో పార్వతీపురంలో (28న) వేదిక ఖరారు చేశారన్నారు. అదే రోజున గిరిజన క్రీడాకారులకు తెక్వాండో పోటీలు విజయనగరంలో ఉన్నాయన్నారు. ఒకేరోజున రెండు చోట్ల జరిగే కార్యక్రమాలకు క్రీడాకారులు ఎలా హాజరుకాగలరని ప్రశ్నించారు. ఈ విషయాలను పరిశీలించి డీఈవోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పీఈటీలు ఎస్.దాలయ్య, కె.హైమ, పి.జ్యోతి పాల్గొన్నారు.



గురజాడ మేధ అపూర్వం

● సమాజం కోసం పనిచేసేవాడే కవి ● ఆయా పాత్రలో ఒదిగి రాయడం వల్లే జీవం
● 'కన్యాశుల్కం'పై వక్తల అభిప్రాయం ● రెండో రోజూ ఉత్సాహంగా వేడుకలు

సదస్సులో మాట్లాడుతున్న కవి అంశుమన్ కర్

విశాఖపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి):
తెలుగు సాహిత్యం ఉన్నంతకాలం 'కన్యాశుల్కం' సమాజంలో ఉంటుందని వక్తలు అభిప్రాయపడ్డారు. గురజాడ కన్యాశుల్కం 125 ఏళ్ల జాతీయ ఉత్సవాల సందర్భంగా ఏయూ ప్లాటినమ్ జూబ్లీ హాల్‌లో జరుగుతున్న కార్యక్రమానికి ఆదివారం పలువురు రచయితలు హాజరయ్యారు. నూటపాతికేళ్ల చరిత్ర కలిగిన కన్యాశుల్కం ఇప్పటికీ ప్రభావం చూపుతుందంటే.. ఆయన మేధ అసాధారణమైందని అతిథులు అభివర్ణించారు. రెండు రోజుల నుంచి ఉత్సవంలా సాగుతున్న ఈ కార్యక్రమాలకు దేశం నలుమూలల నుంచి రచయితలు, అభిమానులు, నాటకకర్తలు తరలివచ్చారు. కన్యాశుల్కం విశిష్టతను, ఇతర భాషల్లో ఆ అంశంపై చేసిన రచనలతో సామీప్యతను పలువురు వివరించారు. దీనిపై శోధించిన అంశాలను సభికులకు వివరించారు. ఇతర భాషల్లో సాగిన రచన కన్నా... గురజాడ ఏ విధంగా గొప్ప.. అన్న విషయాన్ని తమదైన శైలిలో వివరించారు... అందులోని కొత్త అర్థాలకు భాష్యం చెప్పారు. ఉదయం జరిగిన తొలి సదస్సుకు శేఖరమంత్రి ప్రభాకరరావు స్వాగత ఉపన్యాసం చేశారు. విజయచంద్ర అధ్యక్షత వహించారు. అనంతరం పలువురు కన్యాశుల్కంపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. గురజాడ అప్పారావు ప్రభావం తెలుగు సాహిత్యంలో ఎలా పెనవేసుకున్నది వివరించారు. ఆయన రచన చదివిన అంశుమన్ కర్ ఒక కవితను రాసి వినిపించారు.

సమాజం కోసం రాసేవాడే కవి

-ఆచార్య వెలమల సిమ్మన్న

గురజాడ అప్పారావు ఏ ప్రయోజనం కోసం కన్యాశుల్కాన్ని రాశారో.. అంతకంటే ఎక్కువ ప్రభావాన్నే చూపగలిగారు. ఇన్నేళ్లైనా దీనిని చదువుతున్నామంటే.. ఆయన సాహిత్యమెంత గొప్పదో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆయన సాహిత్యానికి ఇన్నేళ్లు అని చేప్పలేం. తెలుగు జాతి ఉన్నంతకాలం కన్యాశుల్కం వుంటుందని నా అభిప్రాయం. కన్యాశుల్కాన్ని రసధ్వని కావ్యంగా అభివర్ణించవచ్చు. అన్నింటికన్నా ముఖ్యం సమాజం. ఆ సమాజం కోసం పాటుపడేవాడే కవి.

ఇప్పటికీ కన్యాశుల్కం ఉంది..

-అంబళ్ల జనార్ధన్, మహారాష్ట్ర

మరాఠీలో బాల్య వివాహాలపై గోవింద్ భల్లాల్ రాశారు. కానీ కన్యాశుల్కంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా, వితంతు వివాహాలకు మద్దతుగా, సమాజంలోని రుగ్మతలపై.. ఇలా అనేక అంశాలను స్పృశిస్తూ రాసి విజయం సాధించారు. ఈ విషయంలో గురజాడ గెలిచాడనే చెప్పాలి. ఇప్పటికీ సమాజంలో కన్యాశుల్కం ఉంది. ఎంతో అధ్యయనం చేసి గురజాడ దీనిని రాశారని స్పష్టమవుతుంది. సమాజానికి చెప్పాల్సిన విషయాలను తన పాత్రల ద్వారా ఎంతో చక్కగా వివరించారు.

ఎన్నో అభ్యుదయ అంశాలున్న కథ

-మిరియాల గౌతమ్, యువ కవి

ఆర్థిక, మత సంబంధాలు సమాజానికి ఎంతో మూలం. సమాజంలో మార్పులపై, వ్యవస్థలోని లోపాలపై కన్యాశుల్కంలో ప్రస్తావించడం వల్ల అన్ని వర్గాలను ఆకట్టుకోగలిగింది. అంతకంటే ప్రత్యేకమైంది.. వాడుక భాషలో దానికి రచన చేయడం వల్ల ప్రాణం పోసినట్టయిందిజ ఎన్నో అభ్యుదయ అంశాలున్న ఇలాంటి కథ మరొకటి లేదని కచ్చితంగా చెప్పవచ్చు. అందుకే ఇన్నేళ్లైనా దాని ప్రభావం సమాజం మీద కనిపిస్తూనే ఉంది.

ఆ పాత్ర తనదైనట్టుగా భావించి..



గురజాడ కన్యాశుల్కంలో రాసిన అన్ని పాత్రల్లో ఆయన ఒదిగిపోవడం వల్లే ఆ నాటకానికి ఇంత గొప్పతనం చేకూరింది. కథలోని పాత్ర తనదే అయినట్టు రచయిత భావించడం వల్ల ఇన్నేళ్లు సజీవంగా ఉంది. ఇలాంటి రచనలు 125 ఏళ్లు కాదు.. మరో 1,250 ఏళ్లు గడిచినా.. చెక్కుచెదరవు. ఆయన రెండో ఎడిషన్‌లో మధురవాణిని హీరోగా చేసి సమాజహితానికి ప్రయోగించారు. వేశ్య వృత్తిలో ఉన్న మహిళను ఆదుకోవాలంటే ఏం చేయాలి? గురజాడ ఆధునిక మహిళ పాత్ర ఏంటి? అన్నవి ఆసక్తికర అంశాలు.

-జగద్ధాత్రి, రచయిత్రి

సమాజం పట్ల ఆర్తితో రాశారు..



గురజాడ సమాజం పట్ల ఆర్తితో కన్యాశుల్కాన్ని రాశారు. ఆయన ప్రయోగించిన వివిధ భాషల పదజాలం కోసం మరో నిఘంటువే అవసరమని అందుకే అన్నారు. ఇందులోని ఏ దృశ్యాన్నైనా విడిగా ప్రదర్శించినా, చదివినా ఆనందించగలం. అలాంటి రచన ఇప్పటివరకు రాలేదు. లోకంలో వుండే పోకడలు, మనుషుల తీరు, సంఘర్షణలు అన్నీ ఇందులో ప్రతిఫలిస్తాయి. ఆయన నాటకం తొలిసారి ప్రదర్శితమైన విజయనగరంలోని బొంకులదిబ్బను అభివృద్ధి చేయాలి.

-డీవీ సూర్యారావు, రచయిత

కొరవడుతున్న నాటక ప్రక్రియ



నేడు నాటక రచనల్లో ప్రక్రియ కొరవడుతోంది. నాటక ప్రక్రియను, టెక్నిక్స్‌ను అధ్యయనం చేసి గురజాడ రెండోసారి కన్యాశుల్కం రాయడం వల్ల ప్రత్యేకత నిలుపుకుంది. ఇప్పుడంతా ప్రైజ్‌ల ఆధారంగా నాటక రచన సాగుతోంది. గురజాడ ఆనాడే ఆధునిక మహిళను అంచనా వేయగలిగారు గానీ... నిడివి పరంగా మోడరన్ థియేటర్‌ను అంచనా వేయలేకపోయారని నా అభిప్రాయం. కన్యాశుల్కంతో ఎంతో పరిశోధించిన ఆయన.. అంత నిడివి ఆధునిక కాలానికి సరికాదని ఊహించలేకపోయారు.

-సుబ్రహ్మణ్యం, ఢిల్లీ, ఆంధ్ర అసోసియేషన్

బెంగాలీ రచనతో సామీప్యత



బెంగాలీ సాహిత్యంతో గురజాడ సాహిత్యాన్ని కలిపి చూస్తే.. గురజాడ రచన మహా అద్భుతమని చెప్పక తప్పదు. కన్యాశుల్కంపై బెంగాలీలో దీనబంధు మిత్రో రాసిన దాని కన్నా.. గురజాడ కన్యాశుల్కం అన్ని పాత్రలకు న్యాయం చేశారనిపించింది. ఆ ఇద్దరి రచనల మధ్య సామీప్యత ఉన్నా... గురజాడ రచనలో సామాజిక అంశాల ప్రస్తావన ఎక్కువగా ఉంది. కన్యాశుల్కం చదివాక గురజాడ మీద ఓ కవిత కూడా రాయాలనిపించింది. ఆయన అద్భుతమైన కవి.

-అంశుమన్ కర్, కవి

సన్నివేశాల్లో ఒదిగి... కళ్ల ముందు కదలి...

● కన్యాశుల్కంలో ప్రస్తావించిన ప్రసిద్ధ ప్రాంతాలివే..

విజయనగరం టౌన్ : కన్యాశుల్కం నాటకంలోని ప్రముఖంగా ప్రస్తావించిన ప్రాంతాలను ఓ సారి అవలోకనం చేసుకుంటే విజయనగరం ముఖచిత్రమంతా కళ్లముందు కదలాడుతుంది. నాటి నుంచి నేటికీ... ఏ నాటికీ ఆయా స్థలాలు తమ ప్రాధాన్యతను కోల్పోలేదు. నాటకంలో ప్రస్తావించిన ప్రతి చోటూ ఉనికి కోల్పోకుండా మనకు గోచరిస్తుంది. విజయనగరంలో అనుబంధం ఉన్న వారికి ప్రతిరోజూ కంటిగింపుగా ఆ స్థలాలు కనిపిస్తుంటాయి. ఇతర ప్రాంతాల వారు సందర్శనీయ స్థలాలుగా వాటిని పరిశీలిస్తుండటం వెనుక నాటకంలో వాటికి స్థానం కల్పించడమే ఒకారణంగా భావించవచ్చు.

'సాయంకాలమైంది..' డైలాగును బొంకులదిబ్బపై గిరీశం చెబుతాడు. దీనితోనే ప్రదర్శన ప్రారంభమవుతుంది. నేడు మనం చూస్తున్న బొంకులదిబ్బను బంకులదిబ్బగా, అబద్ధాలు ఎక్కువగా చెప్పేవారు వున్నట్టుగా ఆ స్థలాన్ని అనేక మంది అనేక రకాలుగా నేటికీ తమ నాలుకలపై కదలాడిస్తుంటారు. అందుకేనేమో! గిరీశం పాత్రని ఇక్కడే ప్రవేశపెట్టాడు గురజాడ..






ఫొటోగ్రాఫర్ పంతులు నౌకరు తమకు బాకీ ఉన్న డబ్బులు గిరీశంను ముక్కుపిండివసూలు చేసేలా అడుగుతుంటే తనకి వినిపించనట్టు నటించిన గిరీశం అయ్యన్నకోనేరుకు తోవ ఇలానే.. అంటాడు..



మరో సందర్భంలో తన శిష్యుడు వెంకటేశంతో మాట్లాడుతూ, దేవి మిఠాయికొట్టులో పావుసేరు మిఠాయి కొనుక్కొని బండికట్టించుకుని ఉడాయిద్దాం.. అని కూడా ఒక విశేష ప్రాచుర్యం పొందిన ఓ మిఠాయి దుకాణాన్ని గురజాడ కన్యాశుల్కంలో ప్రస్తావించారు.


సానివీధి (ప్రస్తుతం లేకపోయినప్పటికీ) మధురవాణి పాత్ర అంతా ఈ వీధిచుట్టే తిరిగే విధంగా అప్పట్లో వున్న రుగ్మతలను, కొంతమంది బలహీనతలను గురజాడ బలంగానే చూపించారు. ఇలా పట్టణంలోని అగ్రహారం వీధిని ప్రస్తావించారు. ఏ రచయిత రచనలోనైనా సమకాలీన సంఘటనలు చోటు చేసుకుంటాయనడంలో సందేహం లేదు. పురాణకథ రాస్తున్నా, ఆ కాలంతో పాటు లక్షణాలు కూడా కవికి తెలియకుండా అయినా చేరుతాయి. వ్యాసభారతంలో ద్రౌపదిని, కవిత్రయ అనువాదంలో నన్నయ ద్రౌవదిగా, తిక్కన ద్రౌపదిగా, ఎర్రన ద్రౌపదీగా అనేక ప్రత్యేకతలతో రూపొందించడం అందరికీ తెలిసిన విషయమే.. ఈ నేపథ్యంతో చూస్తే గురజాడ రచనల్లో ప్రధానంగా కన్యాశుల్కం సమకాలీన సంఘ జీవితం ప్రతిబింబించే చక్కటి దర్పణం అనాలి. ప్రతి పాత్ర, ప్రతి ప్రదేశం నాటి స్థానిక విశేషాలకు అద్దంపడుతున్నాయి. కాబట్టే నేటికీ ఆ నాటకం జరుగుతున్నట్టు భావిస్తున్నాం.. అనుభవిస్తున్నాం.. ఈ దృష్టితో ముందుగా కన్యాశుల్కాన్ని పరిశీలిస్తే అందులో వస్తువు, కథాంశాలు, పాత్రల పేర్లు, స్వభావం, సంభాషణల తీరు, భాష, జాతీయాలు, సామెతలు, స్థలాలు, చరిత్ర, సంస్కృతి, క్రీడలు, ఇతర వినోదాలు ఇలా అన్నింటిల్లో నాటి స్థానిక అంశాలే చోటు చేసుకున్నాయి. విజయనగరంనే చూపిస్తుంటాయి.





కన్యాశుల్కంలోని ఘట్టాలను వివరిస్తూ గురజాడ గృహంలో ఉన్న ఫొటోలు

సజీవ సాక్ష్యం కన్యాశుల్కం





● 125 ఏళ్లైనా వన్నె తగ్గని నాటకం
● గురజాడ రచనా శైలికి మచ్చుతునక
● సమకాలీన పరిస్థితులకూ దర్పణంలా నిలిచిన రచన

(విజయనగరం టౌన్)

ప్రస్తుత సమాజంలో కన్యాశుల్కం సమస్య లేకపోయినప్పటికీ ఒక ప్రదర్శన సజీవంగా 125 ఏళ్లుగా ప్రదర్శింపబడుతోందంటే ఆ రచనా వైభవం సమకాలీన పరిస్థితులకు ఎంత చేరువలో వుందో ఎవరికైనా ఇట్టే అర్థమైపోతోంది. నేటి రచయితలకు, కవులకు దిక్సూచిగా నటులకు, దర్శకులకు దర్పణంగా నిలిచిన కన్యాశుల్కం నాటక రచన నేటికీ అందరి ఆదరాభిమానాలు అందుకుంటూనే వుంది. ఆధునిక ఆంధ్ర వినీలాకాశంలో తెలుగు వెలుగులు విరజిమ్మిన వేగుచుక్క గురజాడ. ఎల్లలోకం ఇల్లుగా భావించిన సాహిత్యంలో మానవ జీవితాన్ని తొలుత చిత్రీకరించిన అభ్యుదయ వాల్మీకిగా విమర్శకులు సైతం ఆయననే వేనోళ్ల కీర్తిస్తారు. దేశం పరుల పాదాల కింద ఎంతగా నలిగిపోయాక, జాతి పూర్తిగా బానిస అయిపోయాక, భాష ఎంతగానో శృంఖాలబద్ధం అయ్యాక, సాహిత్యం పూర్తిగా దిగజారిపోయాక, భవిష్యత్తు అంధకారబంధురం అయిపోయాక పుట్టుకొచ్చాడు ఈ మహాకవి... అన్న శ్రీపాదసుబ్రహ్మణ్య శాస్త్రివారి విశ్లేషణ గురజాడ నాటి దేశ భాషల సమగ్ర చిత్రరణ తోకచుక్కను సంఘ సంస్కరణ పతాకగా భావించి నాటక రచన ద్వారా సాధించి చూపించిన మహనీయుడు. వాస్తవ పరిస్థితులకు అద్దంపడుతూ సమాజంలోని రుగ్మతలను సిరాతో చేరిపేసిన నవయుగ వైతాళికుడి రచన అన్ని ప్రాంతాల్లో అఖండ నీరాజనాలు అందుకుంటూనే వుంది.

సరిగ్గా 125 ఏళ్ల కిందట కన్యాశుల్కం నాటక ప్రదర్శన విజయనగరంలో ఇదే నెలలో తొలిసారి జరిగినట్టు చరిత్రకారులు చెబుతారు. నాటి నుంచి నేటి వరకూ అన్ని వర్గాల వారినీ అలరించే దృశ్య కావ్యం. పాత్రల స్వభావం, సందర్భోచిత సంభాషణ, సన్నివేశాల్లో తన రచనతో గురజాడ తనకు తానే అని నిరూపించుకున్నారు. నాటకంలోని ప్రతి పాత్రా మనం ప్రత్యక్షంగా చూస్తున్నట్టే అన్పించడం నాటకం జీవన గమనానికి నిదర్శనం.. భాష శృంఖలాబద్ధమై జన సామాన్యానికి అందుబాటులో లేని, అర్థం కాని రీతిలో వుంటే దానిని కాదని గిడుగు లక్షణానికి లక్ష్యంగా నిలిచి "నా ఉద్యమం.. ప్రజల ఉద్యమం.. తెలుగులో నవ్యరీతులు నూతనంగా ప్రమాణాలతో ప్రయత్నించిన మొదటి కవిని నేను". నా కావ్యకళ నవీనం. ఇతి వృత్తాలు భారతీయం. కవితలో నేను ఉత్తమ ప్రయోజనాలను ఉపేక్షించలేను.. జీవితాన్ని నూతన దృక్పథాన్ని దర్శించి కథ, కవితా రూపాల్లో దాని తత్త్వాన్ని అన్వయించడానికి ప్రయత్నించాను.. అని కన్యాశుల్కంలో నిరూపించారు గురజాడ. సుమారు తొమ్మిది గంటల ప్రదర్శన నిడివి కల నాటకం సరిగ్గా 25 ఏళ్ల కిందట విజయనగరంలోని సుజాత ఆర్ట్స్ అకాడమీ నిర్వహణలోని డాక్టరు డీవై సంపత్‌కుమార్ సారథ్యంలో ఎంఆర్ కళాశాలలో సంపూర్ణ కన్యాశుల్కం నాటకాన్ని ప్రదర్శించిన నటులు, నటీమణులు, సాంకేతిక నిపుణులు ఇప్పటికీ తమ అనుభవాలను పదే, పదే రంగరించుకుంటూనే వుంటారు. ఆ ప్రదర్శన జరిగినప్పుడు మహానటుడు అక్కినేని నాగేశ్వరరావు, ప్రఖ్యాత రచయితలు డాక్టరు సి.నారాయణరెడ్డి, మల్లెమాల, పీవీ రంగారావు హాజరై నటీనటులను అభినందించారు.

నేటి తరానికి కరదీపిక



రాబోయే తరాలకు కూడా గురజాడ దిక్సూచి. రాసినవి కొన్నే అయినప్పటికీ, మరే సాహితీవేత్తకీ దక్కనంత అఖండ ఖ్యాతి గురజాడకు అందింది. సమాజంలో వున్న సమస్యలను ప్రజల భాషతో అందించి భావితరాలకు మార్గదర్శకులుగా మారారు. కన్యాశుల్కం నాటక రచన ఒక ప్రయోగశాలగా నిలిచింది. ఆ సమస్య ఇప్పుడు లేకపోయినప్పటికీ, జనం ఇంతగా ఆదరిస్తున్నారంటే పాత్రోచిత సంభాషణా పటిమ, ఎత్తుగడ, ముగింపు, కథ, గమనం దేనికి ఏదీ తీసిపోకుండా ఉండటమే కారణం.

- డాక్టరు ఎ.గోపాలరావు, సాహితీవేత్త

నేడు 125 ఏళ్ల ఉత్సవాలు

● గురజాడ విగ్రహం నుంచి స్మారక భవనం వరకు ర్యాలీ
● స్మారక భవనంలో రజిత ఫలకం ఆవిష్కరణ ఉత్సవ సావనీర్ ఆవిష్కరణ
● ముఖ్యఅతిథులుగా ఇన్‌చార్జి మంత్రి గంటా శ్రీనివాస్, ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్

విజయనగరం టౌన్ : మహాకవి, నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు రచించిన కన్యాశుల్కం నాటకానికి 125 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర సాంస్కృతిక శాఖ జాతీయ ఉత్సవాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా పట్టణంలో పలు కార్యక్రమాలను జిల్లా సాంస్కృతిక మండలి సహకారంతో సోమవారం నిర్వహించనుంది. పట్టణంలోని సత్య లాడ్జి జంక్షన్ నుంచి గురజాడ స్మారక భవనం వరకు ఉదయం 10.30 గంటలకు ప్రదర్శన నిర్వహిస్తున్నారు. గురజాడ విగ్రహానికి ప్రముఖులు నివాళులు అర్పించిన అనంతరం ర్యాలీ ప్రారంభమవుతుంది. ఈ ర్యాలీలో పట్టణ ప్రముఖులు, సాహితీవేత్తలు, విద్యార్థులు పాల్గొననున్నారు. అనంతరం 11 గంటలకు గురజాడ స్మారక భవనంలో కన్యాశుల్కం 125 ఏళ్ల జాతీయ ఉత్సవాలకు గుర్తుగా రజిత ఫలకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం అదే భవనంలో కన్యాశుల్కం జాతీయ ఉత్సవాలపై రూపొందించిన సావనీర్ ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గంటా శ్రీనివాసరావు, ప్రభుత్వ మీడియా సలహాదారు పరకాల ప్రభాకర్, సాంస్కృతిక శాఖ సంచాలకులు విజయభాస్కర్, జాయింట్ కలెక్టర్ శ్రీకేష్ బి లఠ్కర్, మొజాయిక్ సాహిత్య సంస్థ ప్రతినిధి రామతీర్థ తదితరులు పాల్గొంటారు. సాహితీవేత్తలు, రచయితలు, కళాకారులు, గురజాడ అభిమానులు పట్టణ ప్రజలంతా ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని కలెక్టర్ వివేక్‌యాదవ్ ఈ సందర్భంగా కోరారు.

సమాజాన్ని మేల్కొలిపేది



సమాజాన్ని మేల్కొలిపే నాటకం కన్యాశుల్కం. నాటకంలోని పలు పాత్రలు వేశాను. తాజాగా 125 ఏళ్ల కన్యాశుల్కంలో భాగంగా విశాఖలో ప్రదర్శితమైన నాటకంలో నటించాను. ఏ కళాకారుడైనా జీవితంలో ఒక్కసారైనా కన్యాశుల్కం నాటకంలో పాత్ర చేయాలని ఉవ్విళ్లూరుతుంటాడు.. సమాజాన్ని చైతన్య పరచడమే కాకుండా, ఒక నాటకం 125 ఏళ్లు బతికుందంటే.. అందులో ఎంత బలం వుందో అర్థమవుతుంది.

- ఈపు విజయ్‌కుమార్, నటుడు, దర్శకుడు

కన్యాశుల్కం సజీవం



కన్యాశుల్కం నాటకం సజీవం.. 125 ఏళ్లు అయినా నేటికీ ఆ నాటకం బతికి వుందంటే.. గురజాడ ప్రతిభకు నిదర్శనం.. మంచి రచన.. దురాచారంపై సమాజాన్ని చైతన్యం చేసేందుకు ఎంతగానో దోహదపడింది. దేశంలోని అన్ని ప్రాంతాల్లో ప్రదర్శితమైంది.. ఎన్నిసార్లు చూసినా, ఇంకా చూడాలనిపించే నాటకం.. నేను కూడా ఆ నాటకంలోని పలు పాత్రలు వేశాను.. చాలా సంతృప్తినిచ్చింది.. జీవితంలో ఏ కళాకారుడైనా కన్యాశుల్కం నాటకంలో నటించాలని కోరుకుంటారు.

- గెద్ద వరప్రసాద్, నటుడు, దర్శకుడు

సంపూర్ణ నాటకం



కన్యాశుల్కం సంపూర్ణ నాటకం ప్రదర్శనకు దర్శకత్వ బాధ్యతలు నిర్వర్తించడం నా అదృష్టం. అందులోని లుబ్ధావధానులు పాత్ర సంపూర్ణమైన సంతృప్తిని అందించడమే కాకుండా గొప్ప పేరు సంపాదించిందిపెట్టింది. రామప్పపంతులుగా సత్యనారాయణ మాస్టారు నటించడమే కాకుండా నాటకానికి దర్శకత్వం వహించడం, గిరీశం పాత్రధారి నర్సింహమూర్తి, మధురవాణి పాత్రలో జయలలిత తదితరులు నటించిన తీరు ఇప్పటికీ ప్రేక్షకులకు గుర్తుండటం గురజాడ రచనా వైభవానికి నిదర్శనం. మళ్లీ, మళ్లీ ఆ నాటకాన్ని చూడాలని ఆశ వుండడం గురజాడ రచనకు గీటురాయి.

-ఏబీ సుబ్బారావు, రచయిత, దర్శకుడు, నటుడు

హత్యే!

- మెమరీ కార్డు కోసం గొడవ
- గిరిజనుడి హత్యకు దారితీసిన వైనం
- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు



మృతుడు పొట్టియ్య, విషాదంలో సంగంగడ్డివలస

మెంటాడ:పుట్టినరోజు వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. అన్యోన్యంగా ఉన్నవారి మధ్య మెమరీ కార్డు చిచ్చుపెట్టింది. చిన్నపాటి తగాదా మెంటాడ మండలంలోని సంగంగడ్డివలస గ్రామానికి చెందిన గిరిజనుడు గుమ్మిల పొట్టియ్య (25) మృతికి కారణమైంది. పోలీసులు, స్థానికులు ఆదివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. శనివారం కొర్రాయి చిన్నయ్య తన కుమారుడి జన్మదినోత్సవం సందర్భంగా గుమ్మిల పొట్టియ్య, కొర్రాయి లక్ష్మణరావులకు సమీప గూడెంలోని పొట్టవానివలసలో పార్టీ ఇచ్చాడు. వారు ముగ్గురూ పూటుగా మద్యం తాగి సాయంత్రం సంగంగడ్డివలసకు చేరి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. వేడుకలు సందర్భంగా లౌడ్‌స్పీకర్లు ఏర్పాటు చేశారు. ఇందులో సెల్ మెమరీ కార్డు ద్వారా పాటలు వేసుకున్నారు. వేడుకల అనంతరం వచ్చి చూస్తే మెమరీ కార్డు కనిపించలేదు. కొర్రాయి లక్ష్మణరావు దొంగిలించాడని చిన్నయ్య గొడవకు దిగాడు. చిన్నయ్య, లక్ష్మణరావుపై చేయి చేసుకున్నాడు. లక్ష్మణరావు తోబుట్టువు భర్త అయిన పొట్టియ్య కలుగజేసుకుని చిన్నయ్యతో వాగ్వాదానికి దిగాడు. ఈక్రమంలో ఆవేశానికి లోనైన కొర్రాయి చిన్నయ్య ఇంటిలో ఉన్న పదునైన కత్తితో పొట్టయ్య చాతిపై పొడిచాడు. కత్తిపోటుకు గురైన పొట్టియ్య అక్కడికక్కడే మృతి చెందాడు.



పోలీసుల అదుపులో ముద్దాయి చిన్నయ్య

పోలీసుల అదుపులో...

గజపతినగరం సీఐ లీలారావు, ఆంధ్ర ఎస్ఐ భాస్కరరావు ఆదివారం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. హత్య ఉదంతంపై గ్రామస్థుల నుంచి వివరాలు సేకరించారు. ఘర్షణకు పాల్పడిన ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. హత్యకు తానే బాధ్యుడినంటూ పోలీసుల ముందు చిన్నయ్య అంగీకరించాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.



విచారణ చేపడుతున్న గజపతినగరం సీఐ లీలారావు

పిచ్చికుక్క స్వైరవిహారం

- ఎనిమిది మందికి గాయాలు
- భయభ్రాంతులకు గురైన ఎస్.కోటవాసులు

శృంగవరపుకోట: శృంగవరపుకోటలో ఆదివారం ఉదయం ఓ పిచ్చికుక్క స్వైరవిహారం చేసి ఎని మిది మందికి గాయపర్చింది. పందిరప్పన్న జంక్షన్‌కు చెందిన జె.ప్రణతి (5), ప్రకాశం మార్కెట్‌కు చెందిన ఎం.సత్యనారాయణ (32), ఎస్సీకాలనీకి చెందిన వై. అప్పారావు (52), జాలరిదిబ్బకు చెందిన బెహర శ్యాం(8), ఎస్సీ కాలనీకి చెందిన కర్రి అప్పారావు (45), శ్రీనివాసకాలనీకి చెందిన బి.శంకరరావు, ఆకులడిపో వద్ద కె.ప్రభు (11), ఎస్సీ కాలనీకి చెందిన కె.సురేష్ (14)లను గాయపరచింది. పిచ్చికుక్క వివిధ ప్రాంతాల్లో సంచరిస్తూ కనిపించిన వారికి కరుస్తుండడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వారిలో కొందరు ఎస్.కోట ఆసుపత్రిలో, మరి కొందరు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

బావిలో జారిపడి మహిళ మృతి

గరివిడి: గరివిడి మండలంలో శివరాం గ్రామానికి చెందిన లక్కిడాపు రాములమ్మ (40) ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో గ్రామంలో ఉన్న నేలబావిలో జారిపడి మృతి చెందింది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాములమ్మ దుస్తులు ఉతికేందుకే నేలబావి వద్దకు వెళ్లిందని, ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెంది ఉంటుందన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

భవనం మంజూరు చేయండి

విజయనగరం టౌన్:నాలుగో తరగతి ఉద్యోగులకు అదనపు భవనం మంజూరు చేయాలని కోరుతూ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు ఆదివారం కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజును ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.లక్ష్మీ, ఎం.గంగాప్రసాదరావు, వెంకటరావు, కె.పద్మావతి, పి.ఉమమహేశ్వరరావు, కె.పైడిపునాయుడు, ఈ.పార్వతీ, ఎస్.సయ్యద్ ఖాదర్ బాబా, ఈశ్వరమ్మ, ఆర్.అప్పలరాజు పాల్గొన్నారు.

దిగువమెండంగిలో బాలింత, శిశువు మృతి

సాలూరు రూరల్: తోణాం పీహెచ్‌సీకి సమీపాన ఉన్న దిగువమెండంగి గ్రామానికి చెందిన తాడంగి తులసి (26)కి ఆదివారం వేకువజామున పురిటినొప్పులు వచ్చాయి. ఇంటి వద్దే మగబిడ్డ పుట్టాడు. పుట్టిన వెంటనే మృతి చెందాడు. తల్లికి రక్తస్రావం ఎక్కువ కావడంతో 108 వాహనంలో సాలూరు సీహెచ్‌ఎన్‌సీకి చికిత్స నిమిత్తం తరలించారు. ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. కుమారుడితో పాటు భార్య మృతి చెందడంతో భర్త సన్యాసి విలపించిన తీరు అందరి కంటకన్నీరు పెట్టింది. తులసి కుటుంబ సభ్యులతో పాటు భర్త సన్యాసిని స్థానిక ఎంపీటీసీ సభ్యుడు అనంత కుమార్, వైసీపీ నేత దండి శ్రీనివాసరావులు పరామర్శించి ఓదార్చారు.



మృతి చెందిన బాలింత

ఒడిశా

ఉత్సాహంగా గణనాథుని నవరాత్రులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ సమితి ఎనేసీ పరిధిలోగల కాశీనగర్ పెద్దమద్దిలవీధి చిన్నమద్దివీధిలలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలను తిలకించేందుకు పర్లాకిమిడి, గుణుపూర్ తదితర ప్రాంతాలతోపాటు ఆంధ్రా ప్రాంతానికి చెందిన భామిని, హిరమండలం, కొత్తూరు, సీతంపేట మండలాలకు చెందిన వేలాది మంది భక్తులు రోజూ వస్తున్నారు. కాశీనగర్ పెద్దమజ్జిలివీధి, చిన్నమద్దిల వీధిలో గణపతి విగ్రహాలను హైదరాబాద్ నుంచి వచ్చిన కళాకారులు తయారు చేశారు. 21అడుగుల ఎత్తుగల విగ్రహాలను ఏర్పాటు చేశారు. 21రోజులపాటు ఈఉత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

ఎర్లాకిమిడిలో ఆధ్యాత్మిక శోభ

పర్లాకిమిడి పట్టణంలోగల ఆరోగ్యవీధిలో ఆధ్యాత్మకశోభ నెలకొంది. గజపతి నవరా త్రి ఉత్సవాలు పురస్కరించుకొని ఎనిమిదో వార్డు ఏర్పాటుచేసిన గణేశ్ విగ్రహాన్ని చూ సేందుకు చుట్టుపక్కల నుంచి భక్తులు త రలివస్తున్నారు. కాగానిర్వాహకులు ఆదివా రం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

వంతెన నిర్మాణం పూర్తయ్యేదెన్నడో?

పర్లాకిమిడి:గజపతి జిల్లా గుమ్మసమితి పద్మాపురం జోగిపాడు గ్రామాల మధ్య వంతెన నిర్మాణం నత్తనడకన సాగుతోంది. ఏడాది కిందట ప్రారంభమైన ఈ వంతెన పనులు ఇంతవరకూ పూర్తి కాకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈఏడాది ఫిబ్రవరినాటికే పూర్తి కావాల్సిఉండగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారులు పట్టించుకోవడం వెరసి పనులువేగంగా కావడంలేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు తాత్కాలికంగా ఏర్పాటుచేసన అప్రోచ్ రోడ్డుకు కోతకు గురవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు వంతెననిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఇకపై గ్యాస్‌తోనే వంటలు!

- గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సెప్టెంబరు 1 నుంచి ప్రారంభం
- సందిగ్ధంలో వార్డెన్లు, హెచ్‌ఎంలు
- మేమే సరఫరా చేస్తాం: డీడీ

జియ్యమ్మవలస: పొగరహిత సమాజంగా తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చిన ప్రభుత్వం ఆదిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా తొలుత గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో గ్యాస్‌తోనే వంటకాలు చేయనుంది. సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేసింది. విధివిధానాలు ప్రభుత్వం నుంచి రాకపోవడంతో ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు పలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో ఉన్న సాలూరు, మక్కువ, పాచిపెంట, పార్వతీపురం, కొమరాడ, జియ్యమ్మవలస, కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో మొత్తం 55గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో దాదాపు 13 వేల మంది విద్యార్థినీ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. చాలావరకు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో కట్టెలతో వంటకాలు చేస్తూ వస్తున్నారు. వీరికి ప్రతి నెలా కట్టెలు బిల్లు ఐటీడీఏ ద్వారా ఇస్తూ వస్తున్నారు. ఈ కట్టెలతో వంటకాల వల్ల వంట చేసిన కుక్‌లకు ఇబ్బందులతో పాటు కొన్నిచోట్ల వంట ఆలస్యం అయ్యేది. అంతేకాకుండా వంటకు పొగకంపు కొట్టడం వల్ల పిల్లలు అనారోగ్యం బారిన పడేవారు. కొన్నిసార్లు కట్టెల బిల్లు రాకపోవడంతో వార్డెన్లు సొంతంగా కొనుగోలు చేసేవారు.



విధి విధానాలివి..

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో సెప్టెంబరు 1 నుంచి గ్యాస్‌తో వంటకాలు ప్రారంభం కానున్నాయి. మెనూ అమలుకు 3వ తరగతి నుంచి 7వ తరగతి వరకు రూ.750లు, 8 నుంచి 10వ తరగతి వరకు రూ.850లను ప్రభుత్వం అందిస్తోంది. నిబంధనల ప్రకారం మెనూ అమలు చేయాల్సిన బాధ్యత ఆయా ఆశ్రమ పాఠశాలల వార్డెన్లదే. గ్యాస్‌తో వంటకాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతి ఆశ్రమ పాఠశాలలకు 10 గ్యాస్‌బండలు, స్టవ్‌లు లేకపోతే స్టవ్‌లు ముందుగా అందిస్తారు. తరువాత ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జీసీసీ ద్వారా గ్యాస్ సరఫరాకు అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే గ్యాస్ బండలు ఎప్పుడైనా బయట వ్యక్తులకు ఇచ్చినట్లు గాని, దుబారా జరిగినట్లు గాని సమాచారం అందితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. గిరి శిఖర గ్రామాల్లో ఉన్న ఆశ్రమ పాఠశాలలకు గ్యాస్ ఏ విధంగా సరఫరా చేస్తారో వేచి చూడాల్సిందే. అన్ని ఏర్పాట్లు తామే చూస్తామని ఐటీడీఏ డీడీ వి.నారాయణుడు తెలిపారు.

పూరీ ఆలయంలో భద్రత కట్టుదిట్టం

పర్లాకిమిడి:ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పూరీలోగల జగన్నాథుని ఆలయానికి ఉగ్రవాద ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో భ ద్రత కట్టుదిట్టం చేశారు. కేంద్ర హోంశాఖ, ఇంటిలిజెన్స్‌వర్గాల హెచ్చరిక నేపథ్యంలో రాష్ట్ర పోలీసులు భద్రతా వ్యవస్థలో మార్పులు చేశారు. ఈనేపథ్యంలో ముగ్గురు సభ్యులతో నేషనల్ సెక్యూరిటీ బృందం జగన్నాథుని ఆలయాన్ని సందర్శించింది. హైదరాబాద్ నుంచి ఇక్కడికి వచ్చిన ఈ బృందం శని, ఆది వారాల్లో పరిశీలించింది. ఆలయానికి మూడువైపుల నుంచి ప్రదర్శన ద్వారాలు ఉన్నాయని, దీంతో ప్రమాదం పొంచి ఉందని గుర్తించారు. ఈమేరకు భద్రతను కట్టుదిట్టం చేసేలా నివేదిక అందించారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి

పర్లాకిమిడి:గజపతి జిల్లాలోని ఆర్. ఉదయగిరి సమితి పరిధిలో ఉన్న చన్నసాయి గ్రామంలో ఓ మహిళ అనుమానాస్పదంగా మృతి చెందింది. గ్రామానికి చెందిన విలాసిని నాయక ఆదివారం ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే కట్నం కోసం భర్త జుగిస్టర్ నాయక్ హత్య చేశాడని అనుమానం వ్యక్తం చేస్తూ ఆమె సోదరుడు ప్రభాకర్ రౌతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 1, 9

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): రుణాలు మంజూరవుతాయి. సన్నిహితుల ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. పొదుపు పథకాల గురించి సహోద్యోగులతో చర్చిస్తారు. ఆస్పత్రులు, ఔషధ రంగాల వారికి ప్రోత్సాహకరం.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): స్పెక్యులేషన్లు లాభిస్తాయి. శ్రీవారు, శ్రీమతి విషయాల్లో శుభపరిణామాలు చోటుచేసుకుంటాయి. ప్రేమానుబంధాలు బలపడతాయి. కొత్త పరిచయాలు ఉల్లాసం కలిగిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.

మిథునరాశి: (మే21-జూన్21): వృత్తి, వ్యాపారాల్లో మార్పులు, చేర్పులకు అనుకూలం. సహోద్యోగుల ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. ఉద్యోగ ప్రయత్నాలు కొలిక్కి వస్తాయి. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతారు.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): పొదుపు పథకాలు, చిట్‌ఫండ్‌లు లాభిస్తాయి. మెయిల్స్, శుభ సందేశాలు అందుకుంటారు. సాంకేతిక విద్యా కోర్సుల్లో ప్రవేశానికి అనుకూలం. ప్రేమానుబంధాలు బలపడతాయి. విద్యార్థులకు శుభప్రదం.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): కుటుంబ సభ్యుల సహకారంతో ఆర్థిక విషయాల్లో లక్ష్యాలు సాధిస్తారు. ఇంటి కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆర్థిక విషయాలను సమీక్షించుకుంటారు. రుణాలు మంజూరవుతాయి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సోదరీ, సోదరుల వ్యవహారాలు, ప్రయాణాలు, చర్చలకు అనుకూల సమయం. వాహనాలు కొనుగోలు చేస్తారు. స్టేషనరీ, ఏజెన్సీలు, మార్కెటింగ్, బోధన రంగాల వారికి శుభప్రదం. శుభవార్త అందుకుంటారు.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన కీలక సమాచారం అందుకుంటారు. రాజకీయ, సినీరంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులను సమీక్షించుకుంటారు. పాత బకాయిలు వసూలవుతాయి.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): స్నేహానుబంధాలు విస్తరిస్తాయి. యూనియన్‌లు, సహకార సంఘాల కార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తారు. వేడుకల్లో పాల్గొంటారు. ఊరేగింపులు, ప్రదర్శనల్లో పాల్గొంటారు. సంకల్పం నెరవేరుతుంది.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో ప్రముఖుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. రాజకీయ, సినీ, బోధన రంగాల వారు గౌరవ పదవులు అందుకుంటారు. పూర్వానుభవంతో లక్ష్యాలు సాధిస్తారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): న్యాయ, రక్షణ, బోధన రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. సంకల్పం నెరవేరుతుంది.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పెద్దల ఆరోగ్యం మెరుగుపడుతుంది. వృత్తి, వ్యాపారాల్లో పురోగతిని సమీక్షించుకుంటారు. ప్రముఖుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. శ్రమకు తగిన ఫలితం అందుకుంటారు.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. న్యాయ, రక్షణ, బోధన రంగాల వారు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. సమావేశాలకు సన్నాహాలు చేస్తారు. సంకల్పం ఫలిస్తుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

అన్నదాతకు అండగా

- పార్టీ, ప్రభుత్వం కృషి
- ఎంపీపీల మార్పు స్థానిక బాధ్యతే
- తేల్చేసిన కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు, మంత్రి సుజయ్
- బొబ్బిలిలో పార్టీ సమన్వయ కమిటీ సమావేశం




సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర, రాష్ట్రమంత్రులు, హాజరైన జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు

(బొబ్బిలి)

జిల్లాలో ప్రస్తుతం వర్షాభావ పరిస్థితి నెలకొందని దీని వల్ల ఖరీఫ్ గట్టెక్కలేమని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారని, వారికి టీడీపీతో పాటు ప్రభుత్వం అండగా నిలుస్తుందని కేంద్రమంత్రి పూసపాటి అశోక గజపతిరాజు, మంత్రి రంగారావు అన్నారు. ఆదివారం బొబ్బిలి మంత్రి రంగారావు చాంబర్‌లో పార్టీ సమన్వయకమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు మహంతి చిన్నంనాయుడు జిల్లాలోని వివిధ మండలాల్లో కురిసిన వర్షాల పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి అశోక్ మాట్లాడుతూ జిల్లాలో వర్షాభావ పరిస్థితులున్నప్పటికీ రైతులకు పార్టీ, ప్రభుత్వం తరపున అండగా నిలవాలని తీర్మానం చేసి ప్రభుత్వానికి, జాతీయపార్టీకి సూచించాలని కోరారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల ద్వారా శివారు భూములకూ నీరందించేలా కృషి చేయాలన్నారు. ఈ నెలాఖరుకు వర్షాలు కురిసి ప్రాజెక్టులు నిండితే చుక్క నీరు కూడా వృథా కాకుండా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకునేలా ప్రభుత్వం ఆదేశించాలని కోరారు. రైతులకు ఈ ఖరీఫ్ సీజన్‌కు ఎరువులు ఇబ్బంది లేకుండా సక్రమంగా అందించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సమన్వయ కమిటీలో రాష్ట్రమంత్రి రంగారావు మాట్లాడుతూ జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసేలా ప్రోత్సహించాలని, దీనికి వ్యవసాయాధికారులు సమాయత్తం కావాలని సూచించారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు అన్ని వర్గాలు కలసికట్టుగా పనిచేస్తున్నాయన్నారు. ఇంతవరకు 90 శాతం బూత్ కమిటీలు మాత్రమే వేయగలిగామని మిగతా 10 శాతం తొందరగా పూర్తి చేసి పార్టీని మరింత బలోపేతం చేసేలా కృషి చేయాలన్నారు. వచ్చే నెలలో ప్రారంభం కానున్న ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. ప్రజల వద్దకు వెళ్లడానికి ఇదే మంచి అవకాశమని దీనిని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో భారీ ఎత్తున కార్యక్రమం చేపట్టాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు చేర్చేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.

ఎంపీపీల మార్పు స్థానిక బాధ్యతే...

జిల్లాలోని జామి, ఎస్.కోటతో పాటు మరిన్ని మండలాల ఎంపీపీల మార్పుపై ఆయా మండల నాయకులు కేంద్ర, రాష్ట్రమంత్రుల ముందు ప్రస్తావించారు. ఈ సమయంలో ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ మాట్లాడుతూ ఎంపీపీ ఎన్నికల సందర్భంగా ఆయా నియోజకవర్గాల్లో మండల నాయకులు, స్థానిక ఎమ్మెల్యేలు కూర్చొని జంటిల్‌మెన్ ఒప్పందాలు చేసుకున్నారని అప్పట్లో వ్యవహారాన్ని జిల్లా పార్టీ ముందుకు తీసుకురాలేదని, అందువల్ల ఈ వ్యవహారం ఆయా నియోజకవర్గంలోని స్థానిక నాయకత్వమే చూసుకుంటే బాగుంటుందని సూచించారు. దీనికి మంత్రులు సానుకూలంగా స్పందిస్తూ ఎంపీపీల మార్పుల విషయంలో జిల్లా పార్టీ జోక్యం చేసుకోకపోవడమే మంచిదన్నారు. సమావేశంలో ప్రధానంగా ఎస్.కోట, జామి మండలాలపై చర్చ జరిగింది. గతంలో ఎస్.కోట ఎంపీపీ ఎన్నికల సందర్భంగా ప్రస్తుత ఎంపీపీ రెడ్డి వెంకన్న అలుగుబిల్లి ఎంపీటీసీ సభ్యుడు రామవరపు చంద్రశేఖర్ మధ్య జడ్పీ మాజీ చైర్మన్ లగుడు సింహాద్రి, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి సమక్షంలో ఒప్పందం జరిగినప్పటికీ పరిష్కారం లభించలేదన్నారు. జామి మండలానికి సంబంధించి ప్రస్తుత ఎంపీపీ అప్పాయమ్మను మార్చి ఇప్పల చంద్రకళకు ఇవ్వాలని ఒక వర్గం పట్టుబడుతోందని, దీనిపై ఇరువర్గాల వాదనలు విన్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు స్థానికంగా నిర్ణయం తీసుకోవాలని సూచించడంతో చర్చ అక్కడితో ముగిసింది.

అందరి దృష్టీ నంద్యాలపైనే

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఎక్కడ చూసినా నంద్యాల ఉప ఎన్నికలపైనే చర్చ జరుగుతోంది. ఎక్కడ ఏ ఇద్దరు చేరినా వారిమధ్య జరిగే చర్చ నంద్యాల ఎన్నికపైనే ఉంటోంది. దీనికి కారణం అధికార తెలుగుదేశం పార్టీ, ప్రతిపక్ష వైసీపీలు అన్ని శక్తులను వడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించాయి. దీనికి తోడు వచ్చే సాధారణ ఎన్నికలకు ఇదే నాందని రెండు పార్టీలు గట్టిగా నమ్ముతున్నాయి. ఈ పరిస్థితిలో ఇదే విషయం ప్రజలందరికీ చేరింది. దీంతో సోమవారం వెలువడనున్న ఎన్నికల ఫలితంపైనే అందరూ దృష్టి సారించారు. సోమవారం అంతా ఎన్నికల ఫలితాల కోసం టీవీల ముందు వాలిపోయే పరిస్థితి కనిపిస్తోంది. ఇదిలా ఉండగా బెట్టింగులు పెద్దఎత్తున జరిగే అవకాశం ఉన్న కారణంగా పోలీస్ శాఖ కూడా నిఘా పెట్టింది. ఓట్ల లెక్కింపు ఉదయం ప్రారంభమై సాయంత్రంలోగానే ఫలితం విడుదల కానున్న కారణంగా అందరి దృష్టి ఈ ఫలితంపైనే ఉంది.

మొదటి పేజీ తరువాయి

ఏడుగురిపై వేటు!

ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, ఇద్దరు సాంకేతిక సలహాదారులున్నారు. 'మరుగున ఆశయం' శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో వంద రోజుల్లో పదివేల మరుగుదొడ్ల నిర్మాణంపై జూన్ 5న కురుపాం, కొమరాడ మండలాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై కథనం వెలువడింది దీనిపై స్పందించిన కలెక్టర్ దర్యాప్తునకు ఆదేశించారు. కొమరాడ మండలం తొడుము, ఉలిపిరి గ్రామాల్లో జరిగిన మరుగుదొడ్ల నిర్మాణ అవకతవకలపై నా ప్రచురించిన మరో కథనానికీ స్పందించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సుమోటోగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అక్రమాలు జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించిన సంస్థ కేసు నమోదు చేసింది. తాజాగా అధికారులు చర్యలకు ఉపక్రమించి, ముందుగా ప్రోగ్రాం అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మండలాభివృద్ధి అధికారిని సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. మరో ఆరుగురిపైనా ఒకటి రెండు రోజుల్లో కఠిన చర్యలు తీసుకోనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

'బొంతలకోటి'కి జాతీయ స్థాయి అవార్డు



కళా రూపాలతో మహిళలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గజపతినగరం రూరల్: జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డుకు గంగచోళ్లపెంట జడ్పీ హైస్కూల్‌లో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు బొంతలకోటి శంకరరావు ఎంపిక య్యారు. వచ్చెనెల 5న న్యూఢిల్లీలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి ఈ అవార్డు అందుకోనున్నారు. గతంలో రాష్ట్రపతి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 147 వరకు అవార్డులు అందుకున్న బొంతలకోటికి ఇప్పుడు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికవ్వడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కళా రూపాలతో బోధన..

దేశంలోనే ప్రప్రథమంగా జానపద కళారూపాలు, పాట, నృత్యం, కోలాటం, బుర్రకథ, వీధి నాటకం, ఏకపాత్రాభినం ఇలా అనేక రూపాలో సాంఘిక శాస్త్రం పాఠాలను బోధిస్తూ విద్యార్థులను ఆకట్టుకుంటున్నారు. స్వయంగా హార్మోనియం, కీ బోర్డు, గిటార్ తదితర వాయిద్య పరికరాలను వాడుతూ ఆట, పాటలతో పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. చదువుపై విద్యార్థుల్లో భయం, ఒత్తిడిని పారదోలి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారు. కొన్ని వేలమంది ఉపాధ్యాయులకు బోధనలో మెలకువలపై శిక్షణ అందించారు. సాంఘిక శాస్త్రంలో సరిగమలు, నాంది పుస్తకాలు, సీడీ రూపాల్లో విడుదల చేసి పలువురి మన్ననలు పొందారు.



బొంతలకోటి శంకరరావు

ఐక్యరాజ్య సమితిలో గుర్తింపు

శంకరరావు జీవ వైవిధ్యం, పర్యావరణంపై విశేష కృషి చేసి ఐక్యరాజ్యసమితి (యూఎన్‌ఏ) గుర్తింపుతో పాటు ప్రపంచ మేధావులను ఆకర్షించారు. అంతర్జాతీయ జీవ వైవిధ్య సదస్సులో 19 రోజులు ఆయన పాఠాలను కళారూపాలుగా మార్చి ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ప్రకృతి పేరుతో రూపొందించిన పర్యావరణ వివిధ భాషల్లోనికి అనువదించారు. ప్రపంచ తెలుగు సభల్లో పాల్గొని తెలుగుభాషపై తాను చేసిన కృషికి బంగారు పతకాన్ని పొందారు. మాతృభాషపై రూపొందించిన అక్షరమే ఆయుధం సీడీని అదే సభలో ఆవిష్కరించారు. అంతర్జాతీయ కామన్వెల్త్ సమ్మేళనంలో తన కళారూపాల ప్రదర్శించి శభాష్ అనిపించుకున్నారు.

పాఠ్య పుస్తక రచయితగా

విద్యా రంగంలో వినూత్న పోకడలకు అనుగుణంగా, రాష్ట ప్రభుత్వం తరపున సాంఘిక శాస్త్రం పుస్తకం రచించి కళారూపంగా మలిచారు. ఉత్తమ పాఠ్య పుస్తక రచయితగా అవార్డును అందుకున్నారు. ఉపాధ్యాయులకు శిక్షణకు కరదీపికలు రూపొందించారు. సుమారు 20 వేలమంది ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. జాతీయ, అంతర్జాతీయ, సెమినార్ వర్క్‌షాపుల్లో పాల్గొని పుస్తకాలను రూపొందించారు.

నేడు కలెక్టరేట్ ఎదుట భోజన కార్మికుల ధర్నా

దాసన్నపేట:మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్నట్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం.మురళీధరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం ప్రైవేటు సంస్థలకు అప్పగించకుండా యధావిధిగా కొనసాగించాలని, గౌరవ వేతనం రూ.10వేలు ఇవ్వాలని, నాణ్యమైన కోడిగుడ్లు సరఫరా చేయాలని, సబ్సిడీపై గ్యాస్ సరఫరా, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేస్తున్నామన్నారు. పెద్ద ఎత్తున మధ్యాహ్న భోజన నిర్వాహకులు ధర్నాలో పాల్గొనాలని కోరారు.


కృష్ణయ్యకు వినతిపత్రం ఇస్తున్న సంఘ జిల్లా నాయకులు

బీసీల సమస్యలు పరిష్కరించండి

దాసన్నపేట: జిల్లాలో 80శాతం ఉన్న బీసీల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాని బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు ముద్దాడ మధు కోరారు. ఆదివారం గుంటూరులో జరిగిన బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర సమావేశంలో పాల్గొని జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా మధు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రకటించిన అత్యంత వెనుకబడిన జిల్లాల జాబితాలో విజయనగరం జిల్లాను చేర్చేలా చూడాలని కోరారు. జిల్లాలో దారిద్ర రేఖకు దిగువన ఉన్న బీసీల కోసం ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేయాలన్నారు. కుల వృత్తిదారులకు సబ్సిడీపై పరికరాలు అందజేయాలని కోరారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా సంఘ ప్రతినిధి పి.భాస్కరరావు ఉన్నారు.

బాబామెట్టలో లక్ష కుంకుమార్చన


కుంకుమ పూజల్లో భక్తులు

దాసన్నపేట:పట్టణంలోని బాబామెట్ట శివపంచాయతన దేవాలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం 108 మంది దంపతులచే లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు గణనాథుని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.వి.పి.రాజు, కార్యదర్శి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలతో భవిష్యత్ నాశనం

● జనవిజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ రాజశేఖర్

దాసన్నపేట:యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ ఎ.వి.రాజశేఖర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో 'మనోబలంతో మత్తు విముక్తి' అనే అంశంపై ఆదివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు బానిసవ్వడం వల్ల భవిష్యత్ నాశనమవుతుందని చెప్పారు. కేంద్రాసుపత్రి మానసిక చికిత్స విభాగాధిపతి డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ యువత మత్తుకు దూరంగా ఉండాలన్నారు. క్షణికావేశంలో చేసే తప్పులు జీవితాలను బలి చేస్తాయని తెలిపారు. ఒక ప్రణాళికతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ఎం.వి.ఆర్.కృష్ణాజీ, ఎం.వి.ఎన్.వెంకటరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న రాజశేఖర్

నిర్వహణ భారం!



●నిధులు చాలడం లేదంటున్న సామూహిక మరుగుదొడ్ల నిర్వాహకులు ●రెండు మూడు నెలలకోసారి బిల్లులు ●అస్తవ్యస్తంగా మరుగుదొడ్ల నిర్వహణ ● కొరవడిన అధికారుల పర్యవేక్షణ


మూసివేసిన సామూహిక మరుగుదొడ్డి

విజయనగరం టౌన్: విజయనగరం పట్టణంలో సామూహిక మరుగుదొడ్ల నిర్వహణ భారంగా మారింది. మున్సిపల్ అధికారులు సక్రమంగా బిల్లులు అందించడం లేదు. దీంతో నిర్వాహకులు సైతం వీటి నిర్వహణ అంతంత మాత్రంగానే చేపడుతున్నారు. విజయనగరం పట్టణంలో 48సామూహిక మరుగుదొడ్లు ఉన్నాయి. వీటి నిర్వహణ బాధ్యతను డ్వాక్రా సంఘాలకు అప్పగించారు. ప్రతినెలా రూ.3వేలు మున్సిపాలిటీ అందజేస్తోంది. దీంతోనే మరుగుదొడ్ల నిర్వహణ బాధ్యతను చేపట్టాల్సివుంది. ఈ మొత్తం కూడా రెండు మూడు నెలలకోసారి ఇస్తోంది. నెలకోసారి ఇవ్వకపోవడం వల్ల మరుగుదొడ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది.

రూ.50లక్షలతో మరమ్మతులు చేసినా...

స్వచ విజయనగరంలో భాగంగా ఇప్పటికే రూ.50లక్షలతో మరుగుదొడ్లను మరమ్మతులు చేపట్టింది. వీటిలో నాలుగైదు మినహా మిగిలినవి మురికివాడల్లోనే ఉన్నాయి. మురికివాడల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునే అవకాశం లేకపోవడం వల్ల ఎక్కువ మంది సామూహిక మరుగుదొడ్లనే వినియోగిస్తున్నారు. వీటి నిర్వహణకు ఇచ్చే మూడు వేలలోనే స్వీపర్, ఫినాయిల్, చీపుర్లు ఇలా అన్నింటికీ ఉపయోగించాలి. ఈ మొత్తం చాలడం లేదన్న అభిప్రాయం నిర్వాహకుల నుంచి వ్యక్తమవుతోంది.

శ్రామిక సంఘ అధ్యక్షుడిగా 'అప్పారావు'

నెల్లిమర్ల: స్థానిక జూట్ మిల్లు శ్రామిక సంఘం అధ్యక్షుడిగా పతివాడ అప్పారావు ఎన్నికయ్యారు. సంఘం అధ్యక్షుడు ఎస్.గంగాధరరెడ్డి ఇటీవల మరణించడంతో మొయిదలో మాజీ మంత్రి సాంబశివరాజు స్వగృహంలో ఆదివారం జరిగిన శ్రామిక సంఘం కార్యవర్గ ఎన్నికలో అప్పారావును అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇంతవరకు అప్పారావు ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. తాజాగా అధ్యక్షుడిగా ఎన్నికవడంతో ప్రధాన కార్యదర్శి పదవి శీర వెంకటరావుకు దక్కింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు అప్పారావు, వెంకటరావు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. మిల్లు సక్రమ నిర్వహణ ద్వారా కార్మికులు ఉపాధి నిలబెట్టుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. కార్మికులకు మిల్లు యాజమాన్యం నుంచి రావాల్సిన అన్ని రకాల బకాయిలు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు మిల్లు యాజమాన్యంతో చర్చలు జరుపుతామన్నారు. గ్రాట్యుటీ బకాయి చెల్లింపునకు కృషి చేస్తామని, అర్హులైన కార్మికులందరికీ ఉద్యోగోన్నతి కల్పించడంతో పాటు అప్రంటిస్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ తదితర సదుపాయాలు అమలయ్యేలా చర్యలు చూస్తామని, అందరూ సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ చిక్కాల వెంకట గోవిందరావు, సంఘం ప్రతినిధులు కొమ్మూరు సత్యనారాయణ, రెడ్డి సన్యాసినాయుడు, బూడి సత్యనారాయణ, సముద్రపు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


ఎంపికైన అప్పారావు, వెంకటరావు

మూడేళ్ల పాలన అవినీతిమయం

● సీపీఎం డివిజన్ కార్యదర్శి శంకరరావు

దాసన్నపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మూడేళ్ల పాలన అవినీతిమయమని సీపీఎం డివిజన్ కార్యదర్శి రెడ్డి శంకరరావు అన్నారు. ఆదివారం డాబాతోట, రామకృష్ణనగర్, పువ్వాడ, కళాసీ జట్టు కేంద్రం వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మూడేళ్ల ప్రజా వ్యతిరేక విధానాలపై ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రణాళికా సంఘాలు రద్దు చేసిందని, కార్మిక చట్టాల్లో మార్పులు తీసుకు వచ్చి కార్మిక సంక్షేమాన్ని తుంగల్లో తొక్కిం దని విమర్శించారు. జీఎస్టీ పేరుతో ప్రజలపై భారాన్ని పెంచిందన్నారు. రోజురోజుకూ పెట్రోల్ ధరలు మండుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సీఎం చంద్రబాబు పుణ్యామని పరిశ్రమలు మూతపడి జిల్లాలో 30వేల కార్మికులు రోడ్డున పడ్డారని తెలిపారు. సంపాదనే తప్ప ప్రజా సంక్షేమాన్ని విస్మరించారన్నారు. సమావేశంలో రమణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి శంకరరావు

అలరించిన సంకీర్తనామృతం

దాసన్నపేట: వినాయకచవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రామనారాయణంలో ఆదివారం ఎ.లక్ష్మీశైలజచే ఏర్పాటు చేసిన సంకీర్తనామృతం కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. గణపతిని స్తూతిస్తూ ఏరీతిని కీర్తించునూ అంటూ ప్రారంభించిన కచేరీలో పలు కీర్తనలను ఆమె హృద్యంగా ఆలపించారు. మృదంగంపై శ్రీనివాస్, వయోలీన్‌పై సుబ్బరాజులు సహకారం అందించారు.


కీర్తనలు ఆలపిస్తున్న లక్ష్మీశైలజ

సీపీఎస్ విధానం రద్దు చేసే వరకూ పోరాటం

విజయనగరం టౌన్:కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేసే వరకూ పోరాటం చేస్తామని ఏపీటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎ.సదాశివరావు చెప్పారు. ఆదివారం ఏపీటీఎఫ్ కార్యాలయంలో అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఇప్పటికే పలు కార్యక్రమాలు నిర్వహించామన్నారు. భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. ఈ సమస్యల సాధనకు అందరూ సమష్టిగా పోరాటం చేయాలని కోరారు. మిలీనియం మార్చ్ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని తమ గళాన్ని వినిపిస్తామని తెలిపారు. నూతన సీపీఎస్ విధానాన్ని వద్దని అన్ని సంఘాలు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు డి.ఈశ్వరరావు, జెసీ రాజు, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యాధికారిని నియమించాలి

గరుగుబిల్లి : మండల కేంద్రంలోని ఆయుష్ ఆసుపత్రికి వైద్యున్ని నియమించాలని ప్రజలు కోరుతున్నారు. ఆసుపత్రికి ఏడాది కాలంగా వైద్యుడ్ని నియమించలేదని చెబుతున్నారు. గతంలో విధులు నిర్వహించిన డాక్టర్ పద్మావతి బదిలీపై వెళ్లారు. తదుపరి ఆయుష్ వైద్యశాలపై పర్యవేక్షణ లోపం కరువయ్యింది. గత కొన్నాళ్లుగా వైద్యశాలకు తాళం వేసి ఉండటంతో రోగులు తిరుగు ముఖం పట్టేవారు. ఇక్కడ విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన ద్వారపురెడ్డి వేణుగోపాలరావు ఆయుష్ వైద్యంపై అధికంగా అవగాహన కల్పించారు. దీంతో మండలంలోని పలు గ్రామాల్లోని రోగులకు హోమియో వైద్యంపై ఆదరణ పెరిగింది. ప్రస్తుతం వైద్యాధికారి లేకపోవడంతో పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వేగవంతంగా ఉపాధి రికార్డుల తయారీ

కేంద్ర బృందం పరిశీలన నేపథ్యంలో తలమునకలైన సిబ్బంది





రికార్డుల తయారీలో నిమగ్నమైన సిబ్బంది .. రహదారి పక్కన ఏర్పాటు చేసిన సమాచార పట్టిక

గరుగుబిల్లి : మండలంలో ఉపాధి హామీ పనులు పరిశీలనకు కేంద్ర బృందం వస్తుందన్న సమాచారంతో సిబ్బంది రికార్డుల తయారీలో తలమునకలవుతున్నారు. గత కొద్ది రోజులుగా మండలంలోని 26 పంచాయతీలకు సంబంధించి అవసరమైన రిజిస్టర్లు, ఎంబుక్‌లు తయారీలో ఉపాధి సిబ్బంది పూర్తిస్థాయిలో నిమగ్నమయ్యారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠశాలల్లో బోధన ఎలా చేస్తారో ఆ విధంగా క్షేత్ర సహాయకులకు, టెక్నికల్ అసిస్టెంట్లకు అధికారులు సూచనలు అందిస్తూ పూర్తికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పథకానికి సంబంధించి పంచాయతీ పరిధిలో ఏడు రకాల రిజిస్టర్లు, కార్యాలయ పరిధిలో 17 రకాల రిజిస్టర్లు నిర్వహించాల్సి ఉంది. అయితే గత కొన్నాళ్లుగా సిబ్బంది మస్టర్లకే పరిమితమవడంతో రిజిస్టర్లపై దృష్టి సారించలేకపోయారు. దీంతో సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. ఈ తరుణంలో తమకు నచ్చిన విధంగా రికార్డులు తయారీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల పరిధిలో పర్యవేక్షణ లోపం కరువవ్వడంతో క్షేత్ర సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు ఎవరికి తోచిన విధంగా వారు వ్యవహరిస్తున్నారు. పనులు పరిశీలించాల్సిన టెక్నికల్ అసిస్టెంట్లు తమ సొంత కార్యక్రమాలకే అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో ఈ పరిస్థితి దాపురిస్తోందని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లకుండా కార్యాలయంలోనే నిర్వహిస్తున్న పరిస్థితి నెలకొంది. ఉపాధికి సంబంధించి 2016-17, 2017-18 సంవత్సరాలకు సంబంధించి ఏప్రిల్ నెల నుంచి పూర్తి సమాచారం పొందుపర్చాల్సి ఉంది. ఆ సమయంలో ఎందుకు రికార్డులు నిర్వహించలేదన్న ప్రశ్న పలువురి నుంచి వినిపిస్తోంది. అప్పట్లో ఏ పనులు జరిగాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. లక్షలాది రూపాయలతో నిర్మించిన పనులు ఆయా ప్రాంతాల్లో విధిగా సమాచార బోర్డును ఏర్పాటు చేయాలి. ఆ విధంగా సిబ్బంది దృష్టి సారించలేదు. ప్రస్తుతం కేంద్ర బృందం వస్తుందన్న సమాచారంతో తలలు పట్టుకుని బోర్డులు ఏర్పాటుకు సామగ్రిని కార్యాలయంలో భద్రపర్చారు.

దీనికి తోడు గత కొన్నాళ్లుగా మండల అభివృద్ధి కార్యాలయంలో ఉపాధి పనులకు సంబంధించి సమాచార పట్టిక ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం కార్యాలయం ప్రాంగణంలో ఆకస్మాత్తుగా 2014 నుంచి జరిగిన పనులకు సంబంధించి సమాచారాన్ని ఏర్పాటు చేశారు. మొత్తంపై రికార్డులు ఈ నెల 20లోగా అందించాలని ఉన్నతాధికారులు ఆదేశించినా నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి.

పేదలకు ఆర్థికసాయం

బలిజిపేట: మండలం పెదపెంకిలో మానవసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. బాపూజీ గ్రంథాలయం ఆధ్వర్యంలో ఫౌండేషన్ సభ్యుడు ఈర్ల సంజీవనాయుడు గ్రామపెద్దల సమక్షంలో గ్రామానికి చెందిన నిరుపేద మహిళకు రూ.5వేలు అందజేశారు. తమ కుమార్తె వివాహానికి ఈ ఆర్థిక సాయం చేశామని చెప్పారు. ఈ. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

జీఎస్టీతో నష్టపోతున్న చిరు వ్యాపారులు

● పన్నుల భారం తగ్గించాలి ● మాజీ ఎమ్మెల్యే లక్ష్మణమూర్తి

గుమ్మలక్ష్మీపురం : జీఎస్టీ చిరు వ్యాపారుల పాలిట గుదిబండగా మారిందని సీపీఎం నాయకులు, మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి పేర్కొన్నారు. స్థానికంగా వర్తక సంఘం ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. నిత్యవసర సరుకులు, ఆహార వస్తువులకు పన్ను మినహాయింపు చేశామని ప్రభుత్వం పేర్కొన్నా నిజానికి ఈ సరుకుల రేటు తగ్గలేదన్నారు. హోటల్‌లో టిఫిన్ నుంచి బట్టల వరకు ఐదు నుంచి ఎనిమిది శాతం వరకు జీఎస్టీ విధించారన్నారు. వికలాంగులు వాడే పరికరాలు, చివరకు మహిళలు వాడే వస్తువుల వరకు ఎవరినీ వదలకుండా జీఎస్టీ విధించారని ఆందోళన వ్యక్తం చేశారు. వస్తు ఉత్పత్తి నుంచి అమ్మకం వరకు ప్రతి చోట పన్ను వివిధ దశల్లో చెల్లించాల్సి వస్తుందన్నారు. గిరిజన సంఘం నాయకుడు మండంగి రమణ మాట్లాడుతూ నోట్ల రద్దు వల్ల ప్రభుత్వం ఏమీ సాధించలేదని, జీఎస్టీ వల్ల జరిగేది అదేనని ఎద్దేవా చేశారు. జీఎస్టీ వల్ల మరిన్ని అనర్థాలు వస్తాయన్నారు. సీపీఎం నాయకుడు అవినాష్ మాట్లాడుతూ జీఎస్టీ వల్ల ఇప్పటికే ఉన్న పరోక్ష పన్నుల భారం మరింత పెరిగి పేద, మధ్య తరగతి ప్రజల జేబులు ఖాళీ అవుతున్నాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ పన్ను బారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. చిన్న వ్యాపారుల ఉద్యమానికి తమవంతు మద్దతు ఉంటుం దని చెప్పారు. ఈ సమావేశంలో వర్తక సంఘం అధ్యక్షుడు బుడంకాయల ఆనంద్, వర్తకులు కింతల వెంకటరావు, బుడంకాయల రామప్రసాద్, మద్ది నాని, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఈడీ బల్బుల మారక కేంద్రం ఏర్పాటు చేయండి

గుమ్మలక్ష్మీపురం : రాష్ట్ర విద్యుత్‌శాఖ వినియోగదారులకు పంపిణీ చేసిన ఎల్ఈడీ బల్బులు కాలిపోయిన పక్షంలో వాటిని మార్చే కేంద్రాన్ని కురుపాంలో ఏర్పాటు చేసింది. ఈ కారణంగా మండలంలోని 27 పంచాయతీల్లో బల్బులు కాలిపోయిన వినియోగదారులు 30 కిలోమీటర్ల దూరంలో గల కురుపాం వెళ్లడం ఇబ్బందిగా మారింది. సంబంధిత అధికారులు గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో ఎల్ఈడీ బల్బులు మారక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

గరుగుబిల్లి పీఏసీఎస్ చైర్మన్ మృతి



తవిటినాయుడు (ఫైల్)

దళాయివలస (గరుగుబిల్లి) : మండల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ గులిపల్లి తవిటినాయుడు (84) శనివారం రాత్రి మృతి చెందారు. గత కొద్ది రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈయన గతంలో దళాయివలస సర్పంచ్‌గా రెండు పర్యాయాలు, సహకార సంఘం అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు పదవులు నిర్వహించారు. తదుపరి సహకార సంఘాలను కుదించడంతో గరుగుబిల్లి సంఘం నుంచి చైర్మన్‌గా బరిలో నిలిచి గెలుపొందారు. అధిక కాలం సహకారం సంఘంలో పదవులు నిర్వహించి రైతులకు మెరుగైన సేవలందించారు. ఆయన మృతి పట్ల డీసీసీబీ చైర్మన్ మరిశర్ల తులసి, ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, వైద్యుడు ద్వారపురెడ్డి రామ్మోహనరావు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ద్వారపురెడ్డి ధనుంజయరావు, మాజీ ఎంపీపీలు మర్రాపు పురుషోత్తంనాయుడు, ఉరిటి రామారావు, ద్వారపురెడ్డి సత్యనారాయణ, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పెదిరెడ్డి సింహాచలంనాయుడు, సహకారశాఖ సిబ్బంది చొక్కాపు రవికుమార్, గొడబ యుగంధర్, ఒలేటి గుంపస్వామితో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

శ్రామిక సంఘ అధ్యక్షుడిగా 'అప్పారావు'



ఎంపికైన అప్పారావు, వెంకటరావు

నెల్లిమర్ల: స్థానిక జూట్ మిల్లు శ్రామిక సంఘం అధ్యక్షుడిగా పతివాడ అప్పారావు ఎన్నికయ్యారు. సంఘం అధ్యక్షుడు ఎస్.గంగాధరరెడ్డి ఇటీవల మరణించడంతో మొయిదలో మాజీ మంత్రి సాంబశివరాజు స్వగృహంలో ఆదివారం జరిగిన శ్రామిక సంఘం కార్యవర్గ ఎన్నికల్లో అప్పారావును అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇంతవరకు అప్పారావు ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. తాజాగా అధ్యక్షుడిగా ఎన్నికవడంతో ప్రధాన కార్యదర్శి పదవి శీర వెంకటరావుకు దక్కిం ది. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అప్పారావు, వెంకటరావు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. మిల్లు సక్రమ నిర్వహణ ద్వారా కార్మికులు ఉపాధి నిలబెట్టుకోవాల్సిన పరిస్థితి ఉంద న్నారు. కార్మికులకు మిల్లు యాజమాన్యం నుంచి రావాల్సిన అన్ని రకాల బకాయిలు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు మిల్లు యా జమాన్యంతో చర్చలు జరుపుతామ న్నారు. గ్రాట్యుటీ బకాయి చెల్లింపునకు కృషి చేస్తామని, అర్హులైన కార్మికులందరికీ ఉద్యోగోన్నతి కల్పించడంతో పా టు అప్రంటిస్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ తదితర సదుపాయాలు అమలయ్యేలా చర్యలు చూస్తామని, అందరూ సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ చిక్కాల వెంకట గోవిందరావు, సంఘం ప్రతినిధులు కొమ్మూరు సత్యనారాయణ, రెడ్డి సన్యాసినాయుడు, బూడి సత్యనారాయణ, సముద్రపు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పంచకుండీ యజ్ఞం



యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

కురుపాం : వినాయక చవితి ఉత్సవాలు సందర్భంగా కురుపాంలో పంచకుండీ యజ్ఞం ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో మెయిన్‌రోడ్డులో నిర్వహిస్తున్న గణపతి ఉత్సవాలను పురస్కరించుకుని వినాయకుని వద్ద రావాడ గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో వేదమంత్రాల మధ్య పంచకుండీ యజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంకీర్తనామృతం



కీర్తనలు ఆలపిస్తున్న లక్ష్మీశైలజ

దాసన్నపేట: వినాయకచవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రామనారాయణంలో ఆదివారం ఎ.లక్ష్మీశైలజచే ఏర్పాటు చేసిన సంకీర్తనామృతం కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. గణపతిని స్తూతిస్తూ ఏరీతిని కీర్తించునూ అంటూ ప్రారంభించిన కచేరీలో పలు కీర్తనలను ఆమె ఆలపించారు. మృదంగంపై శ్రీనివాస్, వయోలీన్‌పై సుబ్బరాజు సహకారం అందించారు.

బాబామెట్టలో లక్ష కుంకుమార్చన

పట్టణంలోని బాబామెట్ట శివపంచాయతన దేవాలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం 108 మంది దంపతులచే లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ అర్చ కుడు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు గణనాథుని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.వి.పి.రాజు, కార్యదర్శి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చింతపిక్కల గణపతి

ఎల్విన్‌పేట (గుమ్మలక్ష్మీపురం) : మండలంలోని ఎల్విన్‌పేట జంక్షన్‌లో ప్రతిష్ఠించిన చింతపిక్కలతో తయారు వినాయక విగ్రహం చూపరులను ఆకట్టుకుంటోంది. సుమారు 12 అడుగుల ఎత్తు గల ఈ విగ్రహాన్ని చూసేందుకు భక్తులు బారులుతీరుతున్నారు. అలాగే వినాయక చవితి సందర్భంగా గుమ్మలక్ష్మీపురం మెయిన్‌రోడ్డు, మధ్యవీధిలో అన్నసమారాధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



టంగ్ ట్విస్టర్స్

1. Clean clams crammed in clean cans.
2. There those thousand thinkers were thining how did the other three thieves go through.
3.Singing Sammy sung songs on sinking sand.
4. Picky people pick Peter Pan PeanutButter, 'tis the peanut-butter picky people pick.

సూక్తి

అసత్యంతో సాధించే విజయం కంటే.. సత్యంతో సాధించే పరాజయమే మేలు.

ఔనా!



డాల్ఫిన్లు ప్రతి అరగంటకు ఒకసారి సముద్ర ఉపరితలానికి వచ్చి ఊపిరి పీల్చుకుంటాయి.

అద్దాల మయసభ

అదో అద్దాల దారి. అందులో అడుగుపెట్టామో.. ఎటు వైపు చూసినా ప్రతిబింబాలే కనిపిస్తాయి. ఏ దిక్కుకు వెళ్లాలో అర్థం కాదు. కాలు తీసి కాలు వేద్దామంటే.. అంతా అయోమయం. అద్దాల తళుకులు, మిరుమిట్లుగొలిపే కాంతులు కనులను మాయ చేస్తాయి. మరి అద్దాల దారుల్లో అసలు దారేదో కనుక్కోవడమే దీని ప్రత్యేకత. ఇదో 'దారి కనుక్కోండి' పజిల్ అన్న మాట. సింగపూర్‌లోని 'విజ్ఞాన కేంద్రం'(సైన్స్ సెంటర్)లో ఆకట్టుకుంటున్న ఈ 'మిర్రర్ మేజ్' ఓ ఆధునిక మయసభ అన్నమాట!



'దారి కనుక్కోండి' పజిల్ అంటే చాలామందికి ఎంతో ఇష్టం. చాలా దేశాల్లో రకరకాల 'మేజ్ పజిళ్లు' పర్యాటకులను ఆకట్టుకుంటాయి. మొక్కజొన్న, పొద్దు తిరుగుడు తోటల్లోనూ తికమక పెట్టే దారులు ఏర్పాటు చేస్తుంటారు. అలానే సింగపూర్‌లో 'సైన్స్ సెంటర్' ఏర్పాటు చేసి 40 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఇటీవలే అందులో ఓ 'మిర్రర్ మేజ్'ను ఏర్పాటు చేశారు. పెద్ద పెద్ద అద్దాలు ఫ్రేములతో దీన్ని తీర్చిదిద్దారు. ఇందులోకి అడుగుపెడితే చాలు.. పైనా, కిందా, ఎటు వైపు చూసినా అద్దాల అందాలే. ఒకటికి పది ప్రతిబింబాలు కనిపిస్తుంటే.. అంతా అయోమయంగా తోస్తుంది. ఎటువైపు వెళ్లాలో తెలియదు. దారి ఉంది కదా అని అటు వైపు వెళ్లామో.. అంతే అది 'డెడ్ ఎండ్'ను సూచిస్తుంది. ప్రతి మలుపులో భ్రమింపచేసే ఎన్నో మాయలు. అసలు దారి ఎటు ఉందో తెలుసుకుంటే ఈ పజిల్ పూర్తి చేసినట్టే. ఈ అద్దాల గందరగోళానికి తోడు, మిరుమిట్లు గొలిపే లైట్ల కాంతులు కళ్లను తప్పుదోవ పట్టిస్తాయి. మొత్తంగా 270 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఆ అద్దాల మేజ్ సందర్శకులన ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ మేజ్ సెప్టెంబర్ వరకు పర్యాటకుల కోసం అందుబాటులో ఉంటుంది. మయసభను తలపిస్తున్న ఈ మాయ అద్దాల దారిలో నడుస్తూ, తెగ సంతోష పడుతు ఆ జ్ఞాపకాల్ని తమ సెల్‌ఫోనుల్లో బంధించుకుంటున్నారు. ఎవరైనా ఉచితంగానే మిర్రర్ మేజ్‌ను సందర్శించవచ్చు.



- **ఆసియాలోని అతి పెద్ద 'మిర్రర్ మేజ్'గా ఇది రికార్డు సృష్టించింది.**
- **కాంతి భౌతిక ధర్మంతో పాటు, రంగులు కలిగించే భ్రమను సందర్శకులకు తెలియజేయడమే ఈ మిర్రర్ మేజ్ లక్ష్యమని నిర్వాహకులు అంటున్నారు.**
- **బ్రిటన్‌కు చెందిన ప్రముఖ మేజ్ డిజైనర్ 'అడ్రియన్ ఫిషర్' ఈ మేజ్‌ను రూపొందించాడు.**

నవ్వుల్ నవ్వుల్

లంబూ : ఏరా! మేధావీ కొత్త కారు కొన్నావట? ఏ కంపెనీది?

మిస్టర్ మేధావి : కంపెనీ పేరు గుర్తుకు రావడం లేదు కానీ 'టీ'తో స్టార్ట్ అవుతుంది.

లంబూ : అవునా! నాది పెట్రోల్ పోస్తే గానీ స్టార్ట్ కాదు.

చెప్పగలరా?


వనంలో ఉన్నా కానీ మనంలో లేను
దివిలో ఉన్నా కానీ భువిలో లేను
నత్తిలో ఉన్నా కానీ సుత్తిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

మీకు తెలుసా?




పడుకున్నప్పటికంటే టీవీ చూస్తుంటేనే ఎక్కువ క్యాలరీలు ఖర్చు అవుతాయి.


బొమ్మ గీయండి



దారి కనుక్కోండి



రంగులు వేయండి



జవాబులు

చెప్పగలరా? : వదిన

జంతర్‌మంతర్ :
1. మెలకువ
2. వినియోగం
3. సుప్రభాతం
4. పంచాయతి

జంతర్‌మంతర్

1. మెకువల ▶ ....
2. వియోనిగం ▶ ....
3. భాతంసుప్ర ▶ ....
4. చాపంయతి ▶ ....

చుక్కలు కలపండి



మొదలైన కరెంట్ కష్టాలు!

తెర్లాం: మండలంలో నాలుగు రోజులుగా విద్యుత్ కష్టాలు మొదలయ్యాయి. దీంతో వినియోగదారులు పలు విధాలుగా అవస్థలు పడుతున్నారు. రాత్రి పూట దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఎటువంటి వ్యాధులు ప్రబలుతాయోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం పూట కరెంట్ తీసిన ఇబ్బందులు ఉండదు. కానీ, రాత్రి సమయంలో కరెంట్ తీసేయడం వలన అటు విద్యార్థులు, ఇటు వినియోగదారులు ఎన్నో బాధలకు గురికావాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ఎటువంటి కోతలు లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని సర్వత్రా కోరుతున్నారు.

నడక.. 40 విధాల లాభం

● మాజీ వాకర్స్ క్లబ్ జనరల్ సెక్రటరీ చంద్రినాయుడు



బొబ్బిలి రూరల్: నడక 40 విధాల లాభమని వాకర్స్ క్లబ్ మాజీ జనరల్ సెక్రటరీ జి.చంద్రినాయుడు తెలిపారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ, ప్రతి మనిషి నేడు మరయంత్రంలో బతుకుతున్నాడని, జీవన శైలిలో అనేక మార్పులు వచ్చాయన్నారు. మనిషి జీవితంలో వ్యాయామం ఒక భాగం కావాలని, ముఖ్యంగా మదుపు లేనిది తెల్లవారుజామున నడవడం. మనిషి జీవితంలో నడక ఒక దినచర్యగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. దీనివల్ల హార్ట్ అటాక్, బీపీ, సుగర్ వంటి వ్యాధులు క్రమబద్ధం అవుతాయని, నడక వల్ల శరీరం నుంచి అనేక రసాయనాలు విడుదలై మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. అలాగే స్థూలకాయం తగ్గుతుందని, కొలిస్ట్రాలు తగ్గించి, శారీరక దారుఢ్యం పెగుతుందని తెలిపారు. అన్ని వయసుల వారు రోజుకు కనీసం 3 నుంచి 5 కిలో మీటర్లు నడిస్తే చాలా మంచిదన్నారు. నడకతో పాటు యోగా, స్లో సైక్లింగ్ చిన్నపాటి వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు.

రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ

బొబ్బిలి: విశ్వబ్రాహ్మణ సంఘం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా బొబ్బిలి సీహెచ్‌సీలో ఉన్న రోగులకు ఆదివారం ఆ సంఘం అధ్యక్షుడు దివ్వెల ఈశ్వరరావు ఆధ్వర్యంలో పాలు, రొట్టె, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంఘం స్థాపించి, ఏడాది పూర్తి చేసుకుని, రెండో ఏడాదిలోకి అడుగు పెట్టడం ఆనందంగా ఉందన్నారు. ఏడాది కాలంలో కుల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, విశ్వబ్రాహ్మణులు సమాజంలో ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారని, వీరి అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కులవృత్తిని చేపట్టే వారికి ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలిచ్చి పనిముట్లు కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పి.గోవిందరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐటీడీఏలో కలెక్టర్ గ్రీవెన్స్ సెల్

పార్వతీపురం: పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయంలో కలెక్టర్ వివేక్ యాదవ్ సోమవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించనున్నారు. ముందుగా డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం చేపట్టి అనంతరం గ్రీవెన్స్ నిర్వహిస్తారు. కలెక్టర్‌తో పాటు ఐటీడీఏ పీవో డాక్టర్ లక్ష్మీశ, తదితరులు హాజరుకానున్నారు.

ఇదిలా ఉండగా, కలెక్టర్ వివేక్ యాదవ్ మీ కోసం కార్యక్రమం ద్వారా నిర్వ హిస్తున్న గ్రీవెన్స్ సెల్‌లో వివిధ సమస్యలపై ప్రజలు అందిస్తున్న వినతులను పరిష్కరించడంలో అధికార యంత్రాంగం తూతూమంత్రంగా వ్యవహరిస్తోందని ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. సమస్యలపై వినతులను అందిస్తున్నప్పటికీ అవి పూర్తిస్థాయిలో పరిష్కారానికి నోచుకోవడం లేదని పలువురు అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో తాగునీరు, సాగునీరు తదితర సమస్యలపై వినతులు అందిస్తున్నప్పటికీ పరిష్కారం కావడం లేదన్నది గిరిజన ప్రాంతాల ప్రజల ఆవేదన. ఇప్పటికైనా కలెక్టర్ తీసుకుంటున్న వినతులను పరిశీలించి, పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని అర్జీదారులు కోరుతున్నారు.

మొక్కలు నాటేందుకు సర్వం సిద్ధం

పార్వతీపురం టౌన్ : పట్టణంలోని కొత్తవలస సత్యనారాయణ స్వామి ఆలయం పక్కన కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు, రాష్ట్ర మంత్రి సుజయ్‌కృష్ణరంగారావు వనం-మనం కార్యక్రమంలో భాగంగా సోమవారం మొక్కలు నాటేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర గ్రామ సమీపంలోని ఉద్యాన వన యూనివర్సిటీ క్యాంపస్‌లో జరిగే సంకల్ప సిద్ధి కార్యక్రమానికి విచ్చేస్తున్న మంత్రులు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారని మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం ఏఈ ఆనంద్‌కుమార్ తెలిపారు.



స్థలాన్ని చదును చేస్తున్న సిబ్బంది

నిరుపయోగంగా ఆర్టీసీ కాంప్లెక్స్!

● వృథా అయిన ప్రభుత్వ నిధులు ● ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

(తెర్లాం)

ప్రయాణికుల సౌకర్యార్థం 2007లో తెర్లాంలో నిర్మించిన ఆర్టీసీ కాంప్లెక్స్ నిరుపయోగంగా మారింది. సుమారు రూ.17 లక్షలతో నిర్మించిన కాంప్లెక్స్‌ను అప్పటి కేంద్ర మాజీ మంత్రి దివంగత నేత ఎర్రంనాయుడు ప్రారంభించారు. మూడు ప్లాట్‌ఫారాలు, కంట్రోల్ రూం, రెండు స్టాల్స్ గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. అయితే నాలుగేళ్ల వరకు ప్రయాణికులకు సేవలు అందించారు. తదనంతరం కాంప్లెక్స్‌కు కంట్రోలర్ కరువయ్యారు. దీంతో బస్సు ఎప్పుడు వస్తుంది రానిది సమాచారం తెలియకపోవడం ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. తాజాగా కాంప్లెక్స్ రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, శిథిలావస్థకు చేరుకున్న కాంప్లెక్స్‌ను మరలా ప్రారంభించే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



వెలవెలబోతున్న కాంప్లెక్స్

కాకినాడ ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యం

● టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మమ్ముల

రామభద్రపురం: కాకినాడ నగర పాలక ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు తెలిపారు. కాకినాడలో జరుగుతున్న ఎన్నికల ప్రచారానికి తిరుపతిరావుతోపాటు జిల్లా నుంచి నాయకులు తరలివెళ్లి, ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడుతూ, ప్రచార వివరాలు తెలియజేశారు. శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి ఆధ్వర్యంలో కాకినాడలో 27, 30 వార్డుల్లో పోర్టు కార్మికులు నివసిస్తున్న ప్రాంతంలో ఇంటింటా ప్రచారాలు నిర్వహించామని, కార్మికులంతా ముఖ్యమంత్రి చంద్రబాబు పక్షాన నిలిచి, ఓట్లు వేస్తామని బహిరంగంగా ప్రకటించారని, ఇది సంతోషదాయకమన్నారు. టీడీపీ కార్మిక సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని, పేదల సంక్షేమానికి కూడా చేస్తున్న కృషిని ప్రజలు గుర్తు పెట్టుకుని తెలుగుదేశం అభ్యర్థులను గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. అలాగే నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో టీఎన్‌టీయూసీ నాయకులు, కార్యకర్తలు ఆర్‌జే శేఖర్, వెంకటనాయుడు, రామారావు, అచ్చెంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



కాకినాడలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల, నేతలు

ఆకట్టుకున్న బొమ్మల కొలువు!

బొబ్బిలి: టీడీపీ జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం సంధ్భంగా ఆదివారం బొబ్బిలి మున్సిపల్ చైర్‌పర్సన్ తూముల అచ్యుతవల్లి స్వగృహంలో ఏర్పాటు చేసిన 450 వినాయక బొమ్మల కొలువు ఆకట్టుకుంది. వీటిని కేంద్ర, రాష్ట్ర మంత్రులు పూసపాటి అశోక్ గజపతిరాజు, సుజయ్ కృష్ణరంగారావులు తిలకించారు. సుమారు అర గంటసేపు బొమ్మలను చూస్తూ ఇరువురు మంత్రులు ఉండిపోయారు. బొమ్మల కొలువు ఎంతగానో అకట్టుకుందని వారు తెలిపారు. ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలు ఎక్కడ నుంచి ఎన్ని సేకరించారని చైర్‌పర్సన్ అచ్యుతవల్లిని అడిగి తెలుసుకున్నారు.

బొబ్బిలి రూరల్: వినాయక నవరాత్రుల్లో భాగంగా మెట్టవలసలో ఏర్పాటు చేసిన గణనాథుడి మండపంలో అర్చకుడు శేఖర్ శాస్త్రి ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గరిక, మారడపత్తిరితో భక్తులు పూజలు, ప్రత్యేకాభిషేకాలు చేశారు. అనంతరం అర్చక స్వామి మాట్లాడుతూ, వినాయకుని 9 రోజులు భక్తితో పూజలు చేస్తే ఎటువంటి విఘ్నాలు అయిన తొలుగుతాయని, విద్యార్థుల్లో విద్యా సామర్థ్యం పెరుగుతుందన్నారు.



మెట్టవలసలో పూజలు చేస్తున్న చిన్నారులు

చురుగ్గా పారిశుధ్య పనులు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ బొత్తాడ శంకరరావు ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి హైస్కూల్ రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన పెంట కుప్పలను ఆదివారం తొలగించారు. ఈ రహదారిపై నడిచే విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పారిశుధ్య పనులు చేపడుతున్నామని సర్పంచ్ తెలిపారు. కాలువల్లో పూడికలు తొలగింపుతో మురుగు ప్రవాహం సజావుగా సాగుతుందన్నారు.

ఘనంగా అన్నసమారాధన

పార్వతీపురం: చినబొండపల్లి, వెంకంపేట, తదితర ప్రాంతాల్లో వినాయక ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం పెద్ద ఎత్తున అన్నసమారాధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యువత పెద్ద ఎత్తున సహకారాలను అందించారు. ఈ అన్నసమారాధనకు ఆయా గ్రామాల్లో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు తదితరులు తరలివచ్చారు.



ప్రధాన రోడ్డులో ఆగి ఉన్న భారీ లారీ

భారీ వాహనాలతో ఇక్కట్లు

పార్వతీపురం టౌన్: పట్టణ రహదారిలో భారీ వాహనాల రాకపోకలు సాగించడంతో పాదచారులు, ద్విచక్ర వాహనచోదకులు ఇబ్బందులుపడుతున్నారు. ఆదివారం కూడా భారీ వాహనాలు ఇష్టారాజ్యంగా రాకపోకలు సాగించడంతో ఆ మార్గంలో వెళ్లేవారు అవస్థలుపడ్డారు. ఉదయం 8 గంటల తర్వాత ప్రధాన రహదారిలో భారీ వాహనాల తిరగకూడదని పోలీసుశాఖ నిబంధనలు విధించినా భారీ వాహనాల చోదకులు పట్టించుకోవడం లేదు. దీంతో పాదచారులు, ద్విచక్ర వాహనచోదకులు ఇక్కట్లు పడుతున్నారు. సోమవారం నుంచి శనివారం వరకు విద్యార్థులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, వ్యాపార వర్గాలు తమ తమ పనుల్లో బిజీ బిజీగా ఉంటారు. ఆదివారం ప్రశాంతంగా ప్రధాన రోడ్డులో రాకపోకలు సాగించాలనుకునే వారికి భారీ వాహనాలతో అవస్థలు తప్పడం లేదు. పోలీసుశాఖాధికారులు నిబంధనలను అతిక్రమించిన భారీ వాహనాల చోదకులపై కఠిన చర్యలు చేపట్టాలని పలు ప్రజా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

సూర్యపీఠంలో విశ్వశాంతి హోమాలు

పార్వతీపురం టౌన్: పార్వతీపుర పట్టణంలోని సూర్యపీఠంలో గణేష పంచాయతన పూజల్లో భాగంగా వేమకోటి నరహరిశాస్త్రి ఆధ్వర్యంలో విశ్వశాంతి హోమాలు ఆదివారం నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి పూజాదికాలు నిర్వహించారు. సూర్యశాంతి పారాయణాలు, విశ్వశాంతి మానవ హోమాలు జరిగాయి. ఈ సందర్భంగా శాస్త్రి మాట్లాడుతూ, మానవాళి సుభిక్షంగా ఉండేం దుకు విశ్వశాంతి హోమాలు నిర్వహించామన్నారు. మతాలకు అతీతంగా సమాక్య భావంతో దైవ కార్యాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వి.వివేకానంద, వి.తేజ, వి.ఆదిత్య, తదితరులు వైదిక సహకారాన్ని అందించారు.

గ్యాస్ సమాచారం

ఈనెల 24న బుక్ చేసుకున్న బొబ్బిలి శ్రీవెంకటేశ్వర గ్యాస్ ఏజెన్సీ పరిధిలో బొబ్బిలి రూరల్, బాడంగి, మక్కువ, తెర్లాం, సీతానగరం, రామభద్రపురం, బలిజిపేట మండలాల వినియోగదారులకు, ఈనెల 25న బుక్ చేసిన బొబ్బిలి పట్టణ వినియోగదారులకు సోమవారం గ్యాస్ సరఫరా చేస్తారు.

బొబ్బిలిలో సినిమాలు

సాయిగణపతి	- ఆనందో బ్రహ్మ
శ్రీవాసవి	- జయ జానకి నాయక
వెంకటకృష్ణ	- ఫిదా
వెంకటేష్	- అనుక్షణం
శ్రీలక్ష్మి	- నేనే రాజు నేనే మంత్రి

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు

చీపురుపల్లి: వినాయక చవిత నవరాత్రుల సందర్భంగా పట్టణంలోని విజయ కాలనీలో ఆదివారం మహిళలు కుంకుమ పూజలు చేశారు. గవిడి సురేష్ యూత్ సర్కిల్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది దంపతులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలో ఏర్పాటు చేసిన వివిధ మండపాల్లో పూజలు చేశారు.



పూజలు చేస్తున్న భక్తులు

యూనిఫామ్స్ మాటేమిటి?

● విద్యార్థులకు అందని దుస్తులు ● పట్టించుకోని అధికారులు

(మెరకముడిదాం)

విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నా.. విద్యార్థులకు యూనిఫామ్స్ దుస్తులు పంపిణీ కాలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, విద్యార్థుల ఐక్యత పెంపుతోపాటు సామానత్వాన్ని చూపేందుకు ప్రభుత్వం యూనిఫామ్స్ పంపిణీ ప్రారంభించింది. విద్యా సంవత్సరం ప్రారంభంలో పాఠశాలల వారీగా విద్యార్థులు వివరాలు, పంపిణీ చేయాల్సిన దుస్తుల వివరాలు నివేదికలు సేకరించారు. దుస్తులు సరఫరాకు టెండర్లు కూడా పిలిచారు. అయితే ఇదింతా బాగానే ఉన్నా.. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నా.. నేటికి విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేయలేదు. దుస్తులు పంపిణీలో తీవ్ర జాప్యం నెలకొనడంతో విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రకటనలకే పరిమితం అవుతుందని, దుస్తులు పంపిణీపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి, విద్యార్థులకు దుస్తులు పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.



ఈ విషయాన్ని ఎంఈవో గర్భాపు సంజీవరావు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా, మండలంలోని 1 నుంచి 8వ తరగతి చదువుతున్న 5,365 మంది విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేయాల్సి ఉందని ఉన్నతాధికారులకు నివేదించాం. దుస్తులు జిల్లా నుంచి మండల కార్యాలయానికి వచ్చిన వెంటనే పంపిణీ చేస్తామని బదులిచ్చారు.



స్వాతి దంపతులను సన్మానిస్తున్న సంఘం నాయకులు

వార్డు సభ్యురాలికి పౌరసన్మానం

చీపురుపల్లి: చీపురుపల్లి మేజర్ పంచాయతీ 9వ వార్డు సభ్యురాలు రఘుపాత్రుని స్వాతి దంపతులను శిష్టకరణ ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం విజయనగరంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భగా పలువురు మాట్లాడుతూ, శిష్టకరణ కులస్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ఓబీసీ సాధనకు కృషి చేయాలని సూచించనట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మూర్తి, ఉపాధ్యక్షులు ఆర్.శ్రీనివాసరావు, ఎల్.ప్రభాత్, సభ్యులు కుప్పిలి శ్రీనివాసరావు, ఆర్.ఆనంద పట్నాయక్, కుప్పిలి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న గుప్త

గరివిడి: పట్టణంలో కొలువుదీరిన వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం జిల్లా ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వీవీఎస్ఎస్ఎన్ గుప్త మాట్లాడుతూ, ఈ ఏడాది పేద వైశ్య విద్యార్థులకు, పీజీ చదువుతున్న వారికి రెండు లక్షల ఉపకార వేతనాలు, లక్ష రూపాయలు విలువ చేసే నోట్ పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. పది, ఇంటర్, డిగ్రీలో 85శాతం మార్కులు దాటిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తామన్నారు. విశాఖ, హైదరాబాద్, బెంగుళూర్ తదితర పట్టణాలు చదువుతున్న వారికి వసతి సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు దుర్గ, జగన్నాథరావు, సత్యారావు, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ సొసైటీ ఆర్థిక సాయం

గుర్ల: పేదలను ఆదుకోవడంలో అమ్మ సేవా సొసైటీ ముందుంటుందని జడ్పీటీసీ తిరుమలరాజు పద్మిని తెలిపారు. ఆదివారం గుర్లలో ఆమె గరివిడికి చెందిన విద్యార్థి కోనూరు పవన్‌కు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉన్నత విద్యల కోసం తనవంతు సాయంగా అమ్మ సేవా సొసైటీ ప్రతినిధి అల్లం పురుషోత్తమరావు చేస్తున్న సేవను కొనియాడారు. పేదలకు సాయం చేసే గుణంతో పాటు సామాజిక దృక్పథంతో ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలన్నారు.



విద్యార్థికి ఆర్థిక సాయం అందిస్తున్న జడ్పీటీసీ పద్మిని

అభివృద్ధిలో భాగస్వాములుకండి

చీపురుపల్లి రూరల్: మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా చిన్నయి ఆధ్యాత్మిక సంస్థ వ్యవస్థాపకుడు ఎన్.శంకరరావు ఆధ్వర్యంలో ఆదివారం రామలింగాపురం గ్రామంలో పేద వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం మదర్ థెరిస్సా జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంఈవో జమ్ము మహలక్ష్మ నాయుడు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ ఇప్పిలి వెంటకనరసమ్మ మాట్లాడుతూ, మదర్ థెరిస్సా సేవాగుణం ప్రతి ఒక్కరిలో ఉండాలని, మన కోసం ఎంత ఆలోచిస్తామో సమాజం కోసం ఆలోచించి, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంది పాపినాయుడు, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ గొర్లె గోపాలం, హెచ్ఎం కంది గోపి, ఇప్పిలి నీలకంఠం, పీఆర్‌టీయూ నాయకుడు మెండు జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు దుప్పట్లు అందిస్తున్న నేతలు



గూడెం సమీపంలో
పిల్ల కాలువలో నీటి ప్రవాహం

తోటపల్లి కాలువకు జలకళ

గుర్ల: తోటపల్లి పిల్ల కాలువ ద్వారా పెనుబర్తి గూడెం, వల్లాపురం గ్రామాల భూములకు సాగునీరు వచ్చింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నీరు వృథాగా కాకుండా ఉండేందుకు చీపురుపల్లి సెక్షన్ ఏఈ శ్రీనివాసరావు పర్యవేక్షిస్తున్నారు. ఏ గ్రామం చూసినా.. దమ్ములతో పాటు నీటితో చెరువులు కళకళలాడుతోంది.

నడక.. 40 విధాల లాభం!

● మాజీ వాకర్స్ క్లబ్ జనరల్ సెక్రటరీ చంద్రినాయుడు

బొబ్బిలి రూరల్: నడక 40 విధాల లాభమని వాకర్స్ క్లబ్ మాజీ జనరల్ సెక్రటరీ జి.చంద్రినాయుడు తెలిపారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ, ప్రతి మనిషి నేడు మరయంత్రంలో బతుకుతున్నాడని, జీవన శైలిలో అనేక మార్పులు వచ్చాయన్నారు. మనిషి జీవితంలో వ్యాయామం ఒక భాగం కావాలని, ముఖ్యంగా మదుపు లేనిది తెల్లవారుజాము న నడవడం. మనిషి జీవితంలో నడక ఒక దినచర్యగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. దీనివల్ల హార్ట్ అటాక్, బీపీ, సుగర్ వంటి వ్యాధులు క్రమబద్ధం అవుతాయని, నడక వల్ల శరీరం నుంచి అనేక రసాయనాలు విడుదలై మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. అలాగే స్థూలకాయం తగ్గుతుందని, కొలెస్ట్రాలు తగ్గించి, శారీరక దారుఢ్యం పెగుతుందని తెలిపారు. అన్ని వయసుల వారు రోజుకు కనీసం 3 నుంచి 5 కిలో మీటర్లు నడిస్తే చాలా మంచిదన్నారు. నడకతో పాటు యోగా, స్లో సైక్లింగ్ చిన్నపాటి వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు.

సూర్యపీఠంలో విశ్వశాంతి హోమాలు

పార్వతీపురం టౌన్: పార్వతీపుర పట్టణంలోని సూర్యపీఠంలో గణేష పంచాయతన పూజల్లో భాగంగా వేమకోటి నరహరిశాస్త్రి ఆధ్వర్యంలో విశ్వశాంతి హోమాలు ఆదివారం నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి పూజాదికాలు నిర్వహించారు. సూర్యశాంతి పారాయణాలు, విశ్వశాంతి మానవ హోమాలు జరిగాయి. ఈ సందర్భంగా శాస్త్రి మాట్లాడుతూ, మానవాళి సుభిక్షంగా ఉండేం దుకు విశ్వశాంతి హోమాలు నిర్వహించామన్నారు. మతాలకు అతీతంగా సమాక్య భావంతో దైవ కార్యాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వి.వివేకానంద, వి.తేజ, వి.ఆదిత్య, తదితరులు వైదిక సహకారాన్ని అందించారు.

నేడు ఐటీడీఏలో కలెక్టర్ గ్రీవెన్స్ సెల్

పార్వతీపురం: పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయంలో కలెక్టర్ వివేక్ యాదవ్ సోమవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించనున్నారు. ముందుగా డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం చేపట్టి అనంతరం గ్రీవెన్స్ నిర్వహిస్తారు. కలెక్టర్‌తో పాటు ఐటీడీఏ పీవో డాక్టర్ లక్ష్మీశ, తదితరులు హాజరుకానున్నారు.

ఇదిలా ఉండగా, కలెక్టర్ వివేక్ యాదవ్ మీ కోసం కార్యక్రమం ద్వారా నిర్వ హిస్తున్న గ్రీవెన్స్ సెల్‌లో వివిధ సమస్యలపై ప్రజలు అందిస్తున్న వినతులను పరిష్కరించడంలో అధికార యంత్రాంగం తూతూ మంత్రంగా వ్యవహరిస్తోందని ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. సమస్యలపై వినతులను అందిస్తున్నప్పటికీ అవి పూర్తిస్థాయిలో పరిష్కారానికి నోచుకోవడం లేదని పలువురు అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో తాగునీరు, సాగునీరు తదితర సమస్యలపై వినతులు అందిస్తున్న ప్పటికీ పరిష్కారం కావడం లేదన్నది గిరిజన ప్రాంతాల ప్రజల ఆవేదన. ఇప్పటికైనా కలెక్టర్ తీసుకుంటున్న వినతులను పరిశీలించి, పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని అర్జీదారులు కోరుతున్నారు.

మొక్కలు నాటేందుకు సర్వం సిద్ధం

పార్వతీపురం టౌన్: కొత్తవలస సత్యనారాయణ స్వామి ఆలయం పక్కన కేంద్ర మంత్రి అశోక్ గజపతి రాజు, రాష్ట్ర మంత్రి సుజయ్ కృష్ణరంగారావు వనం-మనం కార్యక్రమంలో భాగంగా సోమవారం మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర గ్రామ సమీపంలోని ఉద్యనవన వర్సిటీ క్యాంపస్‌లో మంత్రులు మొక్కలు నాటుతారని మున్సిపల్ ఏఈ ఆనంద్‌కుమార్ తెలిపారు.



స్థలాన్ని చదును చేస్తున్న సిబ్బంది

చీపురుపల్లిలో సినిమాలు

అనురాగ్	- జయ జానకీ నాయక
అమోగ్	- నేనే రాజు నేనే మంత్రి
వంశీ	- వీఐపీ - 2
విష్ణు	- వివేకం
నటరాజ్	- ప్రతి క్షణం

సీపీఎం నేత కుప్పా నాయుడుకి నివాళి

సాలూరు: సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు కుప్పానాయుడు వర్ధంతి సందర్భంగా ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం డివిజన్ కార్యదర్శి జి.శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయ కూలీల సంక్షేమానికి కుప్పానాయుడు అలుపెరగని పోరాటం చేశారన్నారు. భూ పోరాటాలు సాగించి సుమారు వెయ్యి ఎకరాల వరకు రైతులకు అందేలా కృషి చేశారన్నారు. కోరాడ ఈశ్వరరావు, మర్రి శ్రీను, లక్ష్మి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

మెంటాడలో భారీ వర్షం

● లోతట్టు ప్రాంతాలు జలమయం ● ఇళ్లలోకి చేరిన నీరు ● కస్తూర్బా పాఠశాల విద్యార్థుల అవస్థలు



కస్తూర్బా పాఠశాలను ముంచెత్తిన వరదనీరు

మెంటాడ: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం భారీవర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్లలోకి నీరు చేరింది. పలువురు అవస్థలు పడ్డారు. ఇళ్లలోని నీటిని బయటకు తోడుకున్నారు. కస్తూర్బా పాఠశాల ఆవరణ వర్షపునీటితో నిండుకుంది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది ఎదుర్కొన్నారు. కనీసం మూత్ర విసర్జనకు వెళ్లేందుకు వీలుగాలేక సమస్య ఎదుర్కొంటున్నారు.



ఇళ్లలోకి చేరిన నీటిని తోడుతున్న దృశ్యం

వనితా కార్డులు సద్వినియోగం చేసుకోండి

దత్తిరాజేరు: ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు టికెట్‌పై పదిశాతం రాయితీపై అందిస్తున్న వనిత ఫ్యామిలీ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని ఏడీసీ ఎ.సి.హెచ్. నాయుడు తెలిపారు. ఆదివారం పెదమానాపురంలో ఆర్టీసీ రాయితీపై అందించే పథకాల పైఅవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన తెల్లరేషన్ కార్డుదారుల కుటుంబాలకు ఈ వనిత ఫ్యామిలీ కార్డును రూ.100కే అందిస్తున్నట్లు చెప్పారు. కార్డులోని సభ్యులు రెండేళ్లపాటు రాయితీపై ప్రయాణించడంతోపాటు రూ. లక్ష ప్రమాదబీమా అమలులో ఉంటుందన్నారు. అనంతరం పలువురికి కార్డులు అందజేశారు. సిబ్బంది సూర్యనారాయణ పాల్గొన్నారు.



రాయితీపై వనిత ఫ్యామిలీకార్డులు అందజేస్తున్న అధికారి

ఈ గోతులు పూడ్చరూ?

దత్తిరాజేరు: పెదమానాపురం రైల్వే గేట్ వద్ద జాతీయ రహదారి గోతులమయమైం ది. ఇటీవల కురిసిన వర్షాలకు మరీ అధ్వానంగా మారి వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి గోతులను పూడ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



మానాపురం వద్ద గోతులు

చచ్చినా.. చావే!

● మృత దేహంతో పట్టాలపైనుంచి అరకిలో మీటరు దూరం మోత ● రైలు వస్తుందేమోనని భయం ● పురిటిపెంటలో శ్మశానానికి రోడ్డు లేక పాట్లు



మృతదేహాన్ని రైలు పట్టాలపై మోసుకెళ్తున్న కుటుంబ సభ్యులు

గజపతినగరం రూరల్: ఎవరైనా కష్టాల్లో ఉన్నప్పుడు చస్తేనే సుఖం ఉంటుందని బాధపడుతుంటారు. కానీ, ప్రాణం పోయిన తరువాత కూడా సౌఖ్యంలేని దురవస్థ ఎదురైతే ఎలా ఉంటుంది. మండలంలోని పురిటిపెంటకు వెళ్తే ఆ కష్టం ఎలా ఉంటుందో అనుభవంలోకి వస్తోంది. మృతదేహాన్ని సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలకు చేద్దామన్నా వీలుకాని స్థితి గ్రామంలో నెలకొంది. శ్మశానానికి రహదారి లేకపోవడంతో మృతదేహాన్ని రైలు పట్టాలపై నుంచి నడుచుకుని వెళ్లాల్సి వస్తోంది. వివరాలివి.. పురిటిపెంట రైల్వే కాలనీకి చెందిన తాండంగి చిన్నమ్మి అనే 80 ఏళ్ల వృద్ధురాలు శనివారం అర్ధరాత్రి మృతి చెందింది. అయితే ఆమె మృతదేహానికి ఆదివారం దహన సంస్కారం నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు, కాలనీవాసులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకువెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో రైలు పట్టాలపైనుంచి తీసుకువెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. సుమారు అర కిలో మీటరు దూరం పాడితోపాటు మృతదేహాన్ని ఆమె కుటుంబ సభ్యులు, బంధువుల మోసుకు తీసుకువెళ్లేందుకు అష్టకష్టాలు ఎదుర్కొన్నారు. ఆ సమయంలో ఎటువైపునుంచి ఏ రైలు వస్తుందోనని భ యాందోళనతో బిక్కుబిక్కుమన్నారు. పంచాయితీ పాలకులు, అధికారులు శ్మశాన వాటికల అభివృద్ధికి చర్యలు తీసుకోక పోవడంతో ఈదుస్థితి నెలకొందని కాలనీవవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో పలు గ్రామాల్లో శ్మశానాల అభివృద్ధికి లక్షలాది రూపాయలు ఉపాధి నిధులు వెచ్చిస్తున్నారు. అయితే, ఆ నిర్మాణాలు అరకొరగా చేపట్టి వదిలేస్తున్నారు. మృతదేహల ఖననం, దహన సంస్కారాలకు వీలులేక ఆయా కుటుంబాలు సమస్యలు ఎదుర్కొంటున్నాయి. కుటుంబంలో సభ్యులు చనిపోయిన బాధతోపాటు అంత్యక్రియలకు చేసేందుకు మరింత కష్టం అనుభించాల్సిన దయనీయస్థితిని ఎదుర్కొంటున్నారు.

చెరువును తలపిస్తున్న ఆర్టీసీ కాంప్లెక్స్

● జాతీయరహదారిపై ప్రవహిస్తున్న వర్షపునీరు ● రాక పోకలకు ప్రయాణికుల ఇబ్బంది

గజపతినగరం రూరల్: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల కేంద్రంలోని కాంప్లెక్స్ చెరువును తలపిస్తోంది. దీంతో కాంప్లెక్స్ ఆవరణలోకి బస్సులు రాక పోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఏటా వర్షాకాలంలో పదేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడం శోచనీయం. ప్రతి రోజూ సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు నిత్యం వందలాది మంది ప్రయాణికులు ఈ కాంప్లెక్స్‌కు వచ్చి బస్సులను ఆశ్రయిస్తుంటారు. దత్తిరాజేరు, గజపతి నగరంతోపాటు మెంటాడ మండలాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు ఇక్కడినుంచి రాక పోకలు సాగిస్తుంటారు. వారికి పూర్తి స్థాయి సదుపాయాలు కల్పించడంలో ఆర్టీసీ అధికారులు విఫలమవుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులైనా చర్యలు తీసుకోకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏడాది ఒకసారి ఆర్టీసీ అధికారులు వచ్చి హామీలిచ్చి వెళ్లిపోవడమే తప్పా ఆచరణకు నోచుకోవడంలేదని ప్రయాణికులు అంటున్నారు. కాంప్లెక్స్‌తోపాటు స్థానిక జాతీయ రహదారిపైనా వర్షపునీరు ప్రవహించడంతో ప్రయాణికులకు నిలువునీడ కూడా లేకపోయింది. ఎప్పుడు ఏప్రమాదం సంభవిస్తోందనని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.



జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వర్షపునీరు... నీటి మడుగు మధ్య ఆర్టీసీ కాంప్లెక్స్

నాడెప్‌ల్లో ఇవేమిటబ్బా?

● సేంద్రియ ఎరువు తయారీ బదులు పూలు , కూరగాయల మొక్కల పెంపకం ●రూ. లక్షలాది ప్రజాధనం వృథా

గంట్యాడ: పశువులు పేడ, చెత్తచెదారం ఎక్కడపడితేఅక్కడ వేయకుండా ఒకేచోట నిల్వచేసి ఎరువుగా మార్చాలనే సదుద్దేశంతో ప్రభుత్వం నాడెప్‌ల నిర్మాణాన్ని ప్రోత్సహించింది. నాడెప్‌ల్లో వ్యర్థాలు కుళ్లిన తర్వాత పొలాలకు వినియోగిస్తే పంటలు మంచి దిగుబడి వస్తాయి. సారవంతమైన ఈ సేంద్రియ ఎరువుతో రైతులకు రసాయనిక ఎరువుల కొనుగోలు భారం తగ్గుతోంది. ఈ నేపథ్యంలో ప్రతి గ్రామంలో నాడెప్‌లు ఏడాది కిందట నిర్మించారు. వినియోగంపై రైతులకు అవగాహన కల్పించలేదు. చివరికి ఎందుకు వీటిని నిర్మించారన్న విషయం కూడా తెలియనిపరిస్థితిలో రైతులు ఉన్నారు. మండలంలోని సుమారు పది వేల నాడెప్ నిర్మించినట్లు అధికార లెక్కలు చెబుతున్నాయి. ఒక్కొక్క నాడెప్‌ను రూ.9 వేల ఖర్చు చేశారు. తర్వాత వినియోగంపై అవగాహన లేకపోవడంతో వృథాగా ఉన్నాయి. కొందరు వీటిపక్కనే పశువుల పెంట, చెత్తచెదారం వేసుకుంటున్నారు. మరికొంతమంది అయితే నాడెప్‌ల్లో కూరగాయలు, పూల, పండ్ల మొక్కలు వేసుకోవడానికి వినియోగిస్తున్నారు. వీటిని పెంచడానికి ఇంత ఖర్చుచేసిన నాడెప్‌లే అవసరంలేదు. ఇలా ఆశించిన లక్ష్యం దుర్వినియోగం చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇకనైనా అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకుని రావల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకుంటే జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.10 కోట్ల విలువతో నిర్మించిన నాడెప్‌లు వృథా కానున్నాయి.



నాడెప్‌ల్లో కూరగాయలు పెంచుతున్న దృశ్యం, వృథా వదిలేసిన నాడెప్..

సూర్యపీఠంలో విశ్వ శాంతి హోమాలు

పార్వతీపురం టౌన్ : స్థానిక సూర్యపీఠంలో గణేష పంచాయతన పూజల్లో భాగంగా వేమకోటి నరహరిశాస్త్రి ఆధ్వర్యంలో విశ్వశాంతి హోమాలు ఆదివారం నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి పూజాదికాలు నిర్వహించారు. సూర్య శాంతి పారాయణాలు, విశ్వశాంతి మానవ హోమాలు జరిగాయి. ఈ సందర్భంగా శాస్త్రి మాట్లాడుతూ మానవాళి సుభిక్షంగా ఉండేందుకు విశ్వశాంతి హోమాలు నిర్వహించామన్నారు. మతాలకు అతీతంగా సమాక్య భావంతో దైవ కార్యాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వి.వివేకానంద, వి.తేజ, వి.ఆదిత్య, వైదిక సహకారాన్ని అందించారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోండి


శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

నెల్లిమర్ల: గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థలు, ఆసుపత్రి యజమాన్యాలు ఏ ర్పాటు చేస్తున్న ఉచిత వై ద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జ డ్పీటీసీ సభ్యుడు గదల స న్యాసినాయుడు కోరారు. కొండవెలగాడలో ఆదివా రం ఏర్పాటు చేసిన ఉచి త నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏ ర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు పౌష్టికాహారం కొరతతో నేత్ర సమస్యలు వస్తాయన్నారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ సమన్వయకర్త ఎం.అరుణ్‌కుమార్ మాట్లాడుతూ శిబిరంలో 120 మందికి పరీక్షలు జరిపి 33 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశామన్నారు. సర్పంచ్ గదల బంగారమ్మ, వైద్యులు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్ మృతి



భోగాపురం: భోగాపురం పంచాయతీ ఉపసర్పంచ్ సుందరపేటకి చెందిన గుండాల మన్మధరావు(45) అనారోగ్యంతో మృతి చెందారు. పంచాయతీ 14వ వార్డు మెంబరుగా, ఉపసర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అనారోగ్యంతో హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, సుందరపేట గ్రామం విచారంలో మునిగి పోయింది. స్థానిక నేతలు కందుల రఘుబాబు, కాకార్లపూడి శ్రీనివాసరావు, కొమ్మూరు సుభోషనరావు, ఆ యన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

ఘనంగా రంగవల్లుల పోటీలు

కొత్తకొప్పెర్ల(పూసపాటిరేగ): మండలం లోని కొత్తకొప్పెర్ల గ్రా మంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రు ల్లో భాగంగా ఆదివారం రంగవల్లుల పోటీలను నిర్వహించారు. సు మారు 30 మంది మహిళలు పోటీల్లో పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అంగన్‌వాడీ కార్యకర్తలు వ్యవహరించారు. ఇందులో ప్రథమ బహుమతి పొందిన బొజ్జ యశోదతోపాటు, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులను అందించారు.


మహిళలు వేసిన ముగ్గులు, ప్రథమ బహుమతి అందిస్తున్న దృశ్యం

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నేడు కర్రోతు ప్రమాణం



భోగాపురం: పూసపాటిరేగ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పోలిపల్లి సర్పంచ్ కర్రోతు సత్యనారాయణ సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి జాతీయ రహదారి సమీపంలోని ఏఎంసీ గోదాము వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రమాణ స్వీకారానికిటీడీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, ప్రజలు భారీగా తరలి రానుండటంతో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు.


ప్రమాణ స్వీకారానికి చేసిన ఏర్పాట్లు

ఎస్.కోటలో ఆర్టీసీ పార్సిల్ సర్వీస్

శృంగవరపుకోట : ఎస్.కోట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పార్సిల్ స ర్వీస్‌ను ఆదివారం డిపో మేనేజర్ మల్లిఖార్జునరాజు ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడికైనా 24గంటల్లో పార్సిల్ చేరుస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు బీఆర్ నాయుడు, కోటి పాల్గొన్నారు.

రాయితీలను వినియోగించుకోండి

లక్కవరపుకోట : ఆర్టీసీ రాయితీలను ప్రజలు విని యోగించుకొని సంస్థ అభివృద్ధికి సహకరించాలని యూ నియన్ ప్రతినిధులు ఆతవ శ్రీను, యుగంధర్ కోరారు. ఆదివారం వారు ఎల్.కోటలో 50 మందికి వనితా కార్డు లనందజేశారు. ఈ కార్డుతో బీమా, టిక్కెట్‌లో రాయితీ ల భిస్తుందనిచెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు 2484 దరఖాస్తులు

కొత్తవలస: ఇళ్ల స్థలాలకు 2484 దరఖాస్తులు వచ్చాయని తహ సీల్దార్ కె.శ్రీనివాసరావు తెలిపారు. వీటిని పరిశీలించి, అర్హులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామన్నారు. ఇందుకు వీఆర్వోలతో త్వరలో సర్వే చేయిస్తామని చెప్పారు.

3న విద్యా గణపతి పూజ

కొత్తవలస: తుమ్మికాపల్లి రైల్వేగేట్ సమీపంలో సెప్టెంబరు 3న విద్యా గణపతి పూజ నిర్వహిస్తున్నామని మెగా యూత్ అసోసియేష న్ సభ్యులు తెలిపారు. ఇందులో విద్యార్థులు పాల్గొనాలని వారు కోరా రు. 6న దీపారాధన, 8న కుంకుమార్చన జరుపుతామన్నారు. 10న సాయంత్రం 5 గంటలకు జిల్లాస్థాయి క్విజ్ పోటీలను నిర్వహిస్తున్న ట్టు చెప్పారు. 14న లక్కీ డ్రా నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేస్తామని తెలిపారు.

'అండర్ బ్రిడ్జి కోసం మళ్లీ ఉద్యమిస్తాం'

కొత్తవలస : కొత్తవలస జంక్షన్‌లోని రైల్వేగేట్‌పై అండర్‌బ్రిడ్జి విష యమై మళ్లీ ఉద్యమిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్య క్షుడు గాడి అప్పారావు, సీపీఎం డివిజన్ కార్యదర్శి దేగల అప్పలరాజు తెలిపారు. ఆదివారం వారు విలేఖరులతో మాట్లాడారు. రైల్వే శాఖ ఇ చ్చిన మాట నిలబెట్టుకోలేదన్నారు. రైల్వే శాఖ ఎందుకు జాప్యం చే స్తోందో తెలియజేయాలని కోరారు. ఈసారి ఉద్యమం ఉధృతంగా ని ర్వహిస్తామని స్పష్టం చేశారు.

అసంపూర్తి పెంటగోతుల బిల్లుల నిలుపుదల

కొత్తవలస : సక్రమంగా పూర్తిచేయని పెంట గోతులకు బిల్లులు మంజూరు చేయడం లేదని ఎంపీడీవో నారాయణరావు తెలిపారు. ఈ నిర్మాణాలపై కొన్ని గ్రామాల్లో ఫిర్యాదులు రావడంతో క్షేత్ర స్థాయి లో పరిశీలించామన్నారు. సక్రమంగా లేనివాటి బిల్లులు నిలుపుదల చేశామని చెప్పారు. మరుగుదొడ్లు లేనివారు వెంటనే కట్టుకోవాలని సూచించారు. వీటికి బిల్లులు వెంటనే మంజూరు చేస్తామన్నారు.

87 శాతం మందికి ఎంఆర్ టీకా

వేపాడ : వేపాడ పీహెచ్‌సీ పరిధిలో ఎంఆర్ టీకా 87శాతం మేర వేశామని సీహెచ్‌వో రమేష్‌బాబు తెలిపారు. ఆదివారం ఆయన విలే ఖరులతో మాట్లాడారు. 7,534 మంది చిన్నారులకు వేయాల్సి ఉండ గా, ఇప్పటివరకు 6,010 మందికి వేశామని చెప్పారు. మిగిలిన చిన్నా రులకు 1 నుంచి 8 వరకు వేస్తామన్నారు. బొద్దాం పీహెచ్‌సీ పరిధి లో లక్ష్యసాధనకు కృషి చేస్తున్నట్టు వైద్యాధికారులు తెలిపారు.

26న భీమసింగి రైతుల మహాజన సభ

జామి: భీమసింగి సహకార చక్కెర కర్మాగారం రైతుల మహాజన సభ వచ్చేనెల 26న కర్మాగార ఆవరణలో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎమ్‌డీ డి.నారాయణరావు తెలిపారు. ఈ మేరకు పరిశ్రమ పర్సన్ ఇన్‌చార్జ్, కలెక్టర్ వివేక్‌యాదవ్ ఆమోదం తెలిపారని చెప్పారు. ఆ సభకు రైతులు హాజరుకావాలని కోరారు.

ఐకమత్యాన్ని మర్చిపోవద్దు

జిల్లా స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

పార్వతీపురం టౌన్ : సంఘ సభ్యులు ఐకమత్యమే సగం బల మ ని మర్చిపోవద్దని జిల్లా స్వర్ణకార సంఘ జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు జానా ప్రసాదరావు, పెదగాడి ప్రసాదరావు పేర్కొన్నారు. పార్వతీదేవి ఆలయంలో పట్టణ స్వర్ణకార సంఘ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘ కార్పొరేషన్ డైరెక్టర్ ముగడ సత్యనారాయణ సన్మానసభకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన ప్రాంతం నుంచి రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ సంఘ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సత్యనారా యణ ఎంపిక వ్వడం మన అదృష్టమని తెలిపారు. అనంతరం గుర్తింపు కార్డులను స్వర్ణకార సంఘ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ స్వర్ణకార సంఘ అధ్యక్ష, కార్యద ర్శులు బూరగాన రంగారావు, మార్పి సూర్యారావు, కోశాధికారి కె.సూర్య భగవాన్, ఉపాధ్యక్షుడు, పట్నాల కోటేశ్వరరావు, ఉపకార్యదర్శి పట్నాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణను సన్మానిస్తున్న స్వర్ణకార సంఘ సభ్యులు

పిడుగుపాటు మృతుల కుటుంబాలను

ఆదుకోండి

- ప్రభుత్వానికి ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాంబాబు విజ్ఞప్తి
- బాధితులకు పరామర్శ

లక్కవరపుకోట : పిడుగుల బారిన పడి మృతి చెంది న వారి కుటుంబా లకు ప్రభుత్వం రూ.10 లక్షల నష్ట పరి హారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రాంబాబు అన్నారు. ఆదివారం ఆయన ఖాసాపేట, కూర్మ వరం గ్రామాల్లో పిడుగు పడి మృతిచెందిన వారి కుటుంబాలను పరా మర్శించారు. ఈసందర్భంగా రాంబా బు మాట్లా డుతూ రెవెన్యూ శాఖ గ్రామాల్లో దండోరా వేస్తే రైతులు సురక్షిత ప్రదేశా లకు వెళ్లే అవకాశం ఉందన్నారు. ప్ర స్తుతం జిల్లాలో కరువు పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఆయన వెంట సీఐటీయూ నేతలు గాడిఅప్పారా వు, తరణి, వెంకటరమణ తదితరులు ఉన్నారు.



ఖాసాపేటలో పిడుగు బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాంబాబు

ప్రజలు బెంబేలు..

లక్కవరపుకోట : ఎల్.కోట మండ లంలో ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు భారీ వర్షంతో పాటు పి డుగులు పడడంతో ప్రజలు బెంబేలెత్తా రు. పిడుగుపాటుతో ఖాసాపేటలో ము గ్గురు, కూర్మవరంలో ఒకరు ఇటీవల చనిపోయిన విషయంతెలిసిందే. దీంతో ఎక్కడ పిడుగు శబ్దం వినపడినా అం దరూ హడలిపోతున్నారు. ఆదివారం చుట్టుపక్కల గ్రామాల్లో 20వరకు పి డుగులు పడడంతో ఎక్కడ ఏ ప్రమా దం జరిగిందోనని కలవరపాటుకు గు రయ్యారు. ఎక్కడలేని విధంగా ఖాసా పేట పరిధిలో పిడుగులు ఎందుకు ప డుతున్నాయోనని ప్రజలు భయాందోళ న చెందుతున్నారు.

అప్రమత్తంగా ఉండండి

శృంగవరపుకోట : పిడుగులపై ప్ర తిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎం.అరుణకుమారి కోరా రు. ఆదివారం ఆమె మాట్లాడుతూ వా తావరణంలో మార్పులు కనిపించిన వెంటనే రైతులు తమ పొలాల నుంచి సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని సూచించారు. వర్షం పడే సమయంలో బయట తిరగకుండా ఉండాలని కోరా రు. రెవెన్యూ శాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని ప్రతిఒక్కరూ మధ్యాహ్నం లోపు తమ పనులు ముగించుకుని ఇంటికి చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు.



మొక్కలు నాటుతున్న దృశ్యం

మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి

వేపాడ : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణా న్ని కాపాడాలని వెలుగు ఏపీఎం ఎ.వెంకటరమణ అన్నా రు. ఆదివారం ఆయన ఆనందపురం రహదారి నుంచి చినగుడిపాల వరకు గల రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏపీ ఎం మాట్లాడుతూ ఈ మొక్కలు సంరక్షించాలని సూచించారు. కా ర్యక్రమంలో గ్రామ పెద్ద జగ్గబాబు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.



బొడ్డవరలో వరాహంపై వినాయకుని స్వారీ

వివేకానంద కళాశాలలో యువ శిక్షణ

శృంగవరపుకోట : ఎస్.కోట వివేకానంద విద్యా సంస్థ ల్లో యువ శిక్షణ తరగతులను ఆదివారం నిర్వహించారు. తొలుత ఆ సంస్థల అధినేత సీహెచ్‌ఆర్‌కే ప్రసాద్ మ హామండలి జెండాను ఎగురవేయగా, విద్యార్థులు ప్రార్థన గీతం, స్వదేశీ మంత్రాన్ని ఆలపించారు. విద్యాసంస్థల ఆవరణలోని వివేకానందా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహామండలి అధ్యక్షుడు మునిస్వామి ఏకాగ్రతపై విద్యార్థులకు అవగాహన క ల్పించారు. ఇతర వక్తలు పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో పి.వెంకటరత్నం, ఎన్.లక్ష్మీనారాయణ, రా మకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వివేకానంద కళాశాలలో మహామండలి జెండా ఎగురవేస్తున్న అధినేత ప్రసాద్

ఆకట్టుకుంటున్న గణనాథులు

- మండపాల వద్ద చిన్నారుల సందడి

శృంగవరపుకోట రూరల్ : బొడ్డవర, రాజుల కళ్లాలు జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలు ఆకట్టుకున్నాయి. బొ డ్డవరలో వరాహంపై వినాయకుని స్వారీ గ్రామీణులను అలరిస్తోంది. రాజులకళ్లాలు వద్ద గల సంపత్ వినాయక ఆలయంలో ఏర్పాటుచేసిన విగ్రహం వినూత్నంగా ఉంది. ఈ మండపాల వద్ద ఆదివారం చి న్నారులు పెద్ద ఎత్తున సందడి చేశారు.

అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టే..



అమ్మవారి పూజల్లో పాల్గొన్న వెంకట అప్పారావు

పార్వతీపురం టౌన్ : అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్న ట్టేనని యజ్ఞవైభవ ప్రసంగీకులు సిరిగుడి వెంకట అప్పా రావు అన్నారు. దుర్గగుడివీధి శ్రీసర్వమంగళాదేవి పీఠంలో జరుగుతున్న హోమ సహస్ర చండీ యాగానికి ఆయన ఆదివారం విచ్చేశారు. ఈ సందర్భంగా శ్రీసర్వమంగళాదేవి పీఠాధిపతి, యజ్ఞకర్త మలిచేటి రాజీవ్‌రెడ్డి కుటుంబ సభ్యు లు వెంకట అప్పారావుకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. సాలూరు కామాక్షిదేవి పీఠం వ్యవస్థాపకులు ముద్దు స త్యనారాయణ, హోమ సహస్ర యాగానికి విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి విశిష్టతను తెలియజేసారు.

రేస్ ఫౌండేషన్ ఆవిష్కరణ

హోమ సహస్ర చండీయాగం యజ్ఞకర్త మలిచేటి రాజీ వ్‌రెడ్డి శ్రీసర్వమంగళా దేవి ఆలయ ఆవరణలో రేస్ ఫౌండేషన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామా జిక సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు రేస్ ఫౌండే షన్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. ఆలయంలో మధ్యా హ్నం మూడు గంటల నుంచి రాయగడ జిల్లా జేకేపూ ర్‌కు చెందిన 50 మంది మహిళలు భగవద్గీత పారాయ ణం చేశారు.

సినిమాలు

శృంగవరపుకోట

శ్రీశ్రీనివాస----------------వివేగం
శ్రీవెంకటేశ్వర -----జయజానకినాయక

కొత్తవలస

శ్రీజయ--------నేనే రాజు..నేనే మంత్రి
శ్రీరాజా-----------------------లై
శ్రీలక్ష్మీనరసింహా---జయజానకినాయక

జామి

జ్యోతి----------------ఆనందోబ్రహ్మ

పగటి వేళ విద్యుత్ వెలుగులు

పాచిపెంట: మండల కేంద్రంలో పట్టపగలు విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. విద్యుత్ ఆదా కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతున్నా స్థానిక పంచాయతీలో మాత్రం విద్యుత్ వృధా అవుతోంది. ప్ర తి స్తంభం వద్ద పగలు బల్బులు వెలుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కంట్రోల్ స్విచ్‌లు అమర్చక ఈ దుస్థితి నెలకొంది.



పాచిపెంట చినబజారు వద్ద వెలుగుతున్న విద్యుత్ బల్బు

శంబర రోడ్లకు మోక్షం ఎప్పుడు?

●అధ్వాన రహదారులతో అవస్థలు ● ఏటా జాతర సమయంలో మొక్కుబడి మరమ్మతులు



వర్షపు నీటితో నిండిన రహదారి

శంబర (సాలూరు రూరల్): చెరువులను తలపిస్తున్న ఈ రహదారులతో శంబరవాసులు నరకాన్ని చవిచూస్తున్నారు. ఇటు మామిడిపల్లి వెళ్లినా, అటు మక్కువ వైపునకు పయనించినా రహదారి కష్టాలు తప్పని పరిస్థితి. శంబర జాతర ముందు పాలకులు, అధికారులు ఈ రహదారులను పట్టించుకుంటున్నారు. తర్వాత నిర్లక్ష్యం వహించడం ఆనవాయితీగా మారింది. ఈ రహదారులకు ఏటా కాంట్రాక్టర్లకు కల్పతరువులా మారాయి. అధికారులు శంబర జాతర ముందే లక్షలాది రూపాయలను మంజూరు చేస్తారు. అప్పటికప్పుడు రోడ్డును జాతరలో రాకపోకలకు అనుగుణంగా తాత్కాలిక పనులు చేపడతారు. మట్టిని పోసి మరమ్మతు చేపడుతుంటారు. భక్తులకు పుణ్యం మాటెలా ఉన్నా దుమ్ము, ధుళిని మోసుకెళ్లడం అలవాటుగా మారింది. ప్రస్తుతం మామిడిపల్లి నుంచి, మక్కువ నుంచి శంబరకు చేరుకోవడానికి వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. రహదారులతో గోతులతో నిండి ఉన్నాయి. బురదమయమై వాహనాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారాయి. వర్షాలు పడుతుండడంతో ఈ రోడ్లపై మక్కువ, ఇటు సాలూరు వెళ్లడానికి శంబరవాసులు భీతిల్లుతున్నారు. జాతర వచ్చే జనవరి మూడో వారంలో జరగనున్నది.

ఈ నేపథ్యంలో ఈ రెండు రోడ్లకు నిధులు మంజూరు చేసి పక్కాగా నిర్మించాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి జాతరకు వచ్చే లక్షలాది భక్తులకు, శంబరవాసుల కు ప్రయోజనం చేకూరేలా ఇప్పటి నుంచే రోడ్ల పునర్నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇందుకు ప్రజాప్రతినిధులు, అధికారపార్టీనేతలు శ్రద్ధ వహించాలని అభ్యర్థిస్తున్నారు.

ముందుగానే రోడ్లు వేయండి



జాతర రోజుల్లో కాకుండా శంబర రోడ్ల బాగుకు ఇప్పటి నుంచే శ్రద్ధ చూపాలి. అప్పటికప్పుడు మరమ్మతులతో ప్రయోజనం లేకుండా పోతున్నది. శంబరకు ఇరువైపుల బీటీరోడ్లు వేయడానికి తక్షణమే నిధులు మంజూరు చేయాలి. నాణ్యత రోడ్లు నిర్మిస్తే లక్షలాది మంది భక్తులకు, స్థానికులకు మేలు చేకూరుతోంది.

– తీళ్ల పోలినాయుడు, శంబర దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు, పీహెచ్‌సీ చైర్మన్

ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై అవగాహన



హెచ్‌ఎంఎస్ యాప్‌ను మెడికల్ షాపు వ్యాపారి

సాలూరు: లాక్‌డ్ హౌస్ మానటరింగ్ సిస్టం యాప్‌పై సాలూరు సీఐ జి.సంజీవ రావు ఆధ్వర్యంలో ప్రజలకు ఆదివారం అవగాహన కల్పించారు. సర్కిల్ పరిధిలోని నాలుగు పోలీసుస్టేషన్లకు సంబంధించిన సిబ్బంది పది టీంలుగా ఏర్పాటయ్యారు. పట్టణ, పరిసర ప్రాంతాల్లో పోలీసులు ప్రజలకు లాక్‌డ్ హౌస్ మానటరింగ్ సిస్టంపై అవగాహన కల్పించారు. ఆండ్రాయిడ్ మొబైల్‌లో పోలీసులు ఏర్పాటు చేసిన ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను డౌన్ లోడ్ చేసిఎలా ఉపయోగించాలో వివరించారు. ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అలా చేస్తే ఆయా గృహాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా వేస్తామని తెలిపారు.

అందరికీ గృహయోగమే టీడీపీ ధ్యేయం



ఇళ్ల మంజూరు పత్రాలందిస్తున్న జన్మభూమి కమిటీ సభ్యుడు తిరుపతిరావు

మక్కువ (సాలూరు రూరల్): పేదలందరికీ గృహయోగం కల్పించడమే సీఎం చంద్రబాబు నాయుడు ప్రధాన ఆశయమని మక్కువ జన్మభూమి కమిటీ సభ్యుడు పెంట తిరుపతిరావు అన్నారు. ఆదివారం ఆయన మక్కువలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఇళ్ల మంజూరు లబ్ధిదారులకు ఆయన పత్రాలందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలానికి ఐఏవై కింద 209 ఇళ్లు మంజూరైతే, వీటిలో మండలకేంద్రానికి ఎక్కువ ప్రాధాన్యం కల్పించారని చెప్పారు. మక్కువలో 62 మందికి ఈ ఇళ్లు కేటాయించారన్నారు. ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో మం డలానికి 250 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. గతంలో పూర్తికాని ఇళ్లను పూర్తికి సహకారమందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామారావు, ఇతర అధికారులు, శంబర పీహెచ్‌సీ చైర్మన్ తీళ్ల పోలినాయుడు, రమేష్ పాల్గొన్నారు.

శతశాతం మరుగుదొడ్లు నిర్మించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రామారావు

మక్కువ (సాలూరు రూరల్): ఓడీఎఫ్ పంచాయతీల్లో శత శాతం మరుగుదొడ్లు నిర్మించాలని మక్కువ ఎంపీడీవో ఎన్. రామారావు అన్నారు. ఆదివారం మరుగుదొడ్ల నిర్మాణాలపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. గుర్తించిన పంచాయతీల్లో అక్టోబర్ 2వ తేదీనాటికి నిర్మాణాలు పూర్తికా వాలన్నారు. పంచాయతీల వారీగా వివరాలు తెలుసుకున్నారు. నాణ్యత మరుగుదొడ్లు ఉండాలన్నారు. ఉపాధి, వెలుగు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మిలియన్ మార్చ్‌ను జయప్రదం చేయండి

పాచిపెంట: సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా వచ్చే నెల 1న విజయవాడలో పెద్ద ఎత్తున మిలియన్ మార్చ్ నిర్వహించనున్నట్లు యుటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు కె.ఆనంద్ తెలిపారు. ఈమార్చ్‌కు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని యుటీఎఫ్ జనరల్ సెక్రటరీ పసుపర్తి నాగేశ్వరరావు, తదితరులు కోరారు. పాత పింఛన్ విధానాన్ని పునరుద్దరించాలని కోరారు.

గిరిజన గ్రామాల్లో సందడిగా గణేశ్ ఉత్సవాలు

సాలూరు రూరల్: మండలంలో గిరిజన గ్రామాల్లో ఈ ఏడాది గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆకర్షణీయమైన మండపాలను నిర్మించి గణనాథుని ప్రతిష్ఠించారు. మూడు రోజులుగా నిత్యపూజలు చేస్తున్నారు. తోణాంలో గణనాథుడు అందరినీ అలరిస్తున్నాడు. చిన్న గ్రామమైన రేగాపు వలసలో భారీగా పెండాల్స్‌తో నిర్మించిన మండపాల వద్ద విగ్రహాలను నెలకొల్పారు. కోదుకరకవలస, గదబకర కవలస, మద్దెనవలస, ముంగివా ని వలస, దత్తివలస తదితర గిరిజన గ్రామాల్లో వినాయక ఉత్సవాలు వైభ వంగా నిర్వహిస్తున్నారు.



గదబకరకవలసలో బొజ్జగణపయ్య

పేరసాగరానికి జలకళ

●ఎగువన కురుస్తున్న వర్షాలతో చేరుతున్న నీరు

సాలూరు: పట్టణంలోని పేరసాగరానికి జలకళ వచ్చింది. పాచిపెంట మండలంలోని కొండల ప్రాంతంలో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో నీటి ప్రవాహం బాగా పెరిగింది. చెరుకుపల్లి గెడ్డ నీరు పట్టణ జాతీయ రహదారి పక్కనున్న కాలువ ద్వారా పేరసాగరంలోకి వస్తోంది. కాలువ నీరు కూడా జోరుగా సాగుతుండటం విశేషం. దీంతో సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పేరసాగరం పూర్తిగా నీటితో నిండి జలకళ సంతరించుకుంది. ఈచెరువు నుంచి దిగువన ఉన్న మరో ఐదు చెరువులకు నీరు వెళ్తోంది. ఆయకట్టు రైతులు చెరువుల్లో నీరు చేచడంతో ఆనందపడుతున్నారు. పట్టణంలో రోజూ మధ్యా హ్నం వేళల్లో వర్షాలు కురుస్తున్నాయి. దాంతో కాలువల నీరంతా పేరసాగరంలోకి చేరి సముద్రంలా తలపిస్తోంది. నీరు-చెట్టు పనుల్లో భాగంగా పేరసాగరం అభివృద్ధి చేయడంతో నీటి నిల్వ సామర్థ్యం పెరగింది. వర్షాలకు పట్టణంలో భూగర్భ జలాలు పెరగటంతోపాటు, రైతులకు సాగునీరు పుష్కలంగా అందనుంది.



జోరుగా ప్రవహిస్తున్న చెరుకుపల్లి గెడ్డ కాలువ



నీటితో నిండిన పేరసాగరం చెరువు

'బీసీల కు నష్టం కలిగేలా మాట్లాడం సరికాదు'



సాలూరు పట్టణ అధ్యక్షుడు తిరుపతిరావు

సాలూరు రూరల్: బీసీల ఓట్లతో విజయం సాధించి తిరిగి వారికి నష్టం కలిగేలా వారి రిజర్వేషన్లు ఇతరులకు ఇవ్వాలని డిమాండ్ చేయడం సరికాదని పట్టణ టీడీపీ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు అన్నారు. నియోజకవర్గంలో బీసీలు చెప్పుకోదగిన సంఖ్యలో ఉన్నారన్నారు. వారి ఓట్లతో విజయం సాధించి వారికి వ్యతిరే కమైన ప్రకటనలు చేయడం సరికాదన్నారు. టీడీపీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ మేరకు కమిషన్ వేసిందన్నారు. కమిటీ నివేదిక వచ్చిన అనంతరం ఇతర అగ్ర వర్ణాలను బీసీలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటుందన్నారు. ముద్రగడ ఉద్యమం రాజకీయ ప్రేరేపితమన్నారు. తన కీర్తిని పెంచుకోవడానికి టీడీపీ వ్యతిరేక శక్తులు చెప్పినట్టు ఆయన నడుచుకుంటున్నారని విమర్శించారు. రిజర్వేషన్లు సాధ నకంటే తన కీర్తిని పెంచుకోవడానికి ఆ యన ప్రధాన లక్ష్యంగా పనిచేయడం తగదన్నారు.

సినిమాలు

సాలూరు

లక్ష్మి..	నేనే రాజు నేనే మంత్రి
శ్రీలక్ష్మి..	ఆనందో బ్రహ్మ
శ్రీరామ ..	జయ జానకి నాయక
వెంకటేశ్వర..	ఫిదా
సూర్యమహల్ ...	ప్రతిక్షణం

నేడు కలెక్టరేట్ ఎదుట భోజన కార్మికుల ధర్నా

దాసన్నపేట: మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్నట్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం.మురళీధరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం ప్రైవేటు సంస్థలకు అప్పగించకుండా యధావిధిగా కొనసాగించాలని, గౌరవ వేతనం రూ.10వేలు ఇవ్వాలని, నాణ్యమైన కోడిగుడ్లు సరఫరా చేయాలని, సబ్సిడీపై గ్యాస్ సరఫరా, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేస్తున్నామన్నారు. పెద్ద ఎత్తున మధ్యాహ్న భోజన నిర్వాహకులు ధర్నాలో పాల్గొనాలని కోరారు.

నిర్వహణ భారం!

● నిధులు చాలడం లేదంటున్న సామూహిక మరుగుదొడ్ల నిర్వాహకులు ● రెండు మూడు నెలలకోసారి బిల్లులు ● అస్తవ్యస్తంగా మరుగుదొడ్ల నిర్వహణ ● కొరవడిన అధికారుల పర్యవేక్షణ




మూసివేసిన సామూహిక మరుగుదొడ్డి

విజయనగరం టౌన్: విజయనగరం పట్టణంలో సామూహిక మరుగుదొడ్ల నిర్వహణ భారంగా మారింది. మున్సిపల్ అధికారులు సక్రమంగా బిల్లులు అందించడం లేదు. దీంతో నిర్వాహకులు సైతం వీటి నిర్వహణ అంతంత మాత్రంగానే చేపడుతున్నారు. విజయనగరం పట్టణంలో 48సామూహిక మరుగుదొడ్లు ఉన్నాయి. వీటి నిర్వహణ బాధ్యతను డ్వాక్రా సంఘాలకు అప్పగించారు. ప్రతినెలా రూ.3వేలు మున్సిపాలిటీ అందజేస్తోంది. దీంతోనే మరుగుదొడ్ల నిర్వహణ బాధ్యతను చేపట్టాల్సివుంది. ఈ మొత్తం కూడా రెండు మూడు నెలలకోసారి ఇస్తోంది. నెలకోసారి ఇవ్వకపోవడం వల్ల మరుగుదొడ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది.

రూ.50లక్షలతో మరమ్మతులు చేసినా...

స్వచ విజయనగరంలో భాగంగా ఇప్పటికే రూ.50లక్షలతో మరుగుదొడ్లను మరమ్మతులు చేపట్టింది. వీటిలో నాలుగైదు మినహా మిగిలినవి మురికివాడల్లోనే ఉన్నాయి. మురికివాడల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునే అవకాశం లేకపోవడం వల్ల ఎక్కువ మంది సామూహిక మరుగుదొడ్లనే వినియోగిస్తున్నారు. వీటి నిర్వహణకు ఇచ్చే మూడు వేలలోనే స్వీపర్, ఫినాయిల్, చీపుర్లు ఇలా అన్నింటికీ ఉపయోగించాలి. ఈ మొత్తం చాలడం లేదన్న అభిప్రాయం నిర్వాహకుల నుంచి వ్యక్తమవుతోంది.

శ్రామిక సంఘ అధ్యక్షుడిగా 'అప్పారావు'

నెల్లిమర్ల: స్థానిక జూట్ మిల్లు శ్రామిక సంఘం అధ్యక్షుడిగా పతివాడ అప్పారావు ఎన్నికయ్యారు. సంఘం అధ్యక్షుడు ఎస్.గంగాధరరెడ్డి ఇటీవల మరణించడంతో మొయిదలో మాజీ మంత్రి సాంబశివరాజు స్వగృహంలో ఆదివారం జరిగిన శ్రామిక సంఘం కార్యవర్గ ఎన్నికలో అప్పారావును అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇంతవరకు అప్పారావు ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. తాజాగా అధ్యక్షుడిగా ఎన్నికవడంతో ప్రధాన కార్యదర్శి పదవి శీర వెంకటరావుకు దక్కింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు అప్పారావు, వెంకటరావు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. మిల్లు సక్రమ నిర్వహణ ద్వారా కార్మికులు ఉపాధి నిలబెట్టుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. కార్మికులకు మిల్లు యాజమాన్యం నుంచి రావాల్సిన అన్ని రకాల బకాయిలు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు మిల్లు యాజమాన్యంతో చర్చలు జరుపుతామన్నారు. గ్రాట్యుటీ బకాయి చెల్లింపునకు కృషి చేస్తామని, అర్హులైన కార్మికులందరికీ ఉద్యోగోన్నతి కల్పించడంతో పాటు అప్రంటిస్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ తదితర సదుపాయాలు అమలయ్యేలా చర్యలు చూస్తామని, అందరూ సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ చిక్కాల వెంకట గోవిందరావు, సంఘం ప్రతినిధులు కొమ్మూరు సత్యనారాయణ, రెడ్డి సన్యాసినాయుడు, బూడి సత్యనారాయణ, సముద్రపు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


ఎంపికైన అప్పారావు, వెంకటరావు

మూడేళ్ల పాలన అవినీతిమయం

● సీపీఎం డివిజన్ కార్యదర్శి శంకరరావు

దాసన్నపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మూడేళ్ల పాలన అవినీతిమయమని సీపీఎం డివిజన్ కార్యదర్శి రెడ్డి శంకరరావు అన్నారు. ఆదివారం డాబాతోట, రామకృష్ణనగర్, పువ్వాడ, కళాసీ జట్టు కేంద్రం వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మూడేళ్ల ప్రజా వ్యతిరేక విధానాలపై ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రణాళికా సంఘాలు రద్దు చేసిందని, కార్మిక చట్టాల్లో మార్పులు తీసుకు వచ్చి కార్మిక సంక్షేమాన్ని తుంగల్లో తొక్కిం దని విమర్శించారు. జీఎస్టీ పేరుతో ప్రజలపై భారాన్ని పెంచిందన్నారు. రోజురోజుకూ పెట్రోల్ ధరలు మండుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సీఎం చంద్రబాబు పుణ్యామని పరిశ్రమలు మూతపడి జిల్లాలో 30వేల కార్మికులు రోడ్డున పడ్డారని తెలిపారు. సంపాదనే తప్ప ప్రజా సంక్షేమాన్ని విస్మరించారన్నారు. సమావేశంలో రమణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి శంకరరావు

సీపీఎస్ విధానం రద్దు చేసే వరకూ పోరాటం

విజయనగరం టౌన్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేసే వరకూ పోరాటం చేస్తామని ఏపీటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎ.సదాశివరావు చెప్పారు. ఆదివారం ఏపీటీఎఫ్ కార్యాలయంలో అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఇప్పటికే పలు కార్యక్రమాలు నిర్వహించామన్నారు. భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. ఈ సమస్యల సాధనకు అందరూ సమష్టిగా పోరాటం చేయాలని కోరారు. మిలీనియం మార్చ్ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని తమ గళాన్ని వినిపిస్తామని తెలిపారు. నూతన సీపీఎస్ విధానాన్ని వద్దని అన్ని సంఘాలు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు డి.ఈశ్వరరావు, జెసీ రాజు, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలరించిన సంకీర్తనామృతం

దాసన్నపేట: వినాయకచవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రామనారాయణంలో ఆదివారం ఎ.లక్ష్మీశైలజచే ఏర్పాటు చేసిన సంకీర్తనామృతం కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. గణపతిని స్తూతిస్తూ ఏరీతిని కీర్తించునూ అంటూ ప్రారంభించిన కచేరీలో పలు కీర్తనలను ఆమె హృద్యంగా ఆలపించారు. మృదంగంపై శ్రీనివాస్, వయోలీన్‌పై సుబ్బరాజులు సహకారం అందించారు.


కీర్తనలు ఆలపిస్తున్న లక్ష్మీశైలజ



కృష్ణయ్యకు వినతిపత్రం ఇస్తున్న సంఘ జిల్లా నాయకులు

బీసీల సమస్యలు పరిష్కరించండి

దాసన్నపేట: జిల్లాలో 80శాతం ఉన్న బీసీల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాని బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు ముద్దాడ మధు కోరారు. ఆదివారం గుంటూరులో జరిగిన బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర సమావేశంలో పాల్గొని జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా మధు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రకటించిన అత్యంత వెనుకబడిన జిల్లాల జాబితాలో విజయనగరం జిల్లాను చేర్చేలా చూడాలని కోరారు. జిల్లాలో దారిద్ర రేఖకు దిగువన ఉన్న బీసీల కోసం ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేయాలన్నారు. కుల వృత్తిదారులకు సబ్సిడీపై పరికరాలు అందజేయాలని కోరారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా సంఘ ప్రతినిధి పి.భాస్కరరావు ఉన్నారు.

బాబామెట్టలో లక్ష కుంకుమార్చన


కుంకుమ పూజల్లో భక్తులు

దాసన్నపేట: పట్టణంలోని బాబామెట్ట శివపంచాయతన దేవాలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం 108 మంది దంపతులచే లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు గణనాథుని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.వి.పి.రాజు, కార్యదర్శి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలతో భవిష్యత్ నాశనం

● జనవిజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ రాజశేఖర్

దాసన్నపేట: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ ఎ.వి.రాజశేఖర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో 'మనోబలంతో మత్తు విముక్తి' అనే అంశంపై ఆదివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు బానిసవ్వడం వల్ల భవిష్యత్ నాశనమవుతుందని చెప్పారు. కేంద్రాసుపత్రి మానసిక చికిత్స విభాగాధిపతి డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ యువత మత్తుకు దూరంగా ఉండాలన్నారు. క్షణికావేశంలో చేసే తప్పులు జీవితాలను బలి చేస్తాయని తెలిపారు. ఒక ప్రణాళికతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ఎం.వి.ఆర్.కృష్ణాజీ, ఎం.వి.ఎస్.వెంకటరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రాజశేఖర్

ఆంధ్రజ్యోతి
4
సోమవారం 28 ఆగస్టు 2017
విజయనగరం
టౌన్ । రూరల్ । కలెక్టరేట్ । రింగురోడ్డు । దాసన్నపేట । కల్చరల్ ।

పాలిథిన్ నిషేధంపై విస్తృత ప్రచారం

విజయనగరం టౌన్: మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేయడం ద్వారా ప్రజల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చామని పర్యావరణ పరిరక్షణ ప్రతినిధులు పి.వి.నర్సింహారాజు, మేకా కాశీవిశ్వేశ్వరుడు, స్పార్క్స్ సంస్థ ప్రతినిధి పి.వి. పద్మనాభం చెప్పారు. అక్టోబరు నెలలో జరిగే అమ్మవారి జాతరలో పాలిథిన్ నిషేధానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజలను చైతన్యవంతులను చేసిన పలువురిని పర్యావరణ పరిరక్షణ సమితి, స్పార్క్స్ సంస్థలు ఘనంగా సన్మానించాయి. ఈ కార్యక్రమంలో స్వప్న హైందవి, సమాజ సేవకురాలు లక్ష్మీతో పాటు పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

విజయనగరం

ఆదిత్య	: అర్జున్‌రెడ్డి
శ్రీకృష్ణ	: జయజానకి నాయక
న్యూపూర్ణ	: నేనే రాజు నేనే మంత్రి
రంజని	: ఫిదా
శివరంజని	: ఆనందో బ్రహ్మ
హిమగిరి	: వివేకం
సప్తగిరి	: వివిపీ-2
లీలామహల్	: జయజానకి నాయక
ఎన్‌సీఎస్	: అర్జున్‌రెడ్డి

ఎన్‌సీఎస్ ఐనాక్స్

స్క్రీన్-1, స్క్రీన్-2, స్క్రీన్-3

ఆనందో బ్రహ్మ, నేనే రాజు నేనే మంత్రి, అర్జున్‌రెడ్డి, వివేకం, జయజానకి నాయక, లై

సమాచారం

గ్యాస్ ఏజెన్సీ ఫోన్ నంబర్లు

సాయి ఏజెన్సీ	: 08922-234523
ఎన్‌సీఎస్‌ఏజెన్సీ	: 08922- 224177, 233578
ఎన్‌వీఆర్ ఏజెన్సీ	: 08922-225810
శ్రీనివాసా ఏజెన్సీ	: 08922-224301, 285288

ఆర్టీసీ సమాచారం

విచారణ కేంద్రం	08922 225333
ఫిర్యాదుల విభాగం	7382923726
అడ్వాన్స్ బుకింగ్	08922 234911
టోల్‌ఫ్రీ నంబరు	1800 200 4599

ఎమర్జన్సీ సర్వీసెస్

పోలీస్	100
ఫైర్	101
ఆపద సమయాల్లో	108
బాలల సంరక్షణ కోసం	1098
కేంద్రాసుపత్రి అంబులెన్స్	08922 272124
ఘోషాసుపత్రి అంబులెన్స్	8008553401

రైతుబజారు ధరలు

కూరగాయలు	కిలో (రూ)
టమోటా (దేశవాళీ)	44-00
టమోటా(హైబ్రిడ్)	42-00
వంకాయలు	27-00
బీరకాయలు	22-00
బెండకాయలు	24-00
కాకర కాయలు	22-00
క్యాబేజీ	18-00
గోరు చిక్కుడు	22-00
దొండకాయలు	30-00
క్యారెట్	34-00
బీట్‌రూట్	25-00
ఉల్లిపాయలు	23-00
బంగాళదుంపలు	10-00
అల్లం	58-00
పచ్చిమిర్చి	45-00
క్యాప్సికమ్	50-00
కీర దోస	20-00

బంగారం ధరలు

24క్యారెట్లు (10 గ్రాములు)	29,720-00
22 క్యారెట్లు	27,780-00
వెండి కిలో	40,000-00

విద్యుత్ పునరుద్ధరణ పనులు ప్రారంభం

● స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో సిబ్బంది నిమగ్నం ● నాలుగు రోడ్లలో 70శాతం పనులు ● నెలాఖరులోగా పూర్తికి సన్నాహాలు

విజయనగరం టౌన్: విజయనగరం పట్టణంలో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు ఊపందుకుంది. రోడ్ల విస్తరణ నేపథ్యంలో ప్రస్తుతం వున్న ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు రోడ్డు మధ్యలోకి వచ్చాయి. దీంతో వీటిని రోడ్డు చివరకు అమర్చేపని ప్రారంభమైంది. పాత బాలాజీ జంక్షన్ నుంచి సింహాచలం జంక్షన్ వరకు, సింహాచలం జంక్షన్ నుంచి ధర్మపురి ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్, కోట జంక్షన్ నుంచి సింహాచలం మేడ, రింగురోడ్డు రైతు బజారు నుంచి కొత్తపేట నీళ్లట్యాంకు వరకూరోడ్ల విస్తరణ కార్యక్రమం ఒక కొలిక్కి వచ్చింది. ఈ నేపథ్యంలో ఆయా రోడ్లలో 11 ట్రాన్స్‌ఫార్మర్లు, 103 విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. వీటిని తప్పనిసరిగా మార్చాల్సిన పరిస్థితి ఈపీడీసీఎల్‌పై పడింది.

ఇప్పటివరకు 6 ట్రాన్స్‌ఫార్మర్లు, 80వరకూ స్తంభాల ఏర్పాటు కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. మిగతా 20శాతం పనులు ఈ నెలాఖరులోగా చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసే సమయంలో విద్యుత్ సరఫరాని నిలిపివేస్తున్నారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో ఆయా ప్రాంతంలో విద్యుత్ సరఫరాని నిలిపివేసి సాయంత్రం ఐదు గంటలకు తిరిగి పునరుద్ధరించారు. దీంతో విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. నెలాఖరులోగా మిగతా పనులు పూర్తి చేసేందుకు ఈపీడీసీఎల్ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

పైడిమాంబ జాతర కోసం ...

అక్టోబరు 2, 3 తేదీల్లో నిర్వహించే పైడితల్లమ్మ తొలేళ్లు, సిరిమానోత్సవానికి సంబంధించి విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈపీడీసీఎల్ ఏర్పాట్లు చేసుకుంటుంది. కలెక్టరు ఆదేశాల మేరకు మూడు లాంతర్లు నుంచి కోట, మూడు లాంతర్లు నుంచి గంటస్తంభం, రైల్వే స్టేషన్ రోడ్డులో ఎటువంటి విద్యుత్ లోపాలు లేకుండా ముందస్తుగా సిద్ధంగా వుండాలని విద్యుత్ శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ అధికారులు ఈ దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. సెప్టెంబరు నెల తొలివారంలో ఆయా రోడ్లలో పరిస్థితిని అంచనా వేసి, అవసరమైన చోట మరమ్మతులు చేపట్టనున్నారు.



తీగలు సరిచేస్తున్న సిబ్బంది

పేద విద్యార్థులను ఆదుకుంటాం

● సామాజిక సేవలు మరింత విస్తృతం
● పువ్వాడ ట్రస్టు చైర్మన్ సుబ్బరాజు
● 96 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేత

దాసన్నపేట: జిల్లాలో సామాజిక సేవా కార్యక్రమాలను విస్త్రతం చేస్తామని పువ్వాడ ట్రస్ట్ చైర్మన్ పువ్వాడ సుబ్బరాజు అన్నారు. కొత్తాగ్రహారంలోని పువ్వాడ ట్రస్టు కార్యాలయంలో మూడవ వార్షికోవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. 121 మంది డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, 16 మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు, ఐదుగురు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు, ఆరుగురు పాలిటెక్నిక్ విద్యార్థులు, 35 మంది టెన్త్ విద్యార్థులకు రూ.2.60లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ సుబ్బరాజు మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అనే ఆశయంతో సంస్థను స్థాపించామన్నారు. ప్రతిభ గల పేద విద్యార్థులు చదువుకునేందుకు ఆర్థికంగా సాయం అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగి మరో నలుగురికి సాయపడాలని కోరారు. ముఖ్యఅతిథులు సీతారామకృష్ణాచార్యులు, గోపాలరావు, సర్వేశ్వరరావులు మాట్లాడుతూ పేద విద్యార్థులను ఆదుకోవడంలో ట్రస్టు ముందుండడం అభినందనీయమని చెప్పారు. ప్రతి విద్యార్థికి ప్రథమ గురువు తల్లిదండ్రులేనని తెలిపారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ కూడా ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ శ్రీహరి, ప్రతినిధులు పి.గిరిధర్, సభ్యులు కె.ప్రకాష్, మార్కెండేయులు, విశ్వేశ్వరరావు, రవి, పెదబాబు, వెంకయ్య, నారాయణమ్మ, రాంజీ, సుదర్శన్ పాల్గొన్నారు.





ఉపకార వేతనాలు అందిస్తున్న సుబ్బరాజు, కార్యక్రమానికి హాజరైన వక్తలు, సంస్థ ప్రతినిధులు, విద్యార్థినీ విద్యార్థులు

చురుగ్గా మండప నిర్మాణం

విజయనగరం టౌన్: పట్టణంలోని కొత్తపేట, యాదవ వీధి కోదండ రామాలయానికి అనుకుని కల్యాణ మండప నిర్మాణం చురుగ్గా సాగుతోంది. మండపం పనులను ఆలయ కమిటీ ప్రతినిధులు ఆదివారం పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో బొట్ట భాస్కరరావు, ముచ్చి శ్రీనివాసరావుతో పాటు పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి బి.భాస్కరరావు ఈ మండపం నిర్మాణానికి రూ.5 లక్షలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో కలెక్టర్

అరసవల్లి: ప్రత్యక్షదైవం, ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామి వారిని కలెక్టర్ వివేక్‌యాదవ్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అనివెట్టి మండపంలో సహాయ కమిషనర్, ఇన్‌చార్జ్ ఈవో వి.శ్యామలా దేవి ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. జాయింట్ కలెక్టర్ చక్రధర్ బాబు, ఎస్పీ త్రివిక్రమవర్మలు సైతం కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. విశేష పూజలు జరిపారు. వీరికి ఆలయ అనివెట్టి మండపంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ వారికి స్వామివారి ఆశీర్వచనాలను, లడ్డూ ప్రసాదాన్ని, స్వామి వారి ఫొటోలను అధికారులకు అందజేశారు.



వివేక్‌యాదవ్‌కు చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో

చచ్చినా.. చావే!

● మృతదేహంతో పట్టాలపై నుంచి అరకిలో మీటరు దూరం మోత ● రైలు వస్తుందేమోనని భయం ● పురిటిపెంటలో శ్మశానానికి రోడ్డు లేక పాట్లు



మృతదేహాన్ని పట్టాలపై మోసుకెళ్తున్న దృశ్యం

గజపతినగరం రూరల్: ఎవరైనా కష్టాల్లో ఉన్నప్పుడు చస్తేనే సుఖం ఉంటుందని బాధపడుతుంటారు. కానీ, ప్రాణం పోయిన తరువాత కూడా సౌఖ్యంలేని దురావస్థ ఎదురైతే ఎలా ఉంటుంది. మండలంలోని పురిటిపెంటకు వెళ్తే ఆ కష్టం ఎలా ఉంటుందో అనుభవంలోకి వస్తోంది. మృతదేహాన్ని సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు చేద్దామన్నా వీలుకాని స్థితి గ్రామంలో నెలకొంది. శ్మశానానికి రహదారి లేకపోవడంతో మృతదేహాన్ని రైలు పట్టాలపై నుంచి నడుచుకుని తీసుకువెళ్లాల్సి వస్తోంది. పురిటిపెంట రైల్వే కాలనీకి చెందిన తాండంగి చిన్నమ్మి శనివారం మృతి చెందింది. ఆమె మృతదేహానికి ఆదివారం దహన సంస్కారం నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు, కాలనీవాసులు ఇబ్బంది ఎదుర్కొన్నారు. మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకువెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం లేక పోవడంతో రైలు పట్టాలపైనుంచి తీసుకువెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. సుమారు అర కిలో మీటరు దూరం పాడితోపాటు మృత దేహాన్ని కుటుంబ సభ్యులు, బంధువుల మోసుకువెళ్లేందుకు అష్టకష్టాలు ఎదుర్కొన్నారు. పంచాయితీ పాలకులు, అధికారులు శ్మశాన వాటికల అభివృద్ధికి చర్యలు తీసుకోకపోవడంతో ఈదుస్థితి నెలకొందరు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పోటా.. పోటీ!



బాల్‌ను అడ్డుకుంటున్న గోల్ కీపర్



బాల్ కోసం పోటీ పడుతున్న క్రీడాకారులు

● హోరాహోరీగా రీజనల్ హ్యాండ్‌బాల్ పోటీలు ● గెలుపే ధ్యేయంగా సర్వశక్తులు ఒడ్డుతున్న క్రీడాకారులు ● నేడు ఫైనల్స్

శృంగవరపుకోట రూరల్: కిల్తపాలెం నవోద య విద్యాలయంలో రీజనల్ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. పోటీలు అద్యంతం ఎంతో ఉత్సాహభరితమైన వాతవర ణంలో జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన మొత్తం 48 జట్లు తలపడుతున్నాయి. తమ శక్తి సామర్థ్యాలు నిరూపించుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. రెండో రోజైన ఆదివారం ఉదయం 7 గంటలకు పోటీలు ప్రిన్సిపాల్ దామ అంజయ్య ప్రారంభించారు. లీగ్, క్వార్టర్స్, సెమీస్ పోటీల్లో జట్లు తల పడ్డాయి. ఒకరికి మించి మరోకరు అద్భుత ప్రదర్శనలతో అకట్టుకున్నాయి. కొన్ని జట్లు ఫైనల్స్‌కు చేరాయి. ఆదివారం ఫైనల్స్ జరగనున్నాయి. ఇందులో గెలిచిన జట్లు వచ్చే నెల బీహార్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాయి.

ఇదిలా ఉండగా, మైదానంలో కొట్టాం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది శిబిరం ఏర్పాటు చేసి, క్రీడాకారులకు వైద్యసేవలు అందిస్తున్నారు. అలాగే పీఈటీలు జనార్దననాయుడు, లక్ష్మీప్రసన్నలతోపాటు అధ్యాపకులు రాఘవేంద్రరావు, త్రినాథరావు, మూర్తి, రవిరాజా తదితరులు పోటీలను పర్యవేక్షిస్తు న్నారు.





విజయోత్సవంలో బాలికలు, మైదానంలో హోరాహోరీగా తలపడుతున్న దృశ్యం

● దృఢ సంకల్పంతో..

- సీహెచ్ గోపిచంద్, అండర్-19 హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు



ఇప్పటికే హ్యాండ్‌బాల్ పోటీల్లో ఒకసారి జాతీయ స్థాయి విభాగంలో పాల్గొన్నా. ఇప్పుడు జరుగుతున్న పోటీల్లో మరోసారి సత్తాచాటి, జాతీయ స్థాయి పాల్గొనాలని దృఢ సంకల్పంతో ఉన్నాం. ఫైనల్‌లో విజేతగా నిలవాలని బరిలోకి దిగుతాం.

● జాతీయ స్థాయిలో ఆడతా

- పి.రాజేష్, అండర్-17 హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు



ఇప్పటివరకు రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడాను. మొదటిసారి మా జట్టు ఫైనల్‌కు చేరింది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే జాతీయ స్థాయిలో ఆడే అవకాశం వస్తుంది. క్రీడల్లో రాణిస్తే, భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు అవకాశం ఉంటుంది.

● ఉత్సాహంగా ఆడుతున్నా..

- సిరిపురపు సృజన, అండర్-17 హ్యాండ్‌బాల్ క్రీడాకారిణి



నేను రెండుసార్లు రీజనల్ హ్యాండ్‌బాల్ పోటీల్లో గెలిచి, జాతీయ స్థాయిలో ఆడాను. ప్రస్తుతం జరుగుతున్న హ్యాండ్ బాల్ పోటీలు ఎంతో ఉత్సాహంగా సాగుతున్నాయి. వీటిలో కూడా రాణించి, మూడోసారి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సర్వశక్తులు ఒడ్డుతాం.

నేటి నుంచి నార్త్‌జోన్ క్రికెట్ పోటీలు



● తలపడనున్న ఎనిమిది జట్లు ● మైదానాలను సిద్ధం చేసిన అధికారులు

విజయనగరం రూరల్: ఆంధ్రా క్రికెట్ అసోషియేషన్ (ఏసీఏ) ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి 18 వరకు జరగనున్న నార్త్‌జోన్ క్రికెట్ పోటీలకు సర్వం సిద్ధం చేశారు. దీనిలో భాగంగానే ఆదివారం డెంకాడలో క్రికెట్ అకాడమీ మైదానంలో మాల్ ప్రాక్టీస్ చేశారు. ఈ పోటీల్లో 8 జట్లు పాల్గొననున్నట్టు నార్త్‌జోన్ క్రికెట్ పరిపానాధికారి త్రినాథ్ రెడ్డి తెలిపారు. పూల్-ఏలో ఆంధ్రా బరోడా క్రికెట్ అకాడమీ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, నైరుతి ప్రొవెన్షియల్ క్రికెట్ అసోసియేషన్, పూల్-బిలో ఆంధ్రా-11, గుజరాత్ ఏఎన్‌జీసీ హెచ్‌పీసీ జట్లు మధ్య మూడు లీగ్ మ్యాచ్‌లు జరగనున్నాయని వెల్లడించారు. తొలి లీగ్ మ్యాచ్ 28 నుంచి 31 వరకు, రెండో మ్యాచ్ సెప్టెంబరు 3 నుంచి 6 వరకు, మూడో మ్యాచ్ 9 నుంచి 12 వరకు జరుగుతాయన్నారు. వీటిలో అగ్రస్థానంలో నిలిచిన జట్లు ఫైనల్ మ్యాచ్‌లో తలపడనున్నాయి. ఈ పోటీలు విజయనగరం ఏసీఏ నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ, విజ్జీ మైదానం, చింతలవలస ఎంవీజీఆర్ కళాశాల మైదానం, విశాఖ వీడీసీఏ మైదానంలో నిర్వహించనున్నట్టు వెల్లడించారు.



సిద్ధమైన డెంకాడ మైదానం

ఇళ్ల నిర్మాణం తక్షణమే ప్రారంభించండి

● కలెక్టర్ వివేక్ యాదవ్

కలెక్టరేట్: 2016-17 ఆర్థిక సంవత్సరంలో జిలాలో ఎన్టీఆర్ గృహ పథకానికి సంబంధించి మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులు వచ్చే శనివారం లోగా ప్రారంభించాలని కలెక్టర్ వివేక్ యాదవ్ ఆదేశించారు. ఆదివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హౌసింగ్ శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018-19 సంవత్సరానికి ప్రతిపాదనలు సెప్టెంబరు 5వ తేదీలోగా అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఉపాధి హామీ పథకం నిధులు వినియోగించి 90 రోజులు పనిదినాలకు సంబంధించి బిల్లులు చెల్లించాలని సూచించారు. అనంతరం మరుగుదొడ్ల నిర్మాణంపై ఎంపీడీవో, వెలుగు, పంచా యతీరాజ్, ఉపాధి అధికారులతో సమీక్షించారు. జిల్లాలో చేపట్టిన లక్ష మరుగుదొడ్ల నిర్మాణంలో అందరిని భాగస్వామ్యం చేయాలని చెప్పారు. ఈ సమీక్షలో ఏజేసీ నాగేశ్వరరావు, జడ్పీ సీఈవో అనిత, డ్వామా పీడీ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వివేక్ యాదవ్